ISSN No:2581-7477

# సాహిత్య ప్రస్థానం

Sahitya Prasthanam

సంపుటి - 1 సంచిక - 6 మార్చి - 2020 కృష్ణా పేజీలు 68 వెల రూ. 20



సాహితీస్రవంతి



# సాహిత్య ప్రస్థానం

సంపాదకీయం


## ఉద్రిక్త రాజధానిలో ప్రశాంతత

పౌరసత్వ సవరణ చట్టం(సిఎఎ) కు నిరసనగా ఢిల్లీలో 70 రోజులుగా సాగుతున్న ఆందోళనపై కాల్పులు హింసాత్మక ఘటనలు అత్యంత ఆందోళనకరం. ఈ చట్టాన్ని దేశంలో 12 రాష్ట్ర ప్రభుత్వాలు వ్యతిరేకిస్తున్నాయి. అనేక రాజకీయపార్టీలు, సంఘాలూ, మేధావి బృందాలు వద్దని చెబుతున్నాయి. ఆఖరుకు సుప్రీం కోర్టు కూడా దీనిపై విచారణ చేపట్టింది. తెలుగు రాష్ట్రాలతో సహా దేశ వ్యాపితంగా నిరసన ఉద్యమాటు నడుస్తున్నాయి. నిరసన తెల్పడం ప్రజాస్వామ్య హక్కు అని కూడా అత్యున్నత న్యాయస్థానం పదే పదే వ్యాఖ్యలు చేసింది. ఇలాటి తరుణంలో షహీన్ బాగ్ నిరసనపై కేంద్ర పాలకులు నిందారోపణల భాషలో మాట్లాడ్డం, కొందరు మరింత దూరం వెళ్లి విద్వేషం కురిపించడం దిగ్భ్రాంతి కలిగిస్తుంది. 70 రోజులకు చేరిన ఈ ఆందోళనలో నిన్న మొన్నటి వరకూ ఎలాటి హింసాత్మక దృశ్యాలు చూడలేదు. ఢిల్లీ ఎన్నికల సమయంలో కొందరు కేంద్ర మంత్రులు, ఎంపిలు చేసిన కవ్వింపు ప్రసంగాల తర్వాత ఇద్దరు ఉన్మాదులు వెళ్లి కాల్పులు జరిపినా నిరసన శిబిరం ప్రశాంతంగానే కొనసాగింది. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ రాక సమయంలోనూ అవాంఛనీయ ఘటనలు చూళ్లేదు. అలాటిది ఆయనపర్యటన ముగింపు రోజున ఈశాన్య ఢిల్లీలో కేంద్ర పాలక పార్టీ రాష్ట్ర నేత ఆయుధాలతో సంచరించి ఆవేశం పెంచడం ఆ వెంటనే అల్లర్లు ప్రజ్వరిల్లడం గమనించదగ్గది. వారిపై ఎఫ్ఐఆర్ ఎందుకు నమోదుచేయలేదని ఢిల్లీ హైకోర్టు సుప్రీం కోర్టు కూడా ప్రశ్నించాయి. పోలీసులు సకాలంలో వచ్చివుంటే ఇంత దారుణం జరిగి వుండేది కాదని కూడా సుప్రీం న్యాయమూర్తులే అన్నారంటే పరిస్థితి తెలుస్తుంది. 1984 ఢిల్లీ సిక్కు ల వూచకోత, 2002 గుజరాత్ మారణకాండ వంటివాటిని ఈ సందర్భంలో గుర్తు చేసుకుని దేశం ఆందోళన చెందుతున్నది. ఇప్పటికే 35 మంది వరకూ మరణించారు. పోలీసులు కూడా ప్రాణాలు కోల్పోవడం, గాయపడటం జరిగింది. లోపలి పేజీలలోని ఒక వ్యాసంలో పేర్కొన్నట్టు ఈ సంఘర్షణలో మతపరమైన విద్వేషం తాండవించింది. ఢిల్లీ శాంతి భద్రతలు కేంద్రం బాధ్యత గనక తక్షణం సైన్యాన్ని దింపి శాంతిని నెలకొల్పడం మరికొంత కాలం అప్రమత్తత కొనసాగించడం అత్యవసరం. ఈ నిరసనోద్ధృతిని చూశాకనైనా సిఎఎను వెనక్కు తీసుకోవడం జరగాలి. దేశంలో శాంతి భద్రతలు మత సామరస్యం కాపాడుకోవాలి. ♦


| సంపాదకుడు | సంపాదకవర్గం: | బొమ్మలు: |
| --- | --- | --- |
| తెలకపల్లి రవి | కె. సత్యరంజన్ ◆ చీకటి దివాకర్ | తుంబలి శివాజి |
| వర్కింగ్ ఎడిటర్ | గనారా ◆ శమంతకమణి ◆ కెంగార మోహన్ | చిదంబరం |
| వొరప్రసాద్ | మేనేజర్: కె.లక్ష్మయ్య | గంగాధర్ వీర్ల |

Owned, Printed and Published by **V. Krishnaiah** 41-9 -16, 1st Floor, F-3, Ramalayam Street, Near Kalpana Prints, Krishna Lanka, Vijayawada (Urban) - 520013, Krishna District. Andhrapradesh. Printed at Sri Chaitanya Offset Printers, 29-7-36, Vishnuvardhan Rao Street, Suryaraopet, Vijayawada - 520 002, Andhrapradesh. Published at 27-30-4, M.B.Vignanakendram, 3rd Floor, Akulavari Veedhi, Governorpet, Vijayawada - 520 001, Andhrapradesh. Editor : Telakapalli Ravi

## ఈ సంచికలో ... సాహిత్య ప్రస్థానం మార్చి 2020

### కథలు


**బాబోయ్ చదువులు** - అయ్యగారి సీతారత్నం........... 5
**భవ బంధాలు** - బి. హేమమాలిని...................... 15
**గే-మ్** - డాక్టర్ మాటూరి శ్రీనివాస్..................... 24
**పెద్దమ్మ పెరుగు** - ఆర్.సి. కృష్ణస్వామి రాజు.......... 51


### కవితలు


**అమానుష దుఃఖం** - డా॥ విజయ్ కోగంటి.............. 8
**నేనెవరో తెలియదు** - బి.నాగేశ్వరరావు ................. 11
**అమ్మ గర్భాన్ని కాలదన్నుకొని** - సాంబమూర్తి లండ... 14
**చీపురు మనిషి** - ఈతకోట సుబ్బారావు ............... 19
**స్వార్థాన్ని గెలుద్దాం** - ఎస్.ఆర్. పృథ్వీ.................. 22
**దుఃఖ సమాధి** - రాఘవేంద్ర గండ్లూరి................... 23
**తోడూ నీడా** - కొలూరి ప్రసాదరావు..................... 30
**మళ్ళీ మనుష్యులని నిద్రలేపుదాం**
- డా॥ కత్తి పద్మారావు.............................. 31
**బుస కొడుతున్న ప్రశ్నలు** - అమ్జద్....................... 36
**పిడికిలి బిగించిన** - అడిగోపుల వెంకటరత్నం.......... 40
**టెక్నాలజీ +, - ఆలోచించు** - ఆర్. లక్ష్మి............. 40
**నీకు నాకు ఒకటే దారి** - అవ్వారు శ్రీధర్‌బాబు......... 43
**వెలుగు పూలు** - దామరకుంట శంకరయ్య............. 43
**మట్టికుండ** - ఆవుల వెంకటేసులు......................... 46
**నానీలు** - కె. ఎల్. సత్యవతి............................. 49
**ఆ రాత్రి కళ్ళు సైతం** - కొండా శిరీష.................... 50
**మది సంఘర్షణ** - స్వప్న మేకల......................... 50
**మౌన సంభాషణ** - విల్సన్‌రావు కొమ్మవరపు............ 54
**కన్నీటి కావ్యం** - తిరునగరి శరత్‌చంద్ర................ 59
**పూడిక** - చొక్కాపు లక్ష్మునాయుడు....................... 59


### వ్యాసాలు


**సాహిత్య ప్రస్థానం ఫిబ్రవరి 2020 పురస్కారాలు**....... 8
**స్థానిక చరిత్ర శోధనకు ఆలంబన**
- డా. కేతు విశ్వనాథ రెడ్డి.......................... 9
**కథా భారతికి స్వాగతం** - పి. సత్యవతి.................12
**గొర్లకాపరుల జీవనపోరాట చిత్రణ**
- నందవరం కేశవరెడ్డి........................... 20
**ప్రపంచీకరణ - వ్యవసాయం, కులవృత్తులు - సీమకవిత్వం** - డా॥ రాధేయ..................... 32
**ఆముదపు చెట్టే బోధివృక్షం** - కెంగార మోహన్....... 37
**తెలుగువాడి 'గోల్డెన్‌ట్రెజరీ** - నందనోదయ............ 41
**హస్తినలో విషబీజాలతో నెత్తుటి సేద్యం**
- సుబోధ్ వర్మ..................................... 44
**ఒక బుద్ధిజీవి అంతరంగాలాపన**
- మందరపు హైమవతి........................... 47
**అన్నమయ్య సంకీర్తనల్లో జానపద కళారూపాలు**
- డాక్టర్ కందిమళ్ళ సాంబశివరావు............. 55
**స్వీకారం**.............................................. 60
**డైరీ** ................................................. 65



ISSN No: 2581 - 7477


**సాహిత్య ప్రస్థానం మాసపత్రికను ప్రోత్సహించండి. తెలుగు భాష, సాహిత్య వికాసాలకు మీరూ తోడ్పడండి !**


రచనలు, చందాలు, విరాళాలు, మనీ ఆర్డర్లు, చెక్కులు, డిడిలు పంపవలసిన చిరునామా:


సాహిత్య ప్రస్థానం, 27-30-4, ఎం.బి. విజ్ఞానకేంద్రం, 3వ అంతస్తు, ఆకులవారి వీధి, గవర్నరుపేట, విజయవాడ - 520002.
ఫోన్: 0866-2577248, సెల్: 9490099059
ఇ-మెయిల్ : ssprasthanam@gmail.com, వెబ్‌సైట్ : www.prasthanam.com


1 సంవత్సర చందా రూ. 240/- ◆ 5 సంవత్సరాల చందా రూ.1000/ ◆ 10 సంవత్సరాల చందా రూ. 2000/-

Bank A/c Details: A/c Name: PRASTHANAM, SBI, Governorpet, Vijayawada. A/c No. 52001500585, IFSC: SBIN0020343. చెక్కులు, డిడిలపై prasthanam అని రాయగలరు.

# బాబోయ్ చదువులు



- అయ్యగారి సీతారత్నం
8247385015

తలుపు తట్టిన శబ్దానికి వెంటనే గబగబా వచ్చి తలుపు తీసి “అరె నాన్నా వచ్చేసావా? బయల్దేరుతున్నా బస్ స్టాండ్‌కి” అన్నాడు ఆత్రుతగా.

“ఫరవాలే! అరగంట ముందు వచ్చేసింది. దగ్గరే గదా అని వచ్చేస్తా” నవ్వుతూ అన్నాడు నాగులు.

“బాగున్నారా, కోడలేదీ”

“చంద్రీ నాన్న వచ్చేసాడు” అన్నాడు గట్టిగా ఫోన్ మాట్లాడుతున్న చంద్రిక నవ్వుతూ వచ్చి నీళ్ల గ్లాసు చేతిలో పెట్టి ఒక్క నిమిషం అన్నట్టుగా సైగచేసి ఫోను పట్టుకొని వెళ్లిపోయింది.

“వాళ్ల అన్నతో మాట్లాడుతోంది. వాళ్లతో మాట్లాడితే ఫోను ఎప్పటికీ పెట్టదు” అన్నాడు విసుగ్గా.

“అన్నదమ్ములమీద ఆశ ఉంటుంది గదా” అని “అప్పి ఏడిరా” అన్నాడు.

“కాలేజీకి వెళ్లిపోయాడు. బస్సు ఏడుగంటలకే వస్తుంది. మళ్లీ రాత్రి 8 గంటలకి వస్తాడు.”

“అయ్యో చూడ్డం అవ్వదా.”

“రెండ్రోజులుండవా”

“అబ్బే సాయింత్రం వెళ్లిపోవాలి. తమ్ముడి దగ్గర దింపి నువ్వు అలా ఆఫీసుకి వెళ్లిపో.”

“నేను సెలవు పెట్టా..” అని ఊరు కబుర్లు అడుగుతూ పక్కనే కూర్చున్నాడు.

అరగంట తర్వాత టీ పట్టుకొని వచ్చింది చంద్రి.

“మావయ్యా తీసుకో”

“ఆ, అమ్మా, నాన్న బాగున్నారా?” అడిగాడు నాగులు.

“ఆ.. అన్న కూతురు పెళ్లి మాఘమాసం ఫిబ్రవరిలో నేను ఎలా వెళ్తా. బాబు ఇంటర్ కదా, పరీక్షలు. మార్చమంటే వినట్లేదు అన్న. మూడు రోజులకు ఏవిటే వచ్చేయే అన్నాడు. అదే వాళ్ళబ్బాయి అప్పుడు వదిన ఎలా ఉండేది. అసలు మాతో కళ్లెత్తి మాట్లాడేవారా. తల్లీకొడుకూ మావాడు పోయినా ఫరవాలేదనేగా అంది అక్కసుగా.”

“అలా ఎందుకనుకొంటావ్ మగపెళ్లివారికి కూడా నచ్చాలిగదా. అయినా మూడురోజులకేం ఫరవాలే.”

“మావాడి ఇంటర్‌కి కూడా విలువ ఇవ్వాలిగదా” అంటూ బేగ్ పక్కన ఉన్న కవరు చూసి “ఏవిటి మావయ్య” అంది.

“ఇలా తే” అని జిప్ తీసి దాన్లోంచి బేట్స్ బయటకు తీసి “బాబీ పుట్టినరోజు కదా బావున్నాయా” అన్నాడు.

“బాగున్నాయి నాన్నా”

“పుట్టినరోజుకి మీరు రారుగదా. నాకు రావడం అవదు. వాడే చెప్పాడు. గిఫ్ట్ తెచ్చి ఇచ్చేయ్ తాతా అనీ.” అన్నాడు సంతోషంగా.

చంద్రిక ముఖం ఎత్తలేదు పైగా సీరియస్‌గా “ఈ బేట్లు చూస్తే చదువు చెట్టెక్కేస్తుంది. అసలు వాడికి ఆటపిచ్చి. నానాబాధపడితే కొంచెం మారాడు. ఏంటో మావయ్యా ఇంటర్ తర్వాత ఇవ్వొచ్చు పైన పెట్టేద్దాం. ఏవీ అనుకోవద్దు” అని గబగబా పట్టుకుపోతుంటే.

“అరే వాడిచేతిలో పెట్టేక, చూసేక చెప్పి దాచేద్దువుగానితే. ఆ మరమరాలుండలు తీసుకువెళ్లు పిల్లలకి...”

“చూసాడంటే లొంగడు” అని ఎవరిమాటా వినేది లేదన్నట్టుగా పట్టుకు వెళ్లిపోయింది.

నాగులు ముఖం చిన్నబోయింది. వెంకట్ గుర్తించి "నాన్నా స్నానం చెయ్యి, టిఫిన్ తిన్నాక అన్నయ్య దగ్గరకి వెళ్దాం"

"అలాగే" అని వెళ్లాడు.

తయారయివచ్చి " చంద్రీ, ఆ బాట్లు ఇలా ఇయ్యి. ఊల్లో తమ్ముడి మనవడికి ఇస్తా. సంతోషిస్తాడు. వీడికి తర్వాత కొంటాలే. రెండేళ్లు దాచడం ఎందుకు" అనగానే దాచిన బేట్స్ తెచ్చి ఇచ్చేసింది.

♦♦♦

మధురవాడ నుండి సాగర్ నగర్ వెళ్తున్నారు. "విశాఖపట్టణం చాలా బాగుంది గదరా! సాగర్ నగర్ అద్దెలు తక్కువగదరా నువ్వు పెద్దాడికి దగ్గరగా వచ్చేయిరా" అంటూ బండిమీద వెనుకాతల కూర్చున్నాడు నాగులు.

"చంద్రీ మేనత్త ఇల్లుగదా. మాకు తక్కువకి ఇచ్చారుకదా వాడికి బస్ వస్తుంది. పిల్లలు చదువు అయ్యేదాకా అక్కడే నాన్నా."

"వొరేయ్ చిన్నా.. అప్పిని ఒకసారి చూడాలని ఉందిరా. కాలేజీకి వెళ్దాం. నిన్న కూడా తాతా కాలేజీకి వెళ్లేకన్నా ముందేరా తాతా అన్నాడు. కానీ రాలేకపోయా"

"చాలా దూరం నాన్నా...."

"ఫరవాలేదు బస్సులో వెళ్దాం"

"మీ అమ్మ నూపప్పు చెక్కీ వాడికోసం చేసి ఇచ్చింది. మన చేలో నువ్వులు. ఇంకా నల్లనువ్వులు కడగలేదు. వాడికోసం తవ్వెడు నానబెట్టి కడిగి చేసిందిరా. వాడిచేతిలో పెట్టకపోతే అది దిగులుపడుతుందిరా. అసలే వాడిమీద దిగులు దానికి"

"అదికాదు నాన్నా..."

"వాడిది వాళ్ల నాన్న పేరుకదా. వాడంటే దానికి ప్రాణం..."

ఆ మాటకి నవ్వి "నాన్నా, నీకొకటి తెలుసా రోజు మీ తాతెందుకు అంత పాతపేరు పెట్టుకున్నాడు. అదే నాకు పెట్టారు. ఛా.. ఛా... తాతలందరకీ మోడ్రన్ పేర్లు పెట్టాలి అంటాడు. ఒక రోజైతే నేను చరణ్ అని మార్చేసుకున్నా అంతా పిలవండి అని గోలపెట్టేసాడు."

"సింహాద్రి అప్పన్న కులదైవంరా! అయినా పట్టణంలో పిల్లలంతా జతకట్టారుగా. వాడిపిల్లవాడు మన జొన్నడ పిల్లాడు కాదు. వాడికొడుక్కి వాడికి నచ్చిన నాజూకైన పేరెట్టమను"

"నేనూ అలాగే అన్నాను. వాడు అన్నాడు. ఎవరి పేరు వాళ్లకి నచ్చిందే ఉండాలంట. వాడి కొడుక్కి ......సింహాద్రి అప్పన్న అని రాసి వాడు పెద్దయ్యాక నచ్చింది పెట్టుకోమంటాడట. అప్పుడే పేరు రిజస్టరు చేయిస్తాడట. వాడు భలే మాట్లాడుతున్నాడు" అని "నాన్నా బండి అన్న ఇంట్లో పెట్టి బస్సులో వెళ్దాం. అక్కడ బండిపెట్టడానికి స్థలం ఉండదు."

♦♦♦

"రా నాన్న" అంటూ ఆనందంగా బాగ్ అందుకొని "ఏంటిరా ఇంతాలస్యం. గంటాగితే నేనూ ఆఫీసుకి పరిగెత్తాలి. వదిన వెళ్లిపోయింది"

"నాన్న వచ్చిందే 7.30" అంటూ బాగ్, బేట్స్ లోపల పెట్టాడు.

"మా జున్ను పాపకూడా వెళ్లిపోయిందా" అన్నాడు నాగులు.

"అవును నాన్నా ఇంటర్ కదా 7 గంటలకే. అద్దె కాలేజీయే కాని దాని కాంపస్ చాలా దూరం. వాళ్లిద్దరే కలవరు" అన్నాడు పెద్దాడు.

"నాన్నా చూడండి మావదన్న మాట అమ్మవారి జాతరకి వస్తావు కదా....."

"ఇంకా జాతరలేంటినాన్నా... ఇంటర్ కదా సెలవు ఇవ్వరు" అంటూనే ఉప్మా ప్లేటులో పెట్టి ఇద్దరికీ ఇచ్చాడు. "వంట చేసింది. ఇక్కడికే రండి. నేనూ వస్తా" అంటూ హడావుడిగా తయారయిపోయాడు ఆఫీసుకి.

♦♦♦

బస్ దిగి కాస్తా దూరం నడిచాక "నాన్నా ఇదే కాలేజీ" అని ఒక పెద్ద అపార్ట్మెంట్కి తీసుకువెళ్లాడు. సెల్లార్లో కూడా రిసెప్షన్ రూమ్ బయట కుర్చీలు, ఒక మూలగా పెద్ద కారు. గిడసబారిన మొక్కలతో ఎనిమిది గోలాలు అక్కడక్కగా. ఎక్కడా స్థలం లేదు. ఇరుగ్గా ఉంది.

కాలేజీ అంటే పెద్ద గ్రౌండ్ గాంధీబొమ్మ, జెండ ఎగరవేసే స్థంబం, పెద్ద పెద్ద చెట్లు మంచి మాటల బోర్డులు.. ఉంటాయనుకున్న నాగులుకి అయోమయంగా అన్పించింది. పెద్ద ఫ్లెక్సీలు మాత్రం రెండు పైన కన్పిస్తున్నాయి.

"నాన్నా వీళ్లందరికీ క్రిందటేడు మంచిరేంకులు వచ్చాయన్నమాట. అవే ఈ ఫ్లెక్సీలు. చాలా మంచి కాలేజీ కొంచెం ఫీజులెక్కువ అందుకే" అంటూ రిసెప్షనిస్ట్ దగ్గరకు వెళ్లాడు.

అరగంట బ్రతిమిలాడాక క్లాస్ టీచర్కి ఫోను చేసి బ్రేక్ 10 నిమిషాలలో వెళ్లి కలవమన్నారు.

గబగబా మూడో అంతస్తు ఎక్కారు. రూమ్ నెం. 303కి వెళ్లారు. క్లాసులోకి గబగబా వెళ్లిన నాగులుకి అప్పి ఎక్కడున్నాడో తెలియలేదు. యూనిఫాంలో అంతా ఒకేలాగే ఉన్నారు.

"తాతా నువ్వేంటీ అన్నాడు ఆశ్చర్యంగా"... కాస్త లేవడం కష్టమయ్యింది.

ఆఖరి బెంచీలో లావుగా కొంచెం బొజ్జతో ఉన్నాడు. తన మనవడూ అప్పేనా అని అవాక్కై అయిపోయాడు.

"ఏంటిరా అంత చివరా.."

"నీ పోలికే పొడుగ్గా ఉంటాగా వెనక్కి పంపేసారు..." నాగులు సన్నగా రివటలా ఉంటాడు. ఎక్కడా ఔన్సు కొవ్వుకూడా శరీరంలో ఉండదు. మనవడు కూడా అలానే ఉండేవాడు. కానీ ఇప్పుడు లావుగా బొజ్జవేలాడుతూ ఎనిమిది నెలల్లో ఎంతో మారిపోయాడు.

ఉదయం బస్సులో 7 గంటలకు గేటుదగ్గర దిగుతాడు. సాయంత్రం 7 గంటల దాకా అదే రూమ్‌లో ఒకరి చేతులు ఒకరికి తగులుతూ ఒకరి ఊపిరి ఒకరికి తగుల్తూ ఆరుల్లేవు ఏం చదువులో, ముందురోగం వస్తుందేమో అనుకున్నాడు నాగులు.

వెంటనే నవ్వుతూ "అప్పీ బేట్లు కొన్నాను నీ పుట్టినరోజుకి తెచ్చారా ఇదిగో..." అది చేతిలో పెట్టగానే గబగబా బయటకి తీసి "థ్యాంక్స్ తాతా" అంటూ దగ్గరగా వెళ్లి పక్కనుండి తాతని దగ్గరగా తీసుకున్నాడు. వాటిని చూడగానే చుట్టూ ఇరవై మంది చేరారు. ''వెరీనైస్...'' అంటూ ఒక్కొక్కరూ తాకి మురిసిపోతున్నారు. అంతే ఎక్కడినుండి వచ్చాడో ఫ్లోర్ మేనేజర్ వొచ్చాడు రొప్పుతూ.. "సర్ ప్లీజ్ ఇలాంటివి చూస్తే పిల్లలందరికీ చదువుమీద ధ్యాస ఉండదు" అని సీరియస్‌గా "అటెండర్ని పిలిచి రిసెప్షనిస్ట్ దగ్గర పెట్టిస్తా... వెళ్లేటప్పుడు తీసుకోమనండి" అన్నాడు. ఉసూరుమన్నాడు అప్పి. అప్పితో కూడా మిగిలిన పిల్లలు కూడా వాడిని చూస్తే నాగులుకి దిగులేసింది.

చదువుకోక ఏడోతరగతిలో మానేసాను కాబట్టి మట్టి పిసుకుతున్నా... కష్టమే మిగుల్తోంది. ఎప్పుడు అప్పులా వాళ్లు ఆటలు మానేస్తేనే బాగుపడతారేమో అనుకున్నాడు అమాయకంగా అప్పుడే మోగింది బెల్. వెంటనే అటెండర్ వచ్చాడు. పిల్లల్ని క్లాసులోకి తరిమేసాడు. గబగబా నూపప్పు చెక్కి తీసి చేతిలోపెట్టి "బామ్మ నీకోసం చేసిందిరా" అన్నాడు. "థ్యాంక్యూ తాతా" అనేలోపే అటెండర్ వచ్చి "ఏమండి ఏమండి" అని తరిమేసాడు.

♦♦♦

ఇంటికి వచ్చేసరికి పెద్దకోడలు కూడా పర్మిషన్ పెట్టి వచ్చింది. ముగ్గురికి వడ్డించింది.

వదిన అన్న ప్రెస్ చేసారు. మూడోసారి అడగమని వెంకట్‌ని.

"నాన్నా" అన్నాడు మోహమాటంగా

"చెప్పు"

''నాన్నా చెరో లక్ష మీరు సర్దితేగాని చదువులు తట్టుకోలేరు"

"అంతా నష్టమేరా మదుపు తాకటాకటిగా వచ్చేయి" దీనంగా అన్నాడు నాగులు.

"అదికాదు నాన్నా ఫీజు ఒక లక్షా 50 వేలు. ముప్పై కట్టి చేర్చాము. కట్టకపోతే ఇంటికి పంపేస్తాం అంటున్నారు. ఎక్కడనుండి తేవాలి"

"అందుకని పొలం తాకట్టుపెట్టి..."

"ఒరేయ్ రెండెకరాలు మీ సదువుకి, మీ చెల్లి పెళ్లికి తనఖా పెట్టి విడిపించలేకపోయా... ఉన్నవి మూడే గదరా ఇవి లేకుంటే ఏం తింటాంరా" నాగులు ముకంలో చాలా దీనత్వం.

కొడుకులిద్దరూ దిగాలు పడిపోయారు. నాన్నకి ఇవ్వడం పోయి అడగాల్సి వచ్చింది. వెదవ జీతాలు అనుకున్నారు. ఎం. కాం చదివిన పెద్దవాడికి ఆటోమొబైల్ లో 12000 రూ. జీతం. ఎం.బి.ఎ చదివిన రెండోవాడికి 13000 రూ. జీతం. ఫీజులు 1,50,000 రూ. మార్కులు తక్కువ వస్తే ఇంకా పెంచేస్తారు. అవిగాక బస్సుకి, పుస్తకాలు, బట్టలు ఫీజు రియంబర్స్ మెంటు ఉందనుకొని తెగించి 30,000 రూ. కట్టి మొదట జాయిన్ చేసారు. ప్రభుత్వం డబ్బులు ఇవ్వడంలేదు. కాలేజీవాళ్లు ఒప్పుకోవడం లేదు. ఏం చేయాలి. కొడుకులిద్దరి మొఖంలో ఆందోళన.

పెద్దకొడుక్కి అర్ధమయింది. పెద్ద కోడలు ఆ క్షణం మెత్తబడితే లాభం లేదనుకొంది. "వెధవపొలం పోతేపోయింది ఫరవాలేదు మరి. పిల్లల ఫీజులు ముఖ్యం మా బతుకుల్లా ఈడుస్తూ కాకూడదు" అంది గట్టిగా.

నాగులుకి మతిపోయింది. చేతిలో బేట్లు తన ప్రేమకి చిహ్నం అనుకున్నవి ఎక్కసక్కంగా బరువుగా అన్పించాయి. కొడుకు ముఖం చూస్తే గుండెపిండేసినట్లయింది. సెలవు తనమీద ప్రేమతో పెట్టలేదు. సెలవులెక్కడ దొరుకుతాయి ప్రేమకి. కోడలు అంతలోనే ఎక్కి ఎక్కి మొదలెట్టేసింది. "మావయ్యా ఏవనుకోకు" అంటూ

బిక్క చచ్చిపోయాడు నాగులు.

"అలాగేనమ్మా... మీ కన్నానా... కానీ పెద్దిరెడ్డి అమెరికా వెళ్లాడు. నాయుడు అప్పిస్తాడోలేదో. పాతబాకీ ఉందిగా. చూద్దాంలే..." అని చేతిలో బేటులతో బరువుగా బయల్దేరాడు.

♦

## సాహిత్య ప్రస్థానం ఫిబ్రవరి 2020 పురస్కారాలు

**ఒక జ్వలనం గురించి**
కవితకు : రూ.500/-
రచయిత : బి. గోవర్ధనరావు

**అనంత కరువు సంతకం**
వ్యాసానికి : రూ. 500/-
రచయిత : డా. బి. నాగశేషు

■■■

*కవితకు డా॥ ఎద్దుల సిద్ధారెడ్డి స్మారక పురస్కారం,*
*వ్యాసానికి కర్లపాలెం రుక్మిణమ్మ పురస్కారం చెక్కులు ఈ రచయితలకు అందుతాయి*

■■■

*పాఠకులు తాము చదివిన కవితలు, కథలు, వ్యాసాలలో నచ్చినవి కారణాలతో సూచించవచ్చు. సీనియర్, ప్రసిద్ధ రచయితల రచనలు కాక ఔత్సాహికులను, ఇటీవల రాస్తున్నవారిని ప్రోత్సహించడమే ఈ పురస్కారాల ఉద్దేశ్యంగా గ్రహించగలరు. తగిన రచనలు లేనప్పుడు పురస్కారాలు ప్రకటించబడవు.*
**- ఎడిటర్**

**కవిత**

## అమానుష దుఃఖం

- డా॥ విజయ్ కోగంటి
8309596606

ఒకడు నల్లగా
ఇంకొకడు ఎర్రగా
పుట్టినప్పటినించీ అల్లరి గుంటలే
ఎక్కడ పడితే అక్కడ ఆడుతూ
కొట్టుకుంటూ
నేలను పడి పొల్లికింతలు పెడుతూ
అందరూ తిడుతున్నా
సిగ్గు లేకుండా నవ్వుకుంటూ
చూడగానే పరిగెత్తుకొచ్చి
కాళ్ళకడ్డం పడి
చెవులు కొరికి
పొట్టమీంచీ ఇటూ అటూ దొర్లి
ఒకటే ఆటలు



ఇపుడిపుడే కండపడుతున్న కూనలు
అందరి దిష్టీ వారిమీదే
చీకటి పడ్డాక నాతోనే వుండమని చెప్తా
వినక ఒకటే ఆటలు


సాయంత్రం నుంచీ వెతుకుతున్నా
ఆటలాడీ ఆడీ అలిసి
రోడ్డు కవతలే ఒకళ్ళ డొక్కలో ఇంకోడు
ముడుచుకు పడి నిద్ర పోయినట్టున్నారు

వచ్చి చూద్దును గదా నిద్ర పోవట్లేదు
ఏ బండి వాడో నిర్దయగా తొక్కిపోయాడు
అవి ముద్దాడిన బుజ్జి మూతులు
నాపైకెక్కి తొక్కిన చిన్ని కాళ్ళూ
చితికి పోయి ఎర్రటి ముద్దలై నా పిల్లలు రెండూ
ఇంకా నన్నే చూస్తున్నట్లూ
తోకలు వూపుతూ నవ్వుతున్నట్లు
నా బుజ్జి కూనలు నా కన్నీళ్ళై
ఆ రెండూ


మేమెక్కడున్నా
అన్ని చోటుల నించీ విదిలించి తోలేవారెవరూ
అక్కడ పడుకోకూడదని వీటికి చెప్పలేదెందుకో
చూస్తూ తొక్కి పోయేందుకు మనసెలా వొప్పిందిరా
పోండ్రా పోండి
తొక్కుకుంటూనే పోండి
అబలల్నీ అడ్డమొచ్చిన వాళ్ళనీ
మా లాటి బడుగు జీవుల్నీ అందరినీ

మీరంటే మీకే సోయి లేదు
ఇక మమ్మల్నేం బతకనిస్తారు ♦

# స్థానిక చరిత్ర శోధనకు ఆలంబన




పెనుగొండ లక్ష్మీనారాయణ



**- ఆచార్య కేతు విశ్వనాథరెడ్డి**

చరిత్ర రచనలో స్థూల చరిత్ర నుంచి సూక్ష్మ చరిత్ర వరకు పరిణామాలు వచ్చాయి. ప్రపంచ చరిత్ర ప్రస్తావన వచ్చే వేళకు హెచ్.జి.వెల్స్ ప్రపంచ చరిత్ర స్మృతికి వస్తుంది. అట్లాగే జవహర్‌లాల్ నెహ్రూ ప్రపంచ చరిత్ర కూడా మనసుకు తడుతుంది. ఇటీవల ప్రపంచ చరిత్ర స్వతంత్ర రచనకు తెలుగులో జరిగిన కృషికి తార్కాణంగా డాక్టర్ ఎం.వి. రమణారెడ్డి ప్రపంచ చరిత్రను పేర్కొనవచ్చు. ఇది ఇంకా పూర్తికాలేదు. ప్రపంచ చరిత్ర అంటున్నప్పుడు రాజ్యాల చరిత్ర, దేశాల చరిత్ర, నూతన ఆవిష్కరణలు, రాజ్యాలు దేశాలపై వాటి ప్రభావాలు, పాలకులు జయాపజయాలు ఉత్థాన పతనాలు ప్రాధాన్యం వహిస్తాయి.

అట్లాగే వివిధ యుగాలుగా విభజించి రాసిన దేశాల చరిత్రలు కూడా. అయితే ఇవేవీ హోవర్డ్ జిన్ రాసిన 'అమెరికా సంయుక్త రాష్ట్రాల ప్రజల చరిత్ర' లాంటివి కావు.

స్థూల చరిత్ర నుంచి సూక్ష్మ స్థాయికి రావడం ఇటీవల దశాబ్దాల్లో జరిగిన పరిణామం. ఈ కారణంగానే ప్రాంతాలు, ఉపప్రాంతాలు చరిత్రలో భాగంగా స్థానిక చరిత్రలు చోటు చేసుకున్నాయి. రాష్ట్రాల పునర్విభజన తర్వాత ఆయా రాష్ట్రాల చరిత్ర రచన మీద చరిత్రకారులు శ్రద్ధ వహించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటుతో రాష్ట్ర చరిత్ర రచనతోపాటు జిల్లాల చరిత్ర రచన మీద కూడా శ్రద్ధ పెరిగింది. తెలంగాణ చరిత్రకారులు మరొక ముందడుగు వేసి స్థానిక సాహిత్య రచనలు కూడా వివరించే ప్రయత్నం చేశారు. ఇది ఒక విధంగా శకలీకరణ ప్రయత్నమేమో అనుకోవచ్చు. కానీ స్థానిక చరిత్ర గతిశీలతను రాష్ట్ర దేశ గతిశీలతలో భాగంగా పరస్పర ప్రభావాల నేపథ్యంలో భాగంగా చూచినప్పుడు ఆయా ప్రజా సముదాయాల ఆకాంక్షలను పాలక పాలిత సముదాయాలను అర్థం చేసుకోవడానికి వీలుపడుతుంది. స్థానిక చరిత్రలు స్థూల చరిత్ర నిర్మాణానికి దోహదం చేస్తాయి.

జిల్లాలు ప్రమాణంగా చరిత్ర రచనలు స్వాతంత్ర్యానంతరం కొన్ని వచ్చాయి. ఆయా జిల్లాల సాహిత్య చరిత్ర రచనలు వ్యాసాల రూపంలో వచ్చాయి. కానీ పుస్తక రూపంలో రావడం పెనుగొండ లక్ష్మీనారాయణ గుంటూరు సీమ సాహిత్య చరిత్రతోనే ప్రారంభం అయింది. ఆంధ్రప్రదేశ్‌లోని జిల్లాల సాహిత్య చరిత్రలు స్థూలంగా వ్యాసం రూపంలో చాలానే వెలువడ్డాయి. రాయలసీమ సాహిత్య ప్రక్రియ ఆరంభ వికాసాల మీద విశ్వవిద్యాలయాల్లో పరిశోధన వ్యాసాలు వెలువడ్డం కూడా జరిగింది. అయితే వివిధ సాహిత్య ప్రక్రియల పరిణామం ఆ సాహిత్య ప్రక్రియల వికాసానికి తోడ్పడిన కవులు, రచయితలు, నాటకకర్తలు విమర్శకులు, పరిశోధకులు కృషిని వివరించిన రచన ఒకచోట లభించదు. అట్లాగే సాహిత్య సంస్థలు, సాహిత్య పత్రికలు, ప్రచురణ సంస్థలు, సత్కారాల వివరాలు మనకు ఒక చోట లభించవు.

గుంటూరు సీమ సాహిత్య చరిత్ర ఆ ప్రాంత గుర్తింపు చైతన్యంతో రచయిత వ్రాసాడని అనుకునే అవకాశం లేకపోలేదు. కానీ రచన మొత్తం చదివినప్పుడు తెలుగు సాహిత్య చరిత్రలో గుంటూరు సీమ చరిత్ర ఒక విడదీయరాని భాగం అని తెలుగు సాహిత్య చరిత్ర నిర్మాణానికి దోహదం చేశాయని

భారతదేశంలో జరుగుతున్న పరిణామాల నేపథ్యంలో వికసించాయని బోధపడుతుంది.

గుంటూరు సీమ సాహిత్య చరిత్రలో మూడు భాగాలు కనిపిస్తాయి. మొదటి భాగంలో పద్యం, గేయం, వచన కవిత్వం, కథానిక, నవల, నాటకం, బాలసాహిత్యం, విమర్శ, పరిశోధన రంగంలో జరిగిన కృషిని పెనుగొండ పాఠకుల ముందుంచాడు. అలాగే అనువాద రంగం సాహిత్య సంస్థలు పత్రికలు ప్రచురణ సంస్థల కృషిని వివరించాడు. నిజానికి ఆయా అంశాల మీద ప్రత్యేక గ్రంథాలనే వెలువరించే అవకాశం ఉంది. ఈ మొదటి భాగంలో దాదాపు వెయ్యి మంది రచయితల ముఖ్య రచనలను పెనుగొండ పేర్కొన్నాడు. రెండు మూడు భాగాలలో సమకాలీన సాహిత్యం సమాజంలోని ముఖ్యమైన అంశాలను విశ్లేషించాడు. ఈ విశ్లేషణలో స్పష్టంగా పెనుగొండ అభ్యుదయ దృక్పథం కనిపిస్తుంది. గుంటూరు సీమ సాహిత్య చరిత్రలో భాగమైన వ్యాసాలను కూడా పొందుపరిచాడు. అనుబంధంలో ప్రత్యేకంగా కథా రచయితల రచయిత్రుల చలన చిత్ర రచయితలు, నటులు, విదేశాలలో సాహిత్య కృషి చేస్తున్న గుంటూరు సీమవాసుల జాబితా, అరసం గుంటూరు శాఖ నిర్వహించిన కృషి వివరాలు కనిపిస్తాయి. సుదీర్ఘమైన ఈ అనుబంధంలో రచయితల రచయిత్రుల జీవిత కాలము కుండలీకరణంలో పొందుపరచి ఉంటే బాగుండేది.

గుంటూరు సీమ సాహిత్యం నుండి వెలువడిన విమర్శ అధ్యాయంలో ఆధునిక విమర్శ పోకడలను పెనుగొండ వివరంగా పరామర్శించాడు. ముఖ్యంగా ఆధునికానంతరవాదాన్ని ద్రవాధునికతను విశ్లేషిస్తూ పాపినేని శివశంకర్ అవిచ్ఛిన్నత అనే నూతన భావనలకు సంబంధించిన ప్రతిపాదనలను పెనుగొండ పరామర్శించాడు. పాపినేని శివశంకర్ "నిశాంత" వ్యాస సంపుటిలోని పరిణితిని వివరించాడు. అస్తిత్వ సాహిత్య ఉద్యమాల సైద్ధాంతిక చర్చను కూడా వివరించాడు. తెలుగు సాహిత్య విమర్శ కొత్త సాధనాలను సమకూర్చుకోవాల్సిన అవసరాన్ని కొత్త పరిభాషను భావనల్ని కల్పించుకుంటూ నిర్వచించుకుంటూ, నిర్ధారించుకోవాల్సిన అగత్యాన్ని శివశంకర్ ఉల్లేఖనాన్ని పెనుగొండ మన ముందుంచాడు.

ఈ గ్రంథంలో కొందరి స్వీయ చరిత్ర జీవిత చరిత్రలు కూడా పెనుగొండ పరిచయం చేశాడు. వీటిలో పులుపుల వెంకట శివయ్య, వై విజయ్‌కుమార్, షేక్ నాజర్ ఆత్మకథలు ప్రధానమైనవి. ముఖ్యంగా షేక్ నాజర్ తన ఆత్మకథలో ప్రాచీన జాతి కళా వంశీయులైన సోది, యానాది, ఎరుకల, మాదిగ, చిందు, డక్కలి జాతుల వారిని పేర్కొనడం ప్రజా కళా సంస్కృతిని గుర్తించిన వైనాన్ని పెనుగొండ ఉదహరించాడు.

మధ్య భాష, మండలమైన గుంటూరు సీమ మాండలికంలో జరిగిన పరిణామాలను వివరిస్తూ వృత్తులకు, దళిత కులాలకు సంబంధించిన మాండలికాలను గమనంలోకి తీసుకోవాలని ఆ జీవద్భాషలోని రచనలను పెనుగొండ పేర్కొన్నాడు. భాషలో జరిగే పరిణామాలను గతితార్కిక భావనతో చూడాలని "వీరభాషాభిరామ.... గుంటూరు సీమ" అన్న జాషువా కాల్పనిక మధుర భావనను పెనుగొండ గుర్తించడం ఒక విశేషం.

గుంటూరు సీమ సాహిత్య చరిత్రలోని వినుకొండ సాహిత్య చరిత్ర ప్రత్యేకంగా పేర్కొనదగినది. పెనుగొండది వినుకొండ సీమలోని నూజెండ్ల మండలం చెర్వుకొమ్ముపాలెం గ్రామం జన్మస్థానం. కాబట్టి తెలుగు సాహిత్యంలో వినుకొండ సీమకున్న ప్రత్యేకతను సంగ్రహంగా నైనా ప్రముఖంగా పేర్కొన్నాడు. దళితులు సాహితీవేత్తలై ఉత్తమ సాహిత్యాన్ని అందించారని వామపక్ష భావజాలం కూడా ఎక్కువ మంది రచయితల మీద ఉందని పెనుగొండ పేర్కొనడంలో జన్మస్థలం మీద అభిమానమే కనిపిస్తుంది కానీ దురభిమానం కనిపించదు.

గుంటూరు సీమ సాహిత్య చరిత్ర రచనలో కొట్టొచ్చినట్టు కనిపించే మంచితోపాటు మూడు భాగాల మధ్య సమన్వయలేమి పాఠకుల్ని బాధిస్తుంది. రెండవ ముద్రణలో ఈ మూడు భాగాల మధ్య ఉండే అన్యోన్య సంబంధాలను సమన్వయం చేసి పెనుగొండ రచించాలని నా ఆకాంక్ష. ఆ ఆసక్తి పెనుగొండకు ఉంది.

పెనుగొండ సాహిత్య చరిత్రలో కొనసాగించవలసిన సాధన, శోధన, పరిశోధనల అవసరాన్ని గుర్తించడం అతని నిజాయితీకి నిదర్శనం.

చరిత్ర రచనలో కొనసాగింపే గానీ ముగింపు ఉండదు. గుంటూరు సీమ సాహిత్య చరిత్ర రచన ఆంధ్రప్రదేశ్‌లోని ఇతర జిల్లాల పరిశోధకులకు రచయితలకు ప్రేరణగా నిలుస్తుందనడంలో సందేహం లేదు. ఇతర జిల్లాల సాహిత్య చరిత్రలు వెలువడినప్పుడు అవి తెలుగు సాహిత్య చరిత్రను సుసంపన్నం చేస్తాయనడంలో సాధ్యమైన సమగ్రతను చేకూరుస్తాయనడంలో సందేహం లేదు. ♦

## కవిత

# నేనెవరో తెలియదు

- బి. నాగేశ్వరరావు
7981024227



నేను!
నిజాలకు నగిషీలు చెక్కుతుంటాను
ఇజాలకు సూట్లు తొడుగుతుంటాను
విజ్ఞానానికి ఊపిరిపోస్తుంటాను
అజ్ఞాన తిమిరానికి వెలుగు చూపిస్తుంటాను
మట్టి ముద్దలకు అక్షరాలు పొదిగి
అందమైన స్వర్ణ కిరీటాలు సృష్టిస్తుంటాను
అయినా నేనెవరికీ తెలియదు
అంగట్లో వాటివెనుక వేరే పేర్లుంటాయి
అంగడికోసం నేనెప్పుడూ అంగలార్చలేదు
అందుకే నాకిక్కడ అడ్రసుండదు

కడుపు మాడ్చుకుని పండించే పంటను
కసాయి దళారికి ధారపోసిన
లౌక్యం తెలియని చిన్ని రైతుని
ప్రేమగ పిలిచే కపట పిలుపుకు దాస్యం చేసే
శ్రమదోపిడికి గురైన సగటు శ్రామికుడిని
సారె తిప్పి తిప్పి గూనె వంగినా
కలల గూడు నిర్మించుకోలేని కుమ్మరిని
పిల్లా జెల్లా కలిసిపడ్డ శ్రమంతా
పొలం యజమాని కాలికింద పోసే కౌలుదారుడ్ని
నా కష్టం వారిష్టానికి బలౌవుతున్నా
నేనెవరికీ తెలియదు


కొండల్ని పిండి చేస్తాను
భవనాలకు పునాది నౌతాను
తోటలో పూలగుత్తినౌతాను
మండుటెండలో చెమట చుక్కల్ని మండిస్తుంటాను
మురికి కాల్వల్ని శుభ్రం చేసి ఉరకలెత్తిస్తుంటాను
అయినా నేనెవరికీ తెలియదు!

సెంటు పూసిన చేతులు
నా భుజం తట్టగా అంటే సువాసనలు,
నా కంటి నీటిని, ఒంటి చెమట చుక్కని
తన కంటించుకునే తుండుగుడ్డ,
అలసిన ఒంటికి కలిగిన కంటినిద్ర
గొంతులో ఎవరో ఒకరు పోస్తున్న కాఫీ చుక్కలు,
చెవిలో కొందరు నింపిన పొగడ్తల టానిక్కులు,
తిరిగే కాలికి అరిగిన చెప్పులు,
ఇవే నాకు మిగిలిన ఆస్తులు!!
ఇంక నేనెవరికి తెలుస్తాను!

ఇప్పుడిప్పుడే జ్ఞానచక్షువులు తెరుచుకుంటున్నాయి
నా పిడికిట నిండిన మెతుకులతో నా పొట్టనిండాక
నాలాంటి వాడి ఆకలి తీరుస్తున్నాను!
నా దోసిట పట్టిన నీళ్ళతో నా దాహం తీర్చుకున్నాక
వేరొకరి గొంతు తడుపుతున్నాను!
మిణుగురులను నక్షత్రాలను చేసే సాహసం మాని
మిణుకుమంటున్న మట్టి రేణువుల్ని
పసిడిరాశులుగ మార్చ పాటు పడుతున్నాను

నా చేతులు ప్రపంచ చరిత్రకు ఊతలు కావాలని
నా గీతాలు కోయిల గొంతుకు తీపినంటించాలని,
రేయికి వెన్నెలలా పగటికి వెలుతురులా
ఒకరికి తోడుగా నడుస్తూ, సరికొత్త బాటలు వేస్తున్నాను!
నా చేతలు చైతన్యాలైతే చాలు, నా బాటలు పూలబాటలైతే
మేలు
నేనెవరికీ కనిపించనక్కరలేదు!! ♦

## విశ్లేషణ




# కథాభారతికి స్వాగతం

ఎండపల్లి భారతి



- పి. సత్యవతి

**త**న కథల గురించి భారతి వ్రాసుకున్న పరిచయమే చాలు నిజానికి. ఎంతో వినమ్రంగా హుందాగా ఉన్న ఆ ముందుమాటకి ఇంక నేను వ్రాసేది వెనుక మాటే. జీవితంలో అనేక ఆటుపోట్లు ఎదుర్కొని, కొన్ని భయంకరమైన అనుభవాలను ఎవరితో చెప్పకుండా దాచుకున్న, గరళకంఠి అయిన అమ్మమ్మ లచ్చమమ్మ పెంపకంలో పెరిగి, ఐదోక్లాసు వరకే చదువుకోగలిగి, పన్నెండేళ్లకే పెళ్ళి చేసుకుని, ఆ పైన అవ్వాతాతల్ని కూడా పోగుట్టుకున్న భారతి, ఇవాళ ఒక పత్రికకి విలేఖరిగా ప్రజాస్వామిక రచయిత్రుల వేదికలో మాట్లాడబోతున్నది. నీడలనుంచీ వెలుగులోకి పాకి వచ్చిన ధీర ఈ భారతి. ఆత్మీయులందర్నీ కోల్పోయినా ఊరు ఆమెను కడుపులో పెట్టుకున్నది. పెనిమిటి శ్రీనివాసులు సహచర మిత్రుడైనాడు. కథలు వ్రాయడం ఎలా? వాక్యనిర్మాణం ఎలా వుండాలి? శిల్పం మాటేమిటి? ఈ తర్జన భర్జన కతీతమైన జీవితశకలాలు ఈ చిన్నచిన్న కథలు. అంతా అనుభవసారమే. అందుకే భారతికథలు అభివృద్ధి చెందుతున్న భారతదేశపు క్రీనీడలను చూపించిన కాగడాలు. పాతికకు పైనున్న ఈ కథల్లో ఆమె చిన్నతనపు రోజుల మొదలు, నోట్ల రద్దు, పల్లెలపై కూడా టీవీల ప్రభావం వరకూ ఒక పరిణామ క్రమం వున్నది. మారీమారని పల్లెబ్రతుకు వెతలున్నాయి. తన అమ్మనుడిలోనే కథ చెబుతూ చివర్లో కొన్ని జీవితసత్యాలను అలవోకగా మన మీదకి విసురుతుంది. చాలా ఒడుపుగా, నగర మధ్యతరగతి భద్రజీవుల కథలు కావివి. కులం రీత్యా వర్గం రీత్యా సమాజపు అంచులలోనుంచీ ఇంకా నడిమధ్యకు రావడానికి పెనుగులాడుతున్న జనం వెతలు.

ఇందులో ఒక కథ 'సావుబియ్యం', ఇంట్లో పొయ్యి వెలిగించలేదు. వండడానికి బియ్యంలేవు. మూడుమైళ్ళు నడిచి చావుగుంట కాడికిపోయి తనూ ఒక గుడ్డ పరుచుకుని కూర్చుని వాళ్ళిచ్చిన రాగులూ వడ్లూ తెచ్చి, దంచి ఇంత కూడు ఉడకేసి తల్లికి పెట్టి తనూ తిన్నది. ఆ పూటకి కడుపు నిండింది. సారాయి తాగేసి ఇంటికొచ్చి చట్టిలో వున్న కూడు తినేసిన తండ్రి, విషయం తెలిసి, "అయ్యో అవి సావుబియ్యం. మనం తినకూడదు. తింటే మనమూ చచ్చిపోతాం" అంటాడు. పిల్లకి భయంవేసి పొద్దున్నే బోయకొండవ్వని అడిగింది. ఆమె ఏమన్నదంటే "తిక్కల బిడ్డా! సావుబియ్యమూ బతుకుబియ్యమూ అని వుండవు. కాలే కడుపుని చల్లేర్చే బియ్యమే వుండేది..." అంటుంది. ఇట్లా ప్రతి కథలోనూ ఏదో ఒక సత్యాన్ని గుండెకు గురి పెడుతుంది భారతి.

ఇందులోని కథలన్నీ ఒక్క బిగిన చదివిస్తాయి, కదిలిస్తాయి, కొన్ని కాస్త ఎక్కువ కదిలిస్తాయి. అట్లాంటి కొన్నింటిని ఇక్కడ ప్రస్తావించి ఈ కథలపుస్తకంలో నా పేరు కూడా కలుపుతున్నందుకు సంతోష ఋణం తీర్చుకుంటాను. 'మాయన్న సదువు' అనే కథ, మరీ బాగా గుండెకు తగిలే బాణం. ఈ కథలో చిన్నపిల్లా ఆమె అన్నా కొంత మాంసం

ఇంటికి తెస్తారు, దాన్ని తునకలు చేసి కుండలో దాస్తుంది తల్లి. అది వాళ్ళకు చాలా రోజులు తిండీ చిరుతిండీ కూడా. అన్న అప్పుడప్పుడూ నాలుగు తునకలు కాల్చుకుని జేబులో వేసుకుని బడికి తెచ్చుకుని తింటూ వుంటాడు. ఒకరోజు పంతులుగారికి వీడు క్లాసులో తునకలు తింటున్నాడని తెలిసి అతన్ని కులం పేరుతో తిట్టి బాగా కొట్టి బయటికి తరిమేస్తాడు. ఆ దెబ్బకి ఆ పిల్లాడు చదువు మానేసి ఎండలో పొలంపనికి పోతాడు. బడులు మానేసి పనుల్లోకి పోవడానికి ఎన్ని శక్తులు పనిచేస్తాయో! పిల్లల్ని బడికి పంపని తల్లితండ్రులని శిక్షించాలని తీర్మానాలు చేసే మేధావులకి, ఆ పిల్లలు ఎందుకు బడి మానేస్తున్నారో ఇలాంటి ఒక కథ చదివి వినిపించాలి.

ఆడవాళ్ళు కష్టపడి పైసా పైసా కూడబెట్టి సంసారానికి పనికొచ్చే ఏదో ఒక వస్తువు ఇత్తడిబిందె లాంటిది కొనుక్కుని మురిసిపోతే అది సారాయి అంగడికి చేరడానికి ఎంతో కాలం పట్టదు. త్రాగడం, పెళ్ళాలను కొట్టడం, 'నక్కాముట్టీ' ఆడదానికి ఇంట్లో వున్న వస్తువు ఏదైనా అమ్మడం మామూలు విషయాలు అప్పుడు.

లచ్చుమవ్వ, కథ చెప్పే పిల్లకి అమ్మమ్మ. ఆమె అనుభవాలు దాచుకుని దాచుకుని ఒక తిరణాలకు వెళుతూ మనవరాలికి చెప్పుకుంటుంది. పొలాల్లో పనిచేసుకుని బ్రతికే మాదిగ ఆడవాళ్ళు భూస్వాములకు చులకన. ఏదో వంకతో వెంట పడతారు. ఎలాగో తప్పించుకున్నా ఒక్కొక్కసారి వారికి దొరికిపోతారు. వీళ్ళు ఆ అవమానాన్ని ఎవరికీ చెప్పుకోలేరు. గొంతులోనే పెట్టుకు బ్రతకాల్సిన విషం. ఎక్కడో కాలుజారి పడ్డానని అబద్ధం చెప్పి కప్పిపుచ్చుకోవాలి. పరువు పోయే విషయం మగని చేతిలో అవమానం. అతనికి ఇకనుంచీ ఎల్లప్పుడూ అనుమానమే. భర్త ఆమెని ఇంట్లో నుంచీ వెళ్ళగొడితే సత్రంలో రాత్రంతా గడిపింది. ఈ కథను చాలా నేర్పుగా చెబుతుంది మన భారతమ్మ. తన అమ్మమ్మ లచ్చుమమ్మతో తిరణాలకి పోతూ దారిలో కనపడ్డ ఒక్కొక్క ప్రదేశాన్నీ చూసి, అక్కడ తనకి జరిగిన అనుభవ పరాభవాలని అమ్మమ్మ చేత చెప్పిస్తుంది. ఒంటినిండా వెండినగలతో పచ్చబొట్లతో చిగురించిన చింతమానులా వుండే లచ్చుమమ్మ "ఆడదాని బతుకు అందరికీ అదవే" అంటుంది చివరికి. ఒక్కొక్క కథ చివరా గుండె ఒక్కొక్క గురి.

ముసలితనంలో కూడా చావని కోరికతో పెళ్ళాలని వేపుకు తినే మొగుళ్ళు, ఎవరికీ సంతృప్తిలేని శృంగారం, అదొక హింస, ఈ హింసని 'పాపం గెంగవ్వ', మొగునిపోటుకులు కథల్లో చూడవచ్చు. అటు కులంపేరుతో ఇటు బీదరికంతో మగవాళ్ళ తాగుడుతో చాకిరీతో అల్లల్లాడే ఈ స్త్రీలకు ఆచారాల పేరుతో కూడా అలవిమాలిన హింసలు, హృదయ విదారకమైనవి. 'సచ్చి సాధించడం' కథ ఇంకా ఇప్పుడు కూడానా అని ఆశ్చర్య పోయే కథ. పచ్చని స్త్రీ జీవితం ఒక దుష్ట ఆచారం మూలంగా మోడివారిపోయిన కథ. ఆ దుష్ట ఆచారం ఇట్లా కొనసాగకుండా చెయ్యడానికి ఎవరు పూనుకోవాలి.

భారతి కథల్లో నవ్వుతో ముగిసేవీ వున్నాయి. 'ఈరవ్వ ఏమి తినబెట్టిందో' లాంటివి. కానీ ఒకటీ రెండే. 'కుట్టేవానికి మెట్టు కరువు', 'తడిక తోసింది ఎవరు', 'గురువు దేవర', కులపు అణిచివేత వేదింపుల కథలు. అవి ఆడవారికీ మగవారికీ కూడా సమానమే.

'కడుపులు కాల్చిన కందిబేడలు', 'నల్లడబ్బు' సాగుతున్న చరిత్ర తునకలు. వృద్ధులకిచ్చే పింఛను డబ్బు వాడుకోకుండా కడుపు కట్టుకుని మొలసంచుల్లో పదిలంగా పెద్దనోట్లుగా మార్చుకుని దాచుకుంటే, ఒక పొద్దుపొద్దునే అవి చెల్లవమని చెప్పేసరికి, వాటిని ఎట్లా మార్చాలో అర్థం కాదు ఆ ముసలమ్మలకి. మరి ఈ డబ్బు ఎందుకు చెల్లదంటే "మీరు తిత్తుల్లో మురగేసి నల్లగా అయిపోయేనంట. నల్లడబ్బు చెల్లదంట" అంటుంది చార్లీచాప్లిన్ భారతమ్మ. ఇందులో కథలన్నీ భారతి పరిశీలనకు అవగాహనకూ తాత్వికతకూ అద్దంపట్టేవే. 'తప్పేది ఒప్పేది' కథ అలాంటి ఒకటి. ఇక చివరికివచ్చి ఆగిన స్రవంతిలో కథలు రెండు. ఆవు ఈనితే పెయ్యదూడైతే ఇప్పుడు లాభం. వ్యవసాయానికి ట్రాక్టర్లు వచ్చాక ఎడ్లతో పనైపోయింది. కోడె దూడల్ని కసాయి వాళ్ళకిచ్చే దినాలొచ్చాయి. ఆవులకి ఇంజెక్షన్లతో కడుపులొస్తున్నాయంట. మరి ఆవు ఈనుతోందంటే పెయ్యదూడ కోసం ఆత్రం పడ్డం, మనుషుల్లో మగపిల్లవాడి కోసం ఆత్రపడడం లాగా తయారైన సందర్భం. పాలిచ్చే ఆవులతోనే లాభం. ఇదొక పరిణామం. ఈ కథకి పెట్టిన పేరు చూడండి. 'ఆవైతే పేయదూడ, ఆడదైతే మగపిల్లోడు'.

వందకాళ్ళపురుగు మొదట నగరానికొచ్చింది, పట్నానికి పాకింది. పల్లెలో పెద్దిళ్ళలో ప్రవేశించింది. అనేక దిగువ బురుజులో జొరబడింది. ఊళ్ళో ఎవరికేమొచ్చినా ఒకరినొకరు కడుపులో పెట్టుకొనే హృదయాలను ఆక్రమించింది. తన వయ్యారాలతో ఇంటిని కట్టిపడేసింది. కాకిబ్రతుకును కాస్తా

## కవిత

# అమ్మగర్భాన్ని కాలదన్నుకొని...

- సాంబమూర్తి లండ
9642732008




మన భాషెప్పుడూ
మనం శ్వాసించేదై ఉండాలి
మనచుట్టూ ప్రవహించేదై ఉండాలి
మన సంస్కృతిని బతికించేదై ఉండాలి
మరిప్పుడేంటి, మన పెరట్లో
పరాయి తీగల్ని పెంచుకుంటున్నాం
మనవికాని విత్తుల్ని
మన మడుల్లో అపురూపంగా
చల్లుకుంటున్నాం
మనపొలంలోని బంగారు పంటని
దున్నేసుకొని
ఆకర్షణీయమైన ముళ్లపొదల్ని
పెంచుకుంటున్నాం
మనవేమిటిలా
మూగజీవాలకన్నా
ఒక మెట్టు అధమంగా ఆలోచిస్తున్నాం?

లేలేత మొగ్గలు
ఆంగ్లంలోనే వికసించాలంటున్నాం
సుతిమెత్తని పూలన్నీ
పరభాషలోనే పరిమళించాలంటున్నాం
చివరికి
ఇంగ్లీషులోనే తుమ్మమంటున్నాం
ఆంగ్లంలోనే ఆవలించమంటున్నాం
అసలెందుకో తెలీదు
పొడి పొడి రాళ్లతో ఇల్లు
కట్టాలనుకుంటున్నాం
పునాదుల్లేకుండా
భవంతుల్ని నిలబెట్టాలనుకుంటున్నాం?
ప్రకృతి పీకమీద కాళ్ళేసి తొక్కి
గోడమీద పచ్చని పెయింటింగ్ ని చూసి
గుటకలు మింగుతున్నాం!

కొన్నాళ్ళు కిందామీదా పడడం
కొన్నాళ్లు నేలమీద ప్రాకడం
కొన్నాళ్ళు ఒక ఆసరాపట్టుకు
లేవడానికి ప్రయత్నించడం
ఇదే కదా క్రమం
ఇదేకదా వికాస అంతస్సూత్రం
ఇలాగే కదా
కోకిల గొంతు సవరించుకుంది
సెలయేరు పాటలు నేర్చుకుంది
ఇలాగే కదా!
సీతాకోకచిలుక రెక్కలు విప్పార్చుకుంది
గోడలు కట్టాకనే కదా
పైకప్పును నిర్మించాల్సింది
రెక్కలు గట్టిపడ్డాకనే కదా
ఆకాశానికేసి ఎగరాల్సింది
ఒక పంట పచ్చగా
ఎదుగుతున్నప్పుడే కదా
అంతరపంటల్ని విత్తుకోవాల్సింది
మనమేంటిలా
అమ్మ గర్భాన్ని కాలదన్నుకుని
అద్దె గర్భంలో పెరగడాన్ని అభివృద్ధి
అంటున్నాం
నాలుగు వేళ్ళనూ తెగనరుక్కొని
ఒంటివేలితో
పొట్ట నింపుకోవాలనుకుంటున్నాం? ♦


---

కుక్కబతుకును చేసింది. ఇప్పుడు కరెంట్ పోతేనే గుమ్మాల బయటికి వచ్చేది. ఎవరికి ఏమొచ్చినా ఎవరూ పట్టించుకునే పరిస్థితి లేదు. అంతా పురుగు ముట్టిన ఊరైపోయింది. తల్లీ తండ్రి పదేళ్ళకే పోతే అవ్వా తాతా పెళ్ళవగానే పోతే భారతమ్మను ఊరు కడుపులో పెట్టుకునిందా మరి? ఇప్పుడు ఊరికడుపులో దూరదర్శనం అనే వందకాళ్ళ పురుగు కూర్చునింది. అది పరిణామ క్రమం. దీనిని 'ఏదారి బతుకులు' కతలో మా బంగారుతల్లి భారతి వర్ణించి వర్ణించి మాజిక్కులు చేసి ఏమీ చెప్పదు. నెత్తిమీద మొట్టీ చెప్పదు. ఉపన్యాసాలూ ఇవ్వదు. కబుర్లు చెప్పినట్టు చెప్పి ఉలిక్కిపడేలా చేస్తుంది. ఇవి ఒక్క దిగవబురుజు కతలే కావు. భారతదేశపు కథలు. భారతి చెప్పిన వెతలు. తెలుగు కథా వనంలోకి పచ్చపచ్చగా నడిచి వచ్చింది. ఈ కథా భారతి. కుల, మత, వర్గ, లైంగిక వివక్షలు స్త్రీల మీద ఎంత ప్రభావం చూపిస్తాయో, వాటిని ఎదుర్కొని పోరాడి నిలబడడం ఎంత కష్టమో అంత అవసరం అని తెలిసిన ఈ కథాభారతి దగ్గర ఇంకా చాలా కథలుండేవుంటాయి. వాటికి స్వాగతం పలుకుదాం.

*('ఏదారి బతుకులు' కథా సంపుటి ముందుమాట)* ♦

**కథ**

# భవబంధాలు




- బి. హేమమాలిని
9966792260


అప్పుడప్పుడే తెల్లవారుతూ ఉంది. తూరుపుకొండ వెనుకనుంచి బాలభానుడు లేలేత కిరణాల సైన్యంతో చీకటి రాజ్యంపై దాడి చేస్తున్నాడు. దినకరుని ధాటికి తాళలేక చీకటి తెరలు తెరలుగా తప్పుకుంటూ ఉంది. వాసుదేవరావు వరండాలో వాలు కుర్చీలో కూర్చుని భార్య అందించిన వేడి వేడి కాఫీని ఆస్వాదిస్తూ దినపత్రిక చదువుతున్నాడు. అది ఆయనకు చాలా ఇష్టమైన దినచర్య. పక్కనే మొబైల్‌లో త్యాగరాజ కృతి "శాంతములేక సౌఖ్యము లేదు" మంద్రస్వరంలో వినబడుతూ ఉంది. వారిది అంత పెద్ద ఇల్లేమీ కాదు. కానీ ఉన్నంతలో సౌకర్యవంతంగా, పొందికగా ఉంటుంది. ఇంటి కాంపౌండులో రకరకాల పూలమొక్కలు సువాసనలు వెదజల్లుతూ ఉంటాయి. మల్లె, జాజితీగలు గేటుకు పైన అల్లుకుని పరిమళాలను గుభాళిస్తూ ఉంటాయి. పారిజాతం సువాసనలు ప్రశాంతమైన భావాన్ని కలిగిస్తాయి. ఆయన భార్య రమాసుందరికి పూల మొక్కల పెంపకమంటే ఎంతో ఇష్టం.

వీధివాకిలి చప్పుడుకు వాసుదేవరావు తలపైకెత్తి చూశాడు. ఆయన ముఖంలో ఆశ్చర్యం, ఆనందం రెండూ కలిసికనిపించాయి. "ఏమే రమా! అమ్మాయి వచ్చింది చూడు" ఆయనలో పరవళ్లు తొక్కుతున్న ఆనందం ముఖంలో కూడా వెలుగులు నింపింది.

"ఆ! వస్తున్నా" అంటూ పరుగులాంటి నడకతో వంటింట్లోనుండి వచ్చింది రమాసుందరి.

"మీరుండండి నాన్నా. నే పెడతానుగా" అంటూ తన చేతిలో లగేజీ తీసుకోబోతున్న తండ్రిని వారించి, హాల్లోకి వచ్చి హమ్మయ్య అంటూ సోఫాలో కూలబడింది వాసుదేవరావు చిన్నకూతురు చిత్ర.

"ఏమ్మా! నువ్వొక్క దానివే వచ్చావే? అల్లుడు గారు, మనవడు రాలేదే" అడిగాడు వాసుదేవరావు.

"లేదు నాన్నా. ఆయనకు లీవు దొరకలేదు. వాడికేమో పరీక్షలు" అంది.

"ప్రయాణం బాగా జరిగిందా" తల్లి ప్రశ్న. ఆ ప్రశ్న అడగడంతోటే అప్పటి వరకూ మరచిపోయిన విసుగు నంతా ప్రదర్శించింది చిత్ర. "సర్లే. అదే అడిగావూ. వెధవ బస్సు ప్రయాణం నాకు పడదంటే వినరు. మీకు ముసలితనంలో చాదస్తం వస్తే మా ఆయనకు 40 ఏళ్ళకే వచ్చింది. అమ్మ పెట్టదు, అడుక్కు తిననియ్యదు అన్నట్లుంది నా పరిస్థితి. అంత పెద్ద కారుంది కదా డ్రైవరును మాట్లాడుకుని వెళతానంటే నువ్వొక్క దానివే డ్రైవరుతో అంతదూరం ప్రయాణం మంచిది కాదు ఏసీబస్సులో రిజర్వేషన్ చేస్తాను. హాయిగా పడుకుని వెళ్లు అంటూ బస్సెంక్కించారు. తీరాచూస్తే చక్రాలపైన సీటు. నడుము విరిగిపోయింది. అంటూ బద్ధకంగా ఒళ్లు విరుచుకుంది.

"ఆయన మాటకూడా నిజమే కదమ్మా. రోజులసలే మంచివికావు. ఏమైనా జరిగితే ఏంచేస్తాం" అంటూ అల్లుడిని వెనకేసుకొచ్చింది రమాసుందరి.

"అంతేలే! ముందొచ్చిన చెవులకంటే వెనకొచ్చిన కొమ్ములు వాడి అని నా కన్నా అల్లుడెక్కువైపోయాడు నీకు" అంటూ మూతి మూడు వంకర్లు తిప్పింది. ఆ అమ్మాయి మాటలకు దంపతులిద్దరూ నవ్వుకున్నారు. "సరేలే మాటలకేం గానీ వెళ్లి వేణ్ణీళ్ళతో హాయిగా స్నానం చేసిరా వేడివేడిగా దోసెలు వేస్తాను. రాత్రి ప్రయాణం హడావిడిలో సరిగా తిన్నావో లేదో" ఆప్యాయంగా కూతురికి చెప్పింది రమ.

"అవునమ్మా చాలా ఆకలిగా ఉంది. ఇప్పుడే చిటికెలో వచ్చేస్తా" అంటూ వెళ్ళింది చిత్ర. భార్యా భర్తలిద్దరి కళ్ళలో ఒక మెరుపు కనిపించింది.

♦♦♦

వాసుదేవరావు స్వస్థలం అనంతపురం జిల్లాలో గుత్తి మండలం. బీఏ లిటరేచర్ చేశాడు. తెలుగు టీచర్‌గా ఉద్యోగం సంపాదించుకున్నాడు. రమాసుందరి ఆయన మేనత్త కూతురే. వారిది చాలా ఒద్దికైన సంసారం. అంత దాంపత్య జీవితంలో వారిద్దరూ ఏనాడు గొడవ పడలేదు. వారికి ముగ్గురు సంతానం. పెద్ద కూతురు స్వాతి. బెంగుళూరులో ఉంటుంది. మేనరికం చేసుకున్నాడు. కొడుకు రవి రెండవ వాడు. చిన్నకూతురు చిత్ర. తన సంపాదనలోనే పిల్లలందరినీ కోరిన చదువులు చదివించాడు. ఆడా, మగా భేదం చూపలేదు. రమాసుందరి చాలా పొదుపరి. ఎంతో చక్కగా సంసారానికి అవసరమైనవన్నీ ఆయన సంపాదనలోనే సమకూర్చి పెడుతుంది. తనకంటూ ఏమీ ఆశించదు. అల్లుళ్ళిద్దరూ మంచివాళ్లు. స్వంత తల్లిదండ్రులలాగా గౌరవిస్తారు. రిటైరైన తర్వాత వాసుదేవరావు హైదరాబాదులో ఉన్న కొడుకు దగ్గరికి వచ్చేశాడు. ఈ మధ్యనే కొడుకు ఉద్యోగం కోసం అమెరికా వెళ్ళాడు. ఈ వయసులో అమ్మానాన్నను వదలి వెళితే ఎలాగని బంధువులూ, స్నేహితులు, అయినవాళ్ళందరూ అన్నారు. తన మనసులో కూడా ఆ బాధ ఉంది. ఎటూ తేల్చుకోలేక రవి తండ్రి దగ్గరికి వెళ్ళి తన మనసులో కోరిక బయటపెట్టాడు.

"దానికి సందేహమెందుకురా! లక్షణంగా వెళ్లు. మా గురించేం దిగులు పెట్టుకోవద్దు. మేమేం అడవిలో లేం కదా! చుట్టూ ఇంతమంది తెలిసిన వాళ్లున్నారు. బంధువులున్నారు. ఒక ఫోన్ చేస్తే పలుకుతారు. నిక్షేపంగా వెళ్ళు" అన్నాడు. ఆ మాటలంటున్నపుడు ఆయన గుండె జారిపోయింది. కానీ బాధను బయటికి కనిపించనీయలేదు. తల్లి కాబట్టి రమాసుందరి ఏడుపు ఆపుకోలేకపోయింది. చివరి రోజులలో దగ్గరుండి చూసుకోవలసిన కొడుకు రెక్కలు కట్టుకుని ఎగిరి పోవాలను కోవడం, దానికి తనభర్త ముందు వెనుకలు ఆలోచించకుండా సరేననడం."వాణ్ణి ఎందుకెళ్లమన్నారండీ" తన ఆక్రోశం వెళ్లగక్కింది రాత్రి పడుకునేముందు.

"నీ పిచ్చిగానీ నేనాగమంటే ఆగుతాడా? ఒకవేళ ఆగినా మనం బతికినంతకాలం మీనుంచే నా భవిష్యత్తు నాశనమైంది అన్నట్లుగా వాడు చూసే చూపులు భరించగలమా? వెళ్లనీ! వాడి జీవితం కూడా స్థిర పడాలి కదా" నడుం వాల్చుకుంటూ కళు ్ళమూసుకున్నాడు తన కళ్లలోని కన్నీటిపొర భార్యకు కనిపించనీయకుండా!

మరికొద్దిసేపటి తరువాత అన్నాడు. "ఇందులో మనకు కూడా లాభమే తెలుసా" కాస్త కొంటెగా అన్నాడు.

"ఏంటో అది" నిష్టూరంగా అడిగింది రమ.

"ఎప్పుడో పెళ్ళయిన కొత్తలో ఒకటి రెండు సంవత్సరాలు మాత్రమే ఏకాంతంగా గడిపాము. మళ్లీ ఇన్ని సంవత్సరాల తరువాత ఏకాంతం దొరుకుతుంది. చిలుకా గోరింకల లాగా హాయిగా ఉండచ్చు" కన్నుగీటాడు.

ఆ! అవునవును. ఈముసలి వయసులో అయ్యగారికి పడుచు కోరికలు పెరుగుతున్నాయి" ఆమెగొంతులో సిగ్గు ధ్వనించింది. విషయం తేలికపడిందని నిట్టూర్చాడు వాసుదేవరావు.

♦♦♦

"అబ్బ నువ్వువేసే దోసె ఉందిచూడూ. నోట్లో పెట్టుకోగానే కరిగిపోతుంది. పైగా ఆ అల్లం పచ్చడి..... ఆహా అద్భుతం"తిన్నంతసేపూ మెచ్చుకుంటూనే ఉంది చిత్ర. రెండేళ్ల తరువాత మరీ ఇప్పుడే పుట్టింటికి రావడం. ప్రేమగా కూతురి తలనిమిరింది రమ. కళ్ళలో కొత్త కాంతి కనిపించింది. అదిచూసి వాసుదేవరావుకు కూడా సంతోషం కలిగింది.

"రమా! నేనలా బయటికి వెళ్లస్తాను" చేతిలో సంచి పట్టుకుని అన్నాడు.

"ఎక్కడికి నాన్నా! చాలా ఎండగా ఉంది"

"ఇదేముందమ్మా నీరెండనే కదా! కొన్ని సరుకులు నిండుకున్నాయి తీసుకొస్తాను".

"బాగుంది సంగతి. ఇంటర్నెట్ యుగంలో కూడా ఇంకా పాత పద్ధతేనా? ఉండు ఆన్లైన్లో ఆర్డర్ పెడతాను" అంటూ

వారించింది. "నీ ఆన్లైన్ షాపింగ్ మాకొద్దులే తల్లీ. మాకిలాగే ఇష్టం. నడిస్తే కాస్త వ్యాయామం కూడా" నవ్వుతూనే చెప్పి వెళ్లిపోయాడు. "ఈయనకింత ఓపిక ఎక్కడ్నుంచి వచ్చిందబ్బా" మనసులో అంటున్నట్లుగా పైకి అనేసింది.

"అది ఓపిక కాదే! నువ్వు వచ్చావు కదా సంతోషం" అంది రమ

"మరి అంత సంతోషంగా ఉంటే మా దగ్గరే వచ్చి ఉండొచ్చు కదా ఇలా ఒంటరిగా ఉండటం దేనికి? తను ఏపని కొరకు వచ్చిందో ఆ దారికి సంభాషణ మళ్లిస్తూ అంది.

"బాగానే చెప్తావు లేవే! అక్కడుంటే మాకు ఈ సంతోషం, తృప్తీ ఎలా దొరుకుతాయి? ఆడపిల్లలకు పుట్టింటి సుఖం దూరం చెయ్యమంటావా" కాస్త బాధగా, కోపంగా అంది రమ.

"అది కాదమ్మా మీకిద్దరికీ వయసైపోయింది. ఏదైనా కష్టమొస్తే పరిగెత్తుకొచ్చే దూరాల్లో ఎవరూ లేరు. అదే ఎవరో ఒకరి దగ్గరుంటే దిగులుండదు కదా"

"ఇది నువ్వుకాదే ఆ రాక్షసి మాట్లాడిస్తూ ఉంది. తాను చాలదని నీక్కూడా పురెక్కించినట్లుంది" పెద్దకూతురు స్వాతిని గురించి అంది. నిజానికి చిత్ర ఉన్నదున్నట్లుగా పుట్టింటికి రావడానికి కారణం కూడా అక్క స్వాతే. ఆమెకు అక్కతో ఆ రోజు జరిగిన సంభాషణ గుర్తొచ్చింది.

◆◆◆

చిత్రకు దాదాపుగా నెలరోజులనుండి ఆఫీసులో ఇన్స్పెక్షన్ ఉండడంతో ఊపిరి తీసుకోవడానికి కూడా తీరిక దొరకనట్లుగా ఉంది. మామూలుగా అక్కచెల్లెళ్ళిద్దరికీ రెండురోజుల కొకసారైనా ఫోన్లో మాట్లాడకపోతే తోచదు. కానీ తనకు తీరిక దొరకడం లేదు. అక్క ఫోన్ చేసినా తీయడం లేదు. చివరికి పోయిన ఆదివారమే కాస్త ఉపశమనం లభించింది. ఫోన్ పట్టుకుని చూస్తే ఇంకేముంది? టన్నుల కొద్దీ తిట్లతో కూడిన మెసేజ్లు. కాస్త భయంగానే అక్కకు ఫోన్ చేసింది.

"ఏమే! ఇప్పటికి తీరిక దొరికిందా అక్క చచ్చిందీ, బతికిందీ తెలుసుకోవడానికి" మాటల ప్రవాహం మొదలైంది.

"అది కాదక్కా ఆఫీసులో పని...ఎక్కువగా ఉంది కదా...అందుకని" మాటలు మింగుతూ సమాధానమిచ్చింది.

"అవున్లేమ్మా! మీకంటే ఆఫీసులు..బోలెడు పనులు. మాదేముంది. పొద్దున్నే లేవడం, వేళకింత ఉడకేయడం, తినడం మరీ పడుకోవడం అంతేగదా". అక్క అలా కోపంగా మాట్లాడితే చిత్రకు చాలా ఇష్టం. అందుకే నవ్వుకుంటూ ఆ మాటల ప్రవాహాన్ని అడ్డుకోకుండా వింటూ ఉంది.

"ఏమే ఉన్నావా?" ఉలుకూ పలుకూ లేకపోతే కాస్త ఆయాసపడుతూ అంది.

"ఆ ! ఉన్నాను. ఇంకా ఏమిటి కబుర్లు" చాలా నింపాదిగా అడిగింది.

"నీ దుంపతెగ. మరిదిగారూ, బాబూ క్షేమంగా ఉన్నారు కదా"

"ఆ !"

"ఆ పొడిపొడి సమాధానాలు ఏమిటే. నీకూ ఆ చిలుకా గోరింకకు పట్టిన జబ్బే పట్టినట్లుంది". నిష్ఠూరంగా అంది.

"వాళ్లెవరూ" కాస్త కుతూహలంగా అడిగింది.

"ఇంకెవ్వరు ఉన్నారు కదా. ఎవ్వరి దగ్గరా ఉండకుండా టింగురంగా అని మొండిగా కదలకుండా కూర్చున్నారు కదా"

అమ్మానాన్నల గురించని అర్థమైంది.

"పోన్లేక్కా. వాళ్లకిష్టమైనంత వరకూ ఉండనీ. చేత కాకపోతే వాళ్లే వస్తారు కదా"

"అదేంటే నువ్వు కూడా అలాగే అంటావు. అన్నిరోజులూ ఒకేలాగే ఉంటాయా? ఏదైనా జబ్బుచేసి మంచంపడితే ఎవరుదిక్కు? దగ్గరా దాపూ కాదుకదా. పోనీ ఫోన్లో నన్నా మాట్లాడదామంటే ఫోన్ ఎత్తితే కదా. 24 గంటలూ టీవీలు పెట్టుకుని మునిగిపోతారు. మనకు ఎంత టెన్షన్గా ఉంటుంది? చిత్రకు కూడా అక్కబాధలో నిజముందనిపించింది. అందుకే ఎలాగైనాసరే అమ్మా నాన్నను వప్పించి వెంట పిలుచుకురావాలని నిర్ణయించుకుని వచ్చింది.

◆◆◆

చిత్ర వచ్చి నాలుగురోజులయింది. కానీ అమ్మా నాన్నను తనతో తీసుకు వెళ్లడానికి ఎలా ఒప్పించాలో ఆమెకు అర్థం కాలేదు. అయితే ఆమెకు ఒక విషయం బాగా అర్థమయింది. అమ్మానాన్నా ఒంటరిగా ఉన్నారని తామంతా బాధ పడుతున్నారే గానీ వాళ్లకు ఎటువంటి బాధా లేదు. పైగా ఎంతోకాలం తరువాత దొరికిన ఏకాంతాన్ని వాళ్లు చాలా బాగా ఆస్వాదిస్తున్నట్లు వాళ్లను చూస్తే అర్థమవుతుంది. అన్నావదినా ఉన్నపుడు కూడా వాళ్ల స్వతంత్రానికి అడ్డేమీ లేదు. కానీ ఇప్పుడేదో వాళ్లకు కొత్త రెక్కలు వచ్చినట్లుంది. పొద్దున్నే నాన్న కాఫీ కోసం అమ్మ చుట్టూ తిరగడం. అమ్మ విసుక్కుంటూనే ఆయన కోరినవన్నీ చేసిపెట్టడం, కాస్త కోపం, కాస్త వాదనలు,

ఎన్నో కబుర్లు – అసలు వాళ్లకన్ని విషయాలు ఎలా గుర్తుంటాయో అర్థం కాదు. ఎప్పుడో తమ చిన్ననాటి సంగతుల నుంచి, పిల్లల సంగతులు, మనుమలు, మనుమరాళ్ల సంగతులు అన్నీ వస్తాయి. అలా మాట్లాడుతూనే నిద్రలోకి జారుకుంటారు.

పెళ్లయిన కొత్తలో ఏ రెండు సంవత్సరాలో ఉన్న ఏకాంతం మళ్లీ ఇప్పుడు దొరికింది. పిల్లలు, వాళ్ల చదువులు, పెళ్లిళ్లు, కాన్పులూ తామంతా ఉద్యోగాలకు వెళ్లిపోతే తమ పిల్ల ఆలనా పాలనా చూడటంతో ఊపిరి సలపని జీవితం. ఎక్కడా ఆగకుండా వెళ్లే ఎక్స్‌ప్రెస్ రైలులాంటి పరుగులనుంచి ఇప్పుడే కాస్త విశ్రాంతి. అందుకే వాళ్లను ఆ సంతోషం నుంచి దూరం చెయ్యాలనిపించడం లేదు. జీవితపు మలిసంజలో కొత్త దంపతులలాగా వారి ప్రయాణం ఎంతో అందంగా కనిపించింది. ఎటూ నిర్ణయించుకోలేకుండా ఉంది చిత్ర.

♦♦♦

ఇంటి వరండాలో ఉన్న తూగుటుయ్యాలలో కూర్చుని ఏదో ఆలోచించుకుంటూ ఉన్న చిత్ర దగ్గరకు వచ్చి "ఇదిగో అన్నయ్యతో మాట్లాడవే" అంటూ ఫోన్ చేతిలో పెట్టింది అమ్మ.

"ఏరా అమెరికా అబ్బాయి ఎలాగున్నావు?" హుషారుగా అడిగింది. వాళ్లిద్దరికీ వయసులో తేడా తక్కువే. అందుకే ఆ పిలుపులు.

"బాగున్నామే. మీరెలా ఉన్నారు. బావ, బుడ్డిగాడు బాగున్నారా? అయినా ఇంతకాలానికి తీరిక దొరికిందా" నిష్ఠూరంగాఅన్నాడు.

"నిజమేరా. అయినా నువ్వు అన్నీ వదిలించుకుని వెళ్లినంత సులభంగా నేను రాలేను కదా" తన మాటల్లో దెప్పిపొడుపు తనకే స్పష్టంగా వినబడింది.

"ఆ ! అనవే నువ్వు కూడా అను. నువ్వైనా నన్నర్థం చేసుకుంటావనుకున్నా. ఏం చేయమంటావే అక్కడుండి.... మూడుసంవత్సరాలు ఉద్యోగం సద్యోగం లేకుండా వీధులు పట్టుకుని తిరిగాను. ఏదో వెలగబెడుతున్నట్లు పొద్దున్నే హడావిడిగా బయలుదేరడం. సాయంత్రం వరకూ తిరిగిన చోట తిరిగకుండా చక్కర్లు కొట్టడం. నన్ను నేను మోసం చేసుకుంటూ, అమ్మా నాన్నను మోసం చేస్తూ ఎంతకాలముండేది? పాపం మీ వదిన తనెంత కష్టపడుతున్నా పల్లెత్తు మాటకూడా అనలేదు తెలుసా. ఈ కపట బతుకు బతకలేక ఎవరో తెలిసినవాళ్లను కాళ్లూ వేళ్లూ పట్టుకుని ఇదిగో ఈ ఉద్యోగం సంపాదించుకున్నాను". అన్నయ్య చెబుతున్న మాటలు వింటూ ఉంటే ఆమెకు ఆశ్చర్యం బాధా కలిగాయి.

''ఇంత జరిగితే నాతో ఒక్కమాట కూడా చెప్పలేదెందుకురా"

"బాగుందే నువ్వు చెప్పేది. చెడి చెల్లెలింటికి వెళ్లమన్నారు కదా అని నీ దగ్గరికి వచ్చి నాబతుకు బయట పెట్టుకోమంటావా? ఒకవేళ వస్తే మాత్రం ఎంతకాలం ఆదుకుంటావు. నేనొక్కణ్నే కాదు కదా. నా పిల్లలకు భవిష్యత్తు చూడవద్దూ".

చిత్రకు మనసంతా బరువయ్యింది. ఇంతకాలం తామంతా అన్నయ్యను ఎంత అపార్థం చేసుకున్నారు. నిజంగా ప్రతి మనిషి జీవితం తేనెతుట్టెలాంటిది. ఒక్కసారి కదిలిస్తే సమస్యలనే తేనెటీగలు చుట్టూ ముసురుకుంటాయి. ఆలోచిస్తూ అలాగే ఉండిపోయింది.

♦♦♦

తాను తిరిగి వెళ్లవలసిన సమయం దగ్గరపడింది. ఈ లోపలే ఏదో ఒక నిర్ణయం తీసుకోవాలి. చాలా ఆలోచించి ఒక నిర్ణయానికి వచ్చింది. చిత్ర. నాన్న తరచుగా సరుకులు తెచ్చే కిరాణా అంగడికి వెళ్లి అంగడి అతనితో నెలకవసరమయ్యే సరుకులన్నీ మొదటి వారంలోనే ఇంటికి పంపాలని, డబ్బు తాను పంపుతానని చెప్పింది. ఇంటికి దగ్గరగా ఉన్న క్లినిక్ వెళ్లి డాక్టర్‌తో విషయమంతా చెప్పి ఎప్పుడే అవసరం వచ్చినా వైద్య సౌకర్యం అందించమని అభ్యర్థించింది. తన ఫోన్ నంబర్ వాళ్ల కిచ్చి వాళ్ళ నంబరు తాను తీసుకుంది. చుట్టుపక్కల వాళ్లకు తన నంబరు ఇచ్చి అమ్మా నాన్నకు ఏ సమస్య వచ్చినా తనకు చెప్పమని మాట తీసుకుంది. బయలుదేరేముందు నాన్న చేతిలో పదివేల రూపాయలు పెట్టింది.

"ఎందుకమ్మా అన్నయ్య పంపిస్తూనే ఉన్నాడు కదా" అన్నాడు నాన్న.

"మీరు ప్రతిసారీ బ్యాంకుకు వెళ్లిరావడం కుదరదుకదా. అందుకే చేతిలో కొంచెం డబ్బు ఉంటే బాగుంటుంది. అయినా అది వాడి బాధ్యత. ఇది నా బాధ్యత" అని చెప్పింది. అంతేకాకుండా "మీకు ఎప్పుడు రావాలనిపిస్తే అప్పుడే మా దగ్గరకు రండి అయితే ప్రతిరోజూ ఫోన్ చెయ్యాలి. ఏ సమస్య వచ్చినా వెంటనే చెప్పాలి" అని మాట తీసుకుంది. వాళ్లను వదలి వెళ్లడానికి బాధగా అనిపించింది. కానీ నిండు మనసుతో నవ్వుతూ వాళ్లకు వీడ్కోలు తెలిపి బరువెక్కిన గుండెతో ఊరికి బయలుదేరింది.

♦

కవిత

# చీపురు మనిషి

- ఈతకోట సుబ్బారావు
9440529785




బతకాల్సిందే
గాలి విషమైనా
నీరు కల్మషమైనా
దుమ్మూ ధూళి చెత్తా - చెదారం
ఆరోగ్యాన్ని రోగమయం చేసినా
దోమలు కుట్టినా
కుక్కలు కరిచినా
ఎలుకలూ - పిల్లులు, చీమలూ- బొద్దింకలు
మనిషి మీద యుద్ధం ప్రకటించినా
బతకాల్సిందే
సిగరెట్లు కాల్చేవారి నడుమ
గుట్కాలు నమిలేవారి మధ్య
పక్కనే వుమ్మేసే మహాత్ముల పక్కన
ఇంటి ముందే కసువు కుప్పపోసే వారి చెంత
బతకాల్సిందే
మునిసిపాలిటీ నిర్లక్ష్యంలోనైనా
ఫ్యాక్టరీ పొగల సమక్షంలో నైనా
వాహనాలు వొదిలే కాలుష్యంలో నైనా
మురికి కాల్వలై ప్రవహించే నదుల పక్కనైనా
బతకాల్సిందే
కల్తీ పెట్రోలు చిమ్మే వాహనాల పొగలో
కర్బన వాయువుల విచ్చలవిడి దాడిలో
ధూళికి పుట్టిల్లుగా మారిన రోడ్ల మీద
గాలికి చెలరేగే దుమ్ము సుడిగుండాల్లో
వూపిరి ఆడినా ఆక్సిజన్ అందని నేల మీద
కార్లు జీపులు లారీలు బస్సుల రణగొణ ధ్వనుల మధ్య
చిటికెన వేలు పట్టి నడిపిస్తున్న పిల్లలతో
దాహానికి నీళ్ల పాకెట్లు కొంటున్న తల్లులతో
ప్రతి అడుగు వొక యుద్ధం చేస్తూ
గుంతలు, బురదగుంటల రస్తా మీద నడుస్తూ
గుండెల నిండా అభిమానం నింపుకుంటూ
బతకాల్సిందే
దేహాన్నొక ఆస్పత్రిగా మార్చి
సూక్ష్మక్రిములతో యుద్ధం చేస్తూ
నాసికను ఫ్యాక్టరీ చిమ్నీ చేసి
నైట్రోజన్, ఆర్గాన్, సల్ఫర్, కార్బన్‌ల సంగమాన్ని
నిరంతరం నిర్విరామంగా విడుదల చేస్తూ
గుండెల్ని పిడికిట పట్టి
కాలేయానికి దోసిలి అడ్డంపెట్టి
తరుగుతున్న ఆయుష్షును పెంచుకొంటూ
తరుముతున్న రోగాల్ని జయించుకొంటూ
బతకాల్సిందే
ఎవరికి పట్టిందని
పారిశుధ్యం కోసం వొక అడుగేయాలని
ఎవరు పట్టించుకుంటారని
నగరాన్ని చెత్త వేసే డంప్ చేయరాదని
ఎవరు ఆలోచిస్తారని
శబ్దకాలుష్యం సర్వరోగ నిలయమని
ఎవరు చింతిస్తారని
వాతావరణ కాలుష్యం లక్షల ప్రాణాల్ని మింగేస్తుందని
అయినా తప్పదు
బతకాల్సిందే
ఎవడికి వాడొక చీపురైతే తప్ప
దేశం మురికితనం మాయమైపోదు. ♦

# గొర్ల కాపరుల జీవన పోరాట చిత్రణ




సన్నపురెడ్డి
వెంకట్రామిరెడ్డి



- నందవరం కేశవరెడ్డి
9885720878

ప్రతికూల పరిస్థితుల్ని అధిగమించే శక్తి సామర్థ్యాలు మనుషులకున్నాయి. భీతావహమైన బ్రతుకులో, మరణం అంచున జీవితేక్ష రాజ్యమేలుతుంది అనే జీవిత సత్యాన్ని ఆవిష్కరిస్తుంది. సన్నపురెడ్డి వెంకట రామిరెడ్డి గారి నవల కొండపొలం.

వర్షాభావ పరిస్థితుల్లో కడప జిల్లాలోని నల్లమల దుర్గమారణ్యాల్లో గొర్లకాపరాలు నెల, నెలన్నరపాటు గొర్రెల్ని మేపుకుంటూ చేసే జీవనం కొండపొలం చేయడం. సన్నపురెడ్డి వెంకట రామిరెడ్డి నల్లమల కొండలకు దాపునందున్న బాలరాజుపల్లె వాసి. తానా వారు 2019న నిర్వహించిన నవలల పోటీలో కొండపొలం నవలకు రెండు లక్షల రూపాయల బహుమతి లభించడం ప్రశంసనీయం.

బాలరాజు పల్లెలో సగం సగంగా కాపులు, గొల్లలు కలసిమెలసి వరసలతో పిలుచుకుంటూ అనురాగ ఆప్యాయతల్ని అనుభవాల్ని కలబోసుకుంటు సంతోషంగా జీవించేవారు. వూరి మధ్యనున్న అరుగు హాస్యోక్తులతో వ్యంగ్యోక్తులతో పులకించిపోయేది.

In the name of god, stop a moment cease your work look around you n" Leo Tolstoy, అన్నట్లు రచయిత ఆ అరుగు మీద అందరిలో ఒకడిగా కలిసిపోయి వివిధ పార్శ్వాలను దర్శించేవారు.

సన్నపురెడ్డి వెంకటరామిరెడ్డి బాల్యం నుంచి నల్లమల కొండల్లోకి కొట్టాల్ని కప్పుకునే బోదగడ్డికో, కొట్టం వాసాలకో, వేపనారకో, చింతకాయలకో వెళ్లేవారు. అదే బలం, జ్యోతి, బలంగుహ, భైరవకోనలాంటి క్షేత్రాల్ని దర్శించేందుకు తిరిగేవారు. ఆ నల్లమల దుర్గమారణ్యాల్లో గొర్లకాపరులు కొండపొలం చేస్తూ బతుకుతారని తెలిసి ఆశ్చర్యపోయేవారు. ఆ మార్మిక జీవనాన్ని వాళ్ల నోళ్లల్లోంచి వింటూ దిగ్భ్రాంతికి గురయ్యేవారు. ఆ జీవితం గురించి దశాబ్దాలుగా వింటూ, వాళ్లు తిరిగిన ప్రాంతాలు తాను చూసి వుండటం వలన విన్న దృశ్యాల్ని ప్రాంతాలకు అన్వయించుకొని అనుభవానికి తెచ్చుకుంటూ ఆ అనుభవాల్ని తనవిగా అనుభూతిస్తే తాను గొర్రెలకాపరిగా మారి కొండల్లో తిరిగినంతగా మార్పుచెంది ఈ నవల రాసానంటారు.

చాలామంది యువకులు తమకు ఉద్యోగాలు రావటం లేదని వాపోతూ వుంటారు. దానికి కారణం కష్టపడకపోవడమే అంటాడు ఒకనాడు కొండపొలం చేసి అటవీశాఖాధికారి అయిన రవీంద్రయాదవ్. కరువు నేలల్లో ఒక్కొక్కరు పైరు పండించటం కంటే ఐఏఎస్‌లు సాధించటం గొప్పకాదు. ఒక్క ఆర్నెల్లు గొర్రెల్ని కాయటం కంటే గ్రూప్స్ నెగ్గటం గొప్పేమీకాదు అని రచయిత రవి నోట చెప్పించిన మాటలు సీమలో పంట పండించడం, కొండపొలం చేయడం కష్టతరమని సూచిస్తాయి.

నాగరికత పల్లెల్లో కూడా రాజ్యమేలుతున్న ఈ కాలంలో కూడా కొండ పొలానికి కదలిపోయే గొల్లబోయలకు బత్తెం తయారు చేసే గొల్ల ఇల్లాళ్ల నైపుణ్యం అబ్బురపరుస్తుంది. సజ్జ రొట్టెల్ని కాల్చడం, ఇంటిముందు మంచాల్లో ఎండబెట్టడం అదొక ప్రత్యేక నైపుణ్యం. వేరుశనగిత్తనాల పొడిముద్ద, రెండు బెల్లపు వుండలు, పది వుల్లిగడ్డలు, రెండుశేర్ల బియ్యం, ఇవి కొండపొలం చేయడానికి పోయే గొల్లల ఎనిమిది రోజుల బెత్తెం ఒకపూట వండుకుంటూ రొట్టెల్ని తింటూ కొండపొలం చేసే జీవనపోరాటం యెంత దుర్భరమో అనూహ్యం.

దాదాపు ఇరవై కుటుంబాలవాళ్లు ఇరవై మందితో వెయ్యిదాకా గొర్లు కొండకు దారి పట్టినపుడు అది జీవన పోరాటానికి బయలుదేరిన బెటాలియన్‌ను తలపిస్తుంది. అదొక అద్భుతదృశ్యం. వారిని సాగనంపడానికి వూరు వూరంతా బయటికి వస్తుంది. అదొక మమతానురాగాల కదలిక.

ముందుగా మనిషి అతని వెనుక మేకపోతు దాని వెనుక తలపొట్టేలు. అక్కడక్కడ రెండు మూడు కుక్కలు. వేగంగా నడుస్తోన్న మంద వింతగా వుంటుంది గొల్లల్లో అందరికంటే పెద్దవాడు పుల్లయ్య. తరాలుగా వృత్తిని నమ్ముకున్న కుటుంబం. అనేకమార్లు కొండపొలం చేసిన అనుభవముంది. క్రూరమృగాల స్వభావం తెలిసిన వాడు తర్వాత గురప్ప, అతని కొడుకు ఉద్యోగ ప్రయత్నంలో వున్న భాస్కర్, మానెయ్య, పిచ్చన్న మొదలైన వాళ్లు.

కొండపొలం చేసేటప్పుడు గొర్లు మేతకు వచ్చినప్పుడే గొల్లలు రొట్టెముక్క నమిలేది. అవి కడుపునింపుకుంటేనే వీళ్లు కడుపాకలి తీర్చుకునేది. ఒక్కొక్కసారి దోనెల్లో దోసెడు నీళ్లుంటాయి. వాటిలో పురుగులు తేలియాడుతూ వుంటాయి. గుడ్డ అడ్డమేసి పెదాలతో పీల్చుకుని తాగి ప్రాణాలు నిలుపుకోవాలి. బతుకు పోరులో వారికి ఇదొక భాగం.

రకరకాల జంతువులు ఒకవైపు భయాన్ని కలిగిస్తుంటే మరోవైపు పక్షులు సంతోషాన్ని కలిగిస్తుంటాయి. ప్రాకృతిక సౌందర్యానికి ముగ్ధులైపోతుంటారు గొల్లలు. పెద్దపులి, చిరుత, చిలువ, ఎడగండు, ఎలుగుబంటి వంటి క్రూరమృగాల అరుపులు, కదలికలు మంద దగ్గర పడుకున్నపుడు గొల్లల కనుల ముందు భయాన్ని కలిగిస్తూ నిద్రను దూరం చేస్తుంటాయి. ఎపుడైనా పులి వంటి క్రూరమృగం మందమీదికి వస్తే గొల్లలు దానికి అడ్డుపోరు. "అది మనకాడికి రాలే, మనమే దాని తావుకు వచ్చినాము. ఇన్ని జీవాల పానాలు నిలబెట్టుకొంటూ ఒక జీవాన్ని రుసుమిచ్చి పోలేమా!" అనేది వారికి కొండపొలం నేర్పిన జీవన పోరాటం.

మంద సేద దీరేటప్పుడు గొల్లలు ఒక్కొక్కసారి చెట్టు వేర్ల మీద కూర్చుంటారు. అపుడు ఆ వేరు కదిలినట్లు అనిపిస్తుంది. ఉలికిపాటుతో లేచి చూసినపుడు ఎండుటాకుల కింద మెల్లగా కదలడం గమనిస్తారు. చివరకు అది కొండసిలవ అని తెలిసి నోరు తెరవాల్సిందే! ఆ క్షణంలో అదురుపాటు చోటు చేసుకున్న మరలా మామూలు వాళ్లలా మందవెంట కదిలిపోతారు.

కొండపొలానికి వచ్చినవారు ముందుగా పోగొట్టుకోవలసింది భయాన్నే! భయపడితే చెట్టు మీద నుండి విరిగిపడే కొమ్మకూడా పాముగా భయపెడుతుంది. కొండల్లో తిరిగే అనుభవం భయాన్ని దూరంగా నెడుతుంది.

ఒక్కోసారి అర్థరాత్రిపూట పెద్దపులికీ పందికీ మధ్య పోరు భయంకరంగా వుంటుంది. ఆహారం కోసం పులి, ప్రాణం కోసం పంది తీవ్రంగా ఘర్జిస్తాయి. గుండెలు జలదిరిస్తాయి. ముదిరిన పంది అయితే పులిని లెక్కే చేయదు. కాని పులికి లఘువు ఎక్కువ. అవి రెండు పోట్లాడుతూ మంద వైపు వస్తే గొర్లన్నీ చెల్లాచెదురై దిక్కులబడి పరిగెత్తుతాయి. అందుకే గొల్లలు మందచుట్టూ మంటలేస్తారు. అపుడు జంతువులు ఈ వైపు రాకుండా పోతాయి. కొండపొలం చేసే గొల్లలకు ఇలాంటి మెలకువలు తెలుసు.

అనుకోకుండా భయంకరమైన పులి ఎదురుగా మనిషిని నిలేసినపుడు కాపర్లంతా ఒక్కటిగా రాళ్లతో యెదుర్కొని కాపాడడం జరుగుతూ వుంటుంది. వళ్లంతా కళ్లుగా చేసుకుని తమకు, తమ జీవాల్ని గొల్లలు కాపాడుకుంటూ వుంటారు. బతకాలనుకున్నపుడు భయముండాలి కాని చావు యెదురైనప్పుడు భయమెందుకు – అనేది అనుభవం వారికి నేర్పుతుంది.

మేతమేస్తూ ఒక గొర్రె కిందపడి నడుములు విరిగిన గొర్రెను ఇంటికి చేర్చే దారిలో ముగ్గురు గొల్లలకు పులి యెదురుపడినపుడు జరిగిన పోరు మరిచిపోలేనిది. శీను మెడమీద మోసుకపోయే గొర్రె అరుపు విని పులి యిటువైపే రాసాగింది. గొర్రెను ఒకచోట దించి శీను భాస్కర్, రవి పులిని తరమడానికి వడిసెల రాళ్లతో దాడి ప్రారంభిస్తారు. అది ముదిరిన పులి. భయపడకుండ వీరివైపే రాసాగింది. వీరికి

## కవిత

# స్వార్థాన్ని గెలుద్దాం

- ఎస్.ఆర్. పృథ్వీ
9989223245



స్వార్థం చినుకులు
మది బావిలో ఊరినప్పుడు
అసంతృప్తి జ్వాలై ఎగిరి
మానవతా తీగెలను కాలుస్తుంది
జీవన మార్గాల వెంట
అక్రమాల బలాన్ని ప్రోదిచేసి
అవినీతికి దన్నుగా నిలుపుతుంది
పరిమళ భరితమైన
నీతి మొక్కల్ని తృంచేసి
ఆ స్థానాన్ని, బాహ్యాందంతో ప్రకాశించే
అవినీతి క్రోటన్ మొక్కలతో నింపేస్తుంది
అది చూచిన ప్రజల చూపులు
భ్రమలో ఈదులాడతాయి
నిజాయితీని అక్షరాలుగా మల్చుకున్న వాడి
నయన కాంతుల్లో మాత్రమే
దాగివున్న కంటకాలు ప్రతిబింబిస్తాయి
మొత్తం మనిషినే ఆధీనంలోకి
తీసుకోగలిగిన, స్వార్థం పురుగుల్ని వేటాడటం
మనిషికిప్పుడు నేర్వాల్సి ఉంది
అలజడిని కలిగించే తృప్తి వాయువుల్ని
మెదడులోకి పంపుదాం
స్వార్థపురుగుల్ని నాశనం చేద్దాం. ♦

---

తోడుగా అడవిలో యానాదులు సాయపడతారు. వీళ్ల రాళ్ల దెబ్బలు ఒ వైపు దివిటీల మంట మరోవైపు, గుండెలు అదిరిపోయే కేకలు ఇంకోవైపు పులిని భయపెట్టాయి. వెనకడుగు వేయించాయి. కాని వీళ్లు మాటల్లో పడినపుడు ఇదే అదునని పులి వేరే దారిలో వచ్చి గొర్రెను యెత్తుకపోతుంది. ఇది విని గొల్లల పెద్ద పుల్లయ్య దావన పోయే పెద్దపులితో పోరుకు సిద్ధపడడం తగదంటు ఓ మాట అంటాడు. 'కుండలు తోలకపోయే కుమ్మరోళ్ల బండిలాంటిది మన బతుకు. బండిగాను రాయెక్కి దూకినా కుండలు పగుల్తాయి. ఎవరన్నా రాయేసినా పగుల్తాయి ఎంత జోపానంగా బతకాలో ఈ మాటలు బోధపరుస్తాయి.

పెద్దపులి వంటి అనేక క్రూరమృగాలతో తలపడుతూ వాటిని అదరగొట్టి బెదరగొట్టి తరమడమనేది కొండపొలం చేసే గొల్లలకు నిత్యకృత్యం. చిరుతపులి యెదురు పడటం ఒంటిగానే తలపడడం అతిసహజం. కానీ పెద్దపులి యెదురుపడినపుడు అది వూర్కొంటూ మీదికి వచ్చినపుడు మరణం అంచున నిలబడినపుడు పోరుకు సిద్ధపడక తప్పదు. ఒకసారి ముదిరిన పెద్దపులి రవి, భాస్కర్‌లకు ఎదురుపడి మీదికి వచ్చినపుడు భయపడి భాస్కర్ చెట్టెక్కితే రవి ఒక్కడే దానితో తలపడిన సంఘటన వళ్లు జలదరింపచేస్తుంది. పదిగజాల దూరంలోకి వచ్చి పులి ఒక్కసారిగా గాండ్రించి శరీరమంతా వెనక్కి కుదించి, కుప్పించి యెగిరేందుకు సిద్ధమైనపుడు యెంతటి వీరునికైనా గుండెలు నీరుగారిపోతాయి. కాని రవి వెనకడుగు వేయకుండా దాని పంజా తన మీద పడకముందే గొడ్డలితో నరుకుతూ పక్కకు గెంతాలనే వ్యూహంతో వేగాని అంచనా వేసుకుంటున్న ఆ క్షణంలో పెంపుడు కుక్క పులి మీదికి చెంగున యెగిరి దాని కాళ్ల సందున తలదూర్చి బీజాల్ని నోట కరచుకుంటుంది. ఇదే అదునుగా రవి ఒక్క యెగురు యెగిరి గొడ్డలితో పులి తల మీద మోదుతాడు. దానితో పులి చేష్టలుడిగి నేలమీద కూలబడుతుంది. చంపాలనుకుంటున్న రవికి ఆ క్షణంలో అనుభవమున్న పుల్లన మాట జ్ఞాపక మొస్తుంది. దాని సామ్రాజ్యంలోకి వచ్చి దాని సొమ్ము మనం తింటున్నాం. దానికి అపకారం చేసే హక్కు మనకులేదు. ప్రాణం మీదికొచ్చినపుడు గొర్లల్లో ఒక గొర్రెను ఇచ్చుకోవాలే గాని మృగానికి కీడు చేయరాదు. మానవతా హృదయమున్న రవి పులిని చంపకుండా వదిలేస్తాడు.

ఆప్యాయంగా చేరదీసే అమ్మఒడి అడవి. జీవితానికి భరోసానిచ్చే నాన్న అంకతలం అడవి. అలాంటి అడవి నాశనం కాకుండా చూసుకుంటేనే అది మనల్ని రక్షిస్తుంది. అందుకే గొర్ల కాపరులు ఎర్రచందనం స్మగ్లర్లకు యానాదుల తోడుతో బుద్ధి చెప్తారు. పర్యావరణ పరిరక్షణలో తమ బాధ్యతను నెరవేరుస్తారు.

చాలా మందికి కొండపొలం చేయడమంటే తెలియదు. గొర్లకాపరుల జీవన పోరాటం తెలియదు. సన్నపురెడ్డి వెంకటరామి రెడ్డి గారి నవల కొండపొలం చదివి, వారు పడుతున్న కష్టాలు తెలిసి చేతులు జోడించి నమస్కరించకుండా వుండలేరు. ♦

# కవిత

## దుఃఖ సమాధి

- రాఘవేంద్ర గండ్లూరి
9494074022

పచ్చని నేలను పరికించడమే కాదు
పస్తుల బతుకుల్ని పలకరించడం కావాలి

చినుకుల చిత్తడిమధ్య సెల్ఫీల్లో
బందీలు కావడమే కాదు
నేల డొక్కలు నెర్రలు చీలిన చిత్తరువుల్ని కళ్ళల్లో
ఫ్రేమ్ లుగా నింపుకోవాలి

అందుకే !
మా నేల కావాలి ఒక టూరిజం !!

కడుపునిండా చియ్యతినేకి
ఇంట్లో చావుల్ని కోరుకున్న ఆకలి వ్యధ

సొబగుల్ని కంటి కద్దుకొనడమే కాదు
కూటికోసం గుండెలవసిన నా నేల ఆకలికథల్ని
గుండెలకద్దుకోవాలి
అందుకే!
మా నేల కావాలి ఒక టూరిజం !!

కాలం
కరుడుగట్టిన లోహగగనం
నేల
చుక్కలు పూయని శిలాజం

నిన్న
చేన్లో పొరాడిన రైతు
అడుగుల గుర్తులు చెరిగిపోయాయి
పేగుకు నేలకు మధ్య విరుగుతున్న వంతెన
తరాలుగా వెంటాడే ఆకలి ప్రశ్నలకు ? జవాబులు
అర్ధాంతర మరణాలు !
ఇక్కడ మరణమూ యుద్ధమే అవుతుంది

ప్రతీ నిష్క్రమణ
కుటుంబం గొంతులో విషవలయాన్ని నింపుతుంది

ఒక అసహాయత



ఒక నిస్సహాయత
అందుకే !
మా నేల కావాలి ఒక టూరిజం

తొలచిన విత్తనమై మట్టిలో రాల్చేసుకున్న
ఆ ఎడారి దేహాలు
ఇంట్లో పెళ్ళాం బిడ్డల కనుపాపల లోయల్లో
నెత్తుటి కళ్ళాపి చల్లిన శవాల పందిరిలా
వేలాడుతూ చెరగని ఉత్తరమై నిలచిన దృశ్యాలు
అనేక విషాదాలు పొరలుగా రాలిపడిన
దుఃఖసమాధి పై
ఒక విధ్వంసపు ఆనవాళ్ల ముద్రలు పరుచుకున్న
వర్తమాన పుస్తకం
నా నేల

కంటిగోడల మీద
పచ్చబొట్లుగా అతికించుకుని
నాల్గు కన్నీటి బొట్లన్న రాల్చుదురు

అందుకే !
మానేల కావాలి టూరిజం
ఆ నీటి బొట్ల తడితో
నేలకు కాస్తంత ఓదార్పన్న అవుతుంది
♦

# గే-మ్

- డాక్టర్ మాటూరి శ్రీనివాస్
9849000037



గాయత్రీ మంత్రం మంద్ర స్వరంతో నిరంతరం ఆ ఇంటిలో వినబడుతూనే ఉంటుంది. పడుకున్నప్పుడూ, ఇంటిలో ఎవరూ లేనప్పుడూ తప్ప. ఇండిపెండెంట్ స్వంత ఇల్లు, పెద్ద ఆవరణ తోటలో ఒకవైపు వినాయకుడు విగ్రహం మరొక వైపు కృష్ణుడు విగ్రహం పూజలతో పోటీ పడుతూ ఉంటాయి. శంకరంపిళ్ళై వినాయకుని భక్తుడు. శంకరం పిళ్ళై చాలా తెలివైన వాడు. బెంగుళూరులో రెండు సాఫ్ట్ వేర్ కంపనీలకు అధిపతి. దేశంలో అలాగే విదేశాల్లో ఉన్న చాలా విశ్వవిద్యాలయాల్లో విజిటింగ్ ప్రొఫెసర్. ఎన్నో పుస్తకాలు రాసాడు. ఆయన చెప్పే ఆన్ లైన్ క్లాసెస్ అంటే దేశవ్యాప్తంగా విద్యార్థులకు చాల ఇష్టం. ఒక విధంగా నేటి ఆధునిక విద్యా ప్రపంచానికి రాయబారి అతడు. వయసు కూడా ఏభై లోపే. కానీ ఇంటిలో వంశపారంపర్యంగా అనాదిగా వచ్చే ఆచారాలను వారసుడు, సనాతనుడు. ఏవైతే నంబూద్రి బ్రాహ్మణ సంప్రదాయ పద్ధతులు ఉన్నాయో వాటన్నిటినీ తూచా తప్పకుండా పాటించడంలో నిష్ఠగా ఉంటాడు. చెవి మీద జంధ్యం వేసుకుని కాల కృత్యాలు తీర్చుకునే దగ్గర నుండీ భార్య ముట్టు సమయంలో పడగ్గదిలోకే కాదు కనీసం వంటగది లోకి కూడా రానివ్వడంటే నమ్మశక్యంగా ఉండదు. తను ఊళ్ళో ఉన్న సమయంలో భార్యను ఆ మూడు రోజులూ "ముట్టు"కోడు. ఆ మూడు రోజులు ఆయన మట్టుకు ఆయనే వంట వార్పూ చేసుకుంటాడు కూడా, వంట మనిషి సహాయం కూడా తీసుకోడు. వంటమనిషితో ఆ సమస్య వస్తే అది అతని భార్య చూసుకుంటుంది. ఒకవేళ ఆయన ఆ సమయానికి ఊళ్ళో లేకపోతే పెరట్లో ఒక వొత్తుల స్టవ్వు కిరోసిన్ ఉంటాయి. ఆ స్టవ్వు వెలిగించి ఆమె వంటమనిషితో వంట చేయించుకుని గడపాలి. అక్కడ గిన్నెలు కూడా వేరే. వంట మనిషి కూడా నలభై లోపు ఉండడం దానికి కారణం. భార్య ఆండాళ్ పిళ్ళై. కృష్ణుడి భక్తురాలు. భర్త ఇంటిలో లేనప్పుడు ఆమె ఇంటిలో ఖాళీగా ఉన్నప్పుడు భగవద్గీత వింటుంది. మరీ బోర్ కొడితే మీరా భజనలను వింటుంది. ఆమె చాలా తెలివైన చాదస్తురాలు, అందుకే "మా ఇద్దరికీ జోడీ కుదిర్చాడా బ్రహ్మ," అని మురిసిపోతుంది ఆమె. మూడు ముక్కల్లో చెప్పాలంటే ఆమె భోజ్యేషు మాత, కార్యేషు దాసి, శయనేషు రంభ. ఆ ఒక్క మూడు రోజుల సమయంలో మాత్రం ఆమె అంటరానిది. అన్నిటికంటే గొప్ప ఆశ్చర్యమూ కలిగించే విషయం ఏమిటంటే ఆమె కూడా విద్యాధికురాలు. బెంగుళూరులోనే ఒక డీమ్డ్ యూనివర్సిటీలో ఆంగ్ల ప్రొఫెసర్. వారికి ఒక్కగానొక్క కొడుకు, కార్తీక్ పిళ్ళై. తల్లితండ్రుల ఇద్దరి తెలివితేటలను, వారసత్వం లక్షణాలను నూటికి నూరు శాతం పుణికి పుచ్చుకున్నవాడు. చిన్నప్పటి నుండీ ఆటలలోనూ చదువులోనూ అన్నిటిలోనూ మొదటి రాంకు అతనిదే. ఐ.ఐ.టి అనంతరం ఐ.ఐ.ఎం లోనూ అతడే టాపర్. మంచి ఒడ్డు, మంచి పొడవు చురుకైన

ముఖ కవళికలు, చూసిన వెంటనే ఆకట్టుకునే మళ్ళీ చూడాలనిపించే ఆకారం. నేటి తరం అమ్మాయిల కలల రాకుమారుడు, ఆఫీసులో కొందరు తెలుగమ్మాయిలు అతడ్ని గ్రీకు వీరుడని పిలుచుకుంటారు.

" ఏమండీ మనవాడికి పెళ్లి వయసు వచ్చిందను కుంటున్నాను., ఏమంటారు " అంది భార్య బెడ్ రూమ్ లో మంచం ప్రక్కన వారగా తలగడకు జారబడి తాంబూలం చిలకలు చుట్టి ఇస్తూ .

"నిజమే వాడి స్మార్ట్ నెస్ కి మనవాళ్ళంతా ఎక్కడికి వెళితే అక్కడ నోళ్లు వెళ్ళ బెడుతున్నారు, ఆడపిల్లలు వాడి నుంచీ మొహం త్రిప్పుకోలేకపోతున్నారు, నేనూ గమనించాను. మరెక్కువ కాలం ఆగడం మంచిది కాదు," అన్నాడు ప్రొఫెసర్ శంకరం పిళ్ళై.

"అల్ రెడీ నాకు బోలెడు సంబంధాలు సిఫారసులు వచ్చేస్తున్నాయి, తెలుసా" అంది ఆమె కాస్త గర్వంగా

"నాకు కూడా చాలామంది ఆడపిల్ల తండ్రులు ఫోనులు చేసేస్తున్నారు, నీవు వాడి పెళ్లి విషయం ఎప్పుడు కదుపుతావా అని ఎదురు చూస్తున్నాను" అన్నాడు ప్రొఫెసర్ కాస్త అహంభావం తో .

"అయితే , ఏమి చేద్దాం ?" అంది భార్య

"దేని గురించి " .......

"అదే పెళ్లి గురించి ...."

"వాడు ఏమీ మాట్లాడం లేదు. కానీ, అప్పుడే వాడికి ఇరవై ఆరు దాటిపోయాయి.." అందామె.

"నాకు ఇరవై నాలుగు కే అసిస్టెంట్ ప్రొఫెసర్ ఉద్యోగం రాగానే పెళ్లి చేసేసారు మా వాళ్ళు" అన్నాడు ప్రొఫెసర్

"అవును అప్పుడు నాకు పద్దెనిమిదే, పీ.జిలో జస్ట్ జాయిన్ అయ్యాను .." అంది భార్య

"సరే, రేపు బ్రేక్ ఫాస్ట్ టైం లో కదిపి చూద్దాం.. " అన్నాడు ప్రొఫెసర్

♦♦♦

ప్రతీ ఉదయం ముగ్గురూ ఉదయాన్నే ఎవరి గదుల్లో వారు తమ పనులు ముగించుకుని హాల్లో డైనింగ్ టేబుల్ వద్ద కలిసి కాసేపు గడిపి ఎవరి మట్టుకు వారు అవసరం మేరకు మాట్లాడుకుని పనుల్లోకి వెళ్లి పోతారు. సాయంత్రం వరకూ ఎవరి పేకేజ్ జీవితాలు వారివే . ఊళ్ళో ఉంటే ముగ్గురూ డిన్నర్ కి మళ్ళీ అక్కడే కలుస్తారు. మిగిలినవన్నీ వాట్స్ అప్పులో జరిగిపోతూ ఉంటాయి. కొడుకు కూడా త్వరగానే చిన్న వయసులోనే పెద్ద చదువు చదువుకుని అప్పుడే వారితో సమానంగా సంపాదించడం వారిని ఎంతో గర్వానికి లోను చేస్తూ ఉంటుంది. నిజానికి ఏ తల్లి తండ్రులకైనా అది గర్వ కారణమే. వారం రోజులకు మించకుండా ఆరు నెలలకొక సారి కంపనీ డబ్బుతో అఫీషియల్ గా విదేశీ ట్రిప్పులూ, డబ్బు ఖర్చులేకుండా విలాసవంతమైన జీవితం. మంచి పేకేజ్ లో జీతం. ఈ కాలంలో ఉన్నత చదువులకు కార్పోరేట్ ఇచ్చే రెమ్యునరేషన్ పేకేజిల్లో ఉంటుంది. ఆ భాషలో చెప్పాలనే కొడుక్కి ఇరవై ఎనిమిది లక్షలు పేకేజ్. అన్ని రకాల ఉపకార వేతనాల ఆదాయాలు అందులోనే ఉంటాయి. ఈ పేకేజ్ కల్చర్ ఇప్పుడు ప్రతీ రంగంలోనూ ఒక ఫేషన్. ఒక్కొక్క గుళ్ళో ఒక్కొక్క పూజకు ఒక్కొక్క పేకేజ్. పెళ్లిళ్లలో పురోహితుడికి, వంటకీ, డెకరేషన్‌కి, బజంత్రీలకే ఒకో పేకేజ్. చావుకీ, టూర్లకీ, చదువులకి ఈ పేకేజ్ సిస్టం అమలులో ఉంది.. ఆదాయాలతో సహా ఆచారాలకు, మూఢనమ్మకాలకూ నిత్యసరాలకూ కమీషన్ వ్యాపారులకు ప్రైవేటైజేషన్ ఇచ్చిన పరిభాష ఈ పేకేజ్. సామాన్య ప్రజలకు కార్పోరేట్ వేసిన ఒకరకమైన మానసిక ముసుగు. ఒక ఆధునిక దోపిడీ సంప్రదాయం ఈ పేకేజ్ .

ఉదయాన్నే ఏడూ నలభై ఐదు కల్లా వీళ్ళ ముగ్గురి పేకేజ్ లైఫ్ ఆరంభం అవుతుంది. ఒక్కొక్కరుగా ఎవరి గదుల్లోంచి వారు మూడు వైపుల నుండీ డైనింగ్ టేబుల్ దగ్గరికి చేరుకుంటారు. ఉదయాన్నే వంట మనిషి అనే కంటే బాగా దగ్గర బంధువైన నలభై లోపున్న విధవరాలు ఒకామె వచ్చి ఉదయం టిఫిన్, మధ్యాహ్నం వంట చేసి కేరేజిలు కట్టి తొమ్మిదికల్లా వెళిపోతుంది, అమెదొక పేకేజీ. ఈ రోజు వేడి వేడి ఊతప్పం, పొంగల్ హాట్ డిష్ లోంచి సర్వ్ చేయబడడానికి తొంగి చూస్తున్నాయి. ఎవరు నీళ్ళ బాటిల్స్ వాళ్ళు ఫ్రిడ్జి లోంచి తీసి తెచ్చు కున్నారు. ప్రక్కనే మూడు లంచ్ పేక్‌లు, మూడు స్నేక్ పాక్‌లు కట్టి సిద్ధంగా ఉంచడం వంటామె పేకేజ్ లో భాగం.

"వాట్ కార్తిక్? ఈ మధ్య ఏమన్నా ఫారిన్ ట్రిప్ ఉందా?" పొగలు కక్కుతున్న పొంగల్ ప్లేట్ లో వేసుకుంటూ అడిగాడు ప్రొఫసర్.

"నో డాడ్, నాట్ థిస్ మంత్,.. ఈ నెల టు డేస్ ముంబై, వన్ డే ఇండోర్. మిగలిని రోజులు ఇక్కడే...ఉంటాను"

అన్నాడు కొడుకు కార్తీక్.

"గుడ్, నేను ఈ నెల ఆఖరున రెండు రోజులు బ్రేక్ తీసుకుందామనుకుంటున్నాను, ఈ మధ్య నీ పెళ్లి గురించి అమ్మ తెగ ఆలోచిస్తుంది.."

"ఊ .."

"చాలా మంచి సంబంధాలు కూడా వస్తున్నాయి"

"ఊ ...కే ..."

"ఎప్పుడు చేసుకుంటావో ? చెపితే అ సంగతి మేము ప్లాన్ చేస్తాం.."

"ఊ ... ఓ.కే "

"ఊ... ఒకే కాదు , ఐ నీడ్ యువర్ ప్రోపర్ రెస్పాన్స్, క్లియర్ గా చెప్పు " అన్నాడు తండ్రి

"ఊ .. అన్నది, రేస్పాన్సే కదా ? డాడ్ !"

"ఊ., అన్నది ఒక శబ్దం మాత్రమే, సమాధానం కాదు, ఎప్పుడు పెళ్లి చేసుకుంటావ్,? ఎలాంటి అమ్మాయి కావాలి..? ఎవరినైనా ఇష్ట పడ్డావా..? లేకపోతే మేము చూడాలా? " వరసగా అడిగాడు ప్రొఫెసర్, చిన్నగా నవ్వుతూ స్టీల్ గరిటెతో పొంగల్ రెండో రౌండ్ వడ్డించుకుంటూ , ప్రక్కనే తల్లి గ్లాస్ లో నీళ్ళు పోసికుని గుక్కెడు తాగి కుర్చీలో కూర్చుని డిష్ లోంచి ఉతప్పం వేసుకుంటూ, అన్నది ,

''లుక్, నాన్నా! నేను ఒక్కదాన్నే మేనేజ్ చేసుకోలేకపోతున్నాను. నాకు సహాయం కావాలి, ఐ నీడ్ ఎ హెల్పింగ్ హేండ్ ..., మరొక పనిమనిషిని పెట్టుకోమని సలహా మాత్రం చెప్పవద్దు.. " అంది నవ్వుతూ..

"ఊ..సరే.. రేపు సండే కదా?! మీరిద్దరూ ఫ్రీ అయితే ఈవెనింగ్ డిన్నర్ కి వెళదామా ?" అడిగాడు కొడుకు

"టాపిక్ మార్చకు..." అంది తల్లి

"ఓహొ ... ఇది టాపిక్ మార్చడం కాదు, మామ్.. ఆ టాపిక్ డిస్కస్ చేయడానికే.." అన్నాడు, కార్తిక్

ఆమె భర్త వైపు చూసింది, అతడు సరే అన్నట్లు బుర్ర ఊపాడు.

♦♦♦

రెస్టారెంట్‌లో లైవ్ బ్యాండ్ సన్నగా వినబడుతుంది. ఆ హొటల్ నగరం పెద్దది, ఖరీదైనదీను. గొప్ప వాళ్ళందరూ అక్కడికే వస్తారు. స్టార్ హొటళ్ళలో బయట లైట్లు ఎంత మిరుమిట్లు గొలుపుతాయో లోపల అంత మసకగా ఉంటాయి, ఎందుకో అర్థం కాదు . గొప్ప గొప్ప ఒప్పందాలు, లావాదేవీలు సెటిల్ మెంట్లు ఆ మసక చీకట్లోనే, అక్కడే జరుగుతాయి. సినీ తారలందరూ అక్కడే బస చేస్తారు. మసక చీకటి ఏకాంతానికి ప్రతీకగానో, లేదా నల్ల బజారుకో, నల్ల నోట్లకూ అడ్డగానో, ఒకరికొకరు కనబడకూడదనే ప్రైవసీ కోసమో, తెలీదు కానీ అదొక కల్చరల్ పేకేజ్. అక్కడే కార్తిక్‌కు స్పెషల్ డిస్కౌంట్ కూడా ఉంది. అతడి పేరున టేబుల్ రెడీగా ఉంది. రెస్టారెంట్ ఇన్ చార్జ్ ఎదురొచ్చి దగ్గరుండి టేబుల్ దగ్గరికి తీసుకుని పోయి కుర్చీలు కాస్త వెనక్కి లాగి ముగ్గురినీ కూర్చో బెట్టాడు. ముగ్గురికీ కావల్సినవేమిటో అక్కడ వారు ఏమి ఇష్ట పడతారో వారి ముగ్గురికీ తెలుసు. లైవ్ బాండ్ మంద్రంగా సాగుతోంది. ఆ మ్యూజిక్కి లయగా నెమ్మదిగా ఆండాళ్ ఆమెలో ఆమె పాట పాడుకుంటుంది. "చౌదవీ కా చాండ్ హొ...." అంటూ సాగుతోందా పాట. పాటతో పాటూ ఆమె రాగం తీస్తూ భర్తనీ కొడుకునీ మార్చి మార్చి చూస్తూ మురిసిపోతూ తన్మయత్వం పొందుతుంది. ఇంతలో పాట అయిపోయింది. ప్రాంతం అంతా కాస్త నిశబ్దం పరుచుకుంది.

"డాడ్ నాకు పెళ్లి ఇష్టం లేదు..." అన్నాడు, నేరుగా విషయానికొచ్చేస్తూ

రెండు మూడు సెకెండ్లు ఆగి కుర్చీ దగ్గరగా లాక్కుని సర్దుకుంటూ " నేను పెళ్లి చేసుకోదలచుకోలేదు.." అన్నాడు మళ్ళీ .

కొనసాగిస్తూ "అంటే ?, ప్రస్తుతం చేసుకోవాలని లేదు, నన్ను ఇంకేమీ ఇబ్బంది పెట్టవద్దు..ప్లీజ్ " అన్నాడు , నేరుగా వారిద్దరి ముఖాల్లోకి మార్చి మార్చి చూస్తూ.

తల్లితండ్రులిద్దరూ మొహాలు చూసుకున్నారు.

"సరే అలాగే ఎంత కాల ఆగుదాం ?!" అన్నాడు తండ్రి కాస్త తేరుకుని అర్థం చేసుకున్నట్లు మొహం పెడుతూ

"ఆగడమేంటండీ ? .. .అదికాదు నాన్నా !, మరొక్క సారి ఆలోచించు ,మావైపు నుంచి కూడా ఆలోచించాలీ కదా !" కాస్త నిష్ఠూరంగా అంటూ

"మన నంబూద్రి అమ్మాయిల ఫోటోలు చాలా ఉన్నాయి, చాలా ఆసక్తికరమైన ప్రొఫైల్స్ తో అందంగా ఉన్నారు. ఒక్కసారి చూడు, నచ్చకపోతే నచ్చలేదని చెప్పు.. ఎందుకైనా మంచిదని తెచ్చాను..అంటూ హేండ్ బేగ్ లోనుండి ఆల్బం తీసి కొడుకు ముందుకు తోసింది. టేబుల్ మీద కేండిల్ లైట్ వెలుగులో చిన్న హేండ్ ఆల్బంను తన వైపు లాక్కున్నాడు. సూప్ తర్వాత డిన్నర్ అయింది. ఒకసారి పై పైన తిరగేసి

ఆల్బం తిరిగి తల్లికి ఇచ్చేసాడు. ప్రశ్నార్ధకంగా చూసింది ఆమె

"రేపు మాట్లాడదాం లే, ఈ రాత్రికే నాకు పెళ్లి చేసేస్తావా ఏమిటి?!" అన్నాడు నిదానంగా

ఎవరినో ప్రేమిస్తున్నాడని తల్లి తండ్రులకి చూచాయగా అర్ధం అవుతుంది. కొడుకు ప్రేమిస్తున్నది, నంబూద్రి అమ్మాయి అయితే బాగుణు? అనుకుంటూ నిద్ర పోయింది తల్లి . లేస్తూనే వంటగదిలో అంత పని హడావుడిలోనూ పూజ గదిలో కెళ్ళి తన కొడుకు నంబూద్రి బ్రాహ్మణ అమ్మాయిని మాత్రమే ప్రేమించేటట్లు ఆశీర్వదించమని దేవుణ్ణి ప్రత్యేకంగా మొక్కుకుంది. టిఫిన్లు సమయంలో. "నేను ఆఫీస్ వర్క్ అయ్యాక అటునుండే ముంబాయి వెళతాను, రెండు రోజుల్లో వచ్చేస్తా , బుధవారం ఉదయానికి వస్తాను, బై మామ్, బి డాడ్ .." అని బయలు దేరాడు కొడుకు.

ఆఫీస్ నుండీ తండ్రికి మెసేజ్ పెట్టాడు కొడుకు.

డాడ్..!నాకు పెళ్లి మీద నమ్మకం లేదు, చేసుకోవాలనే ఇష్టమూ లేదు , బలవంతం పెట్టకండి ప్లీజ్. అమ్మకు చెప్పండి ... అని దాని సారాంశం .

పని ఒత్తిడిలో పడి ఆ విషయానికి అంత ప్రాధాన్యత అవసరము లేదనుకుని, అన్నీ మెల్లగా సెటిల్ అవుతాయలే వచ్చాక మాట్లాడుకోవచ్చులే అనుకుని మర్చిపోయాడు తండ్రి. భార్య వద్ద ఆ విషయం కదప లేదు. కొడుకు ఊరినుండీ వచ్చినా ఆ విషయాన్ని మళ్ళీ కదపలేదు. వారం గడిచింది. సడన్ గుర్తుకు వచ్చి కొడుకు నిర్ణయం సంగతి ఆ రోజు రాత్రి భార్యకు చెప్పాడు. రెండు రోజులు సెలవు పెట్టి ఆ పనిలో ఉండాలనుకుంటూ నిద్రపోయింది. రెండు రోజులు సెలవు పెట్టింది. మొదటి రోజు కొడుకు గదిని జల్లెడ పట్టింది. ఏవైనా ఆధారాలు దొరుకుతాయేమోనని... కొన్ని సాధారణ గ్రీటింగ్ కార్డులు, సిమ్ కార్డులు తప్ప కొడుకు ప్రేమలో పడ్డ ఆధారాలు లాంటివి ఏవీ దొరకలేదు. సాయంత్రం ఆస్థాన జ్యోతిష్కుని దగ్గరకు వెళ్ళింది. గోడు విన్నవించుకుంది .అతడు వచ్చే మాఘ మాసంలో కల్లా పెళ్లి అయిపోతుంది, కంగారు పడొద్దని భరోసా ఇచ్చాడు. రెండవ రోజు ఉదయం నుండీ ఊళ్ళో ఉన్న అన్ని పేరున్న దేవాలయాల్లో అర్చన చేయించి పొద్దుపోయాక మరొక పేరున్న పురోహితుణ్ణి కలిసింది. అతడు మరి కొన్ని ప్రత్యేక పూజలు, ఒక వ్రతం, ఒక హోమం సలహా ఇచ్చాడు. ఆదివారానికి వాటి ఏర్పాట్లు దగ్గరలోనే ఉన్న గుడిలో ప్రత్యేక పూజలూ, వ్రతం, హోమం, పేకేజ్ మాట్లాడుకుని వచ్చింది. గుడి పురోహితునికీ ఆమెకు సలహా ఇచ్చిన పురోహితునికి ఉన్న పేకేజ్ ఒప్పందంతో ఆమెకు సంబంధం లేదు.

ఆండాళ్ ఆలోచనలు పరిపరి విధాలుగా తిరుగుతున్నాయి. సంప్రదాయాన్ని ఆధునికత చాలెంజ్ చేయడం ఆమె తట్టుకోలేకపోతుంది. ఆమె కోరికల్లా ఒక్కటే, ప్రేమించడంలో తప్పులేదు, ఈ కాలంలో పిల్లలు ప్రేమించక ఏమి చేస్తారు. కుటుంబ సంబంధాలన్నీ ఆర్ధిక సంబంధాలైపోయి ఇప్పుడు మరొక అడుగు ముందుకేసాయి, అంతే. ఇళ్ళల్లో పిల్లలకూ తల్లి తండ్రులకూ సమయం లేక ఎవరికీ వారు బయట వ్యాపార లేదా స్వంత సంబంధాలతో బిజీ అయిపోతున్నారు. అండాల్ వరకూ వస్తే తనది కుల గోత్రాలకు ఎంతో విలువనిచ్చే వంశం. నంబూద్రీలు మలయాళీ బ్రాహ్మణులు. కేరళా మలబార్ ప్రాంతంలోని అత్యంత ధనిక అగ్రవర్ణం. వీరిని శ్రౌత బ్రహ్మణులని అంటారు. వీరు శ్రుతులకు అంటే వేదాలకు అత్యంత ప్రాధాన్యతనిస్తారు. కేరళలోని దాదాపు అన్ని దేవాలయాలకు యజమానులూ, అందులో పురోహితులూ ఈ వర్గం వారే. ద్రావిడ భాష అయిన మళయాళ భాషను సంస్కృతంతో సంకరం చేసింది వీరే. వీరు పరశురాముని వారసులుగా భావిస్తారు. పరశురామున్ని బ్రాహ్మణ క్షత్రియునిగా కొలుస్తారు. కనుక, నంబూద్రి పురుషులు క్షత్రియ స్త్రీలను వివాహం చేసుకుని వారి ఆస్తులలో కూడా భాగాస్వామ్యులై అంటే ఒక రకమైన దోపిడీగ భావించవచ్చు, ఆ విధంగా ఈ వర్గం రాజకీయంగా ఆర్ధికంగా బాగా బలపడ్డారు. ఆధునిక సమాజంలో పితృస్వామ్య వ్యవస్థకి ప్రతీకలుగా నిలుస్తారు. నంబూద్రి కుటుంబాలలో ఉన్నా, చాలామందికి తెలియని మరొక సంప్రదాయ ఆచారం ఏమిటంటే ? ఇంటిలో ప్రథమ సంతానానికే యావత్ ఆస్తి చెందుతుంది, కానీ అతడు కేవలం నంబూద్రి కుల అమ్మాయినే మాత్రమే వివాహమాడాలి, అప్పుడే ఆస్తి దక్కుతుంది. ఆండాళ్‌కు ఒక్కడే కొడుకు కాబట్టి ఆస్తి విషయంలో పెద్దగా సమస్య లేకపోయినా కులం విషయం మాత్రం చాలా పెద్ద చిక్కు వచ్చింది. ఎట్టి పరిస్తితుల్లోనూ కొడుకు నంబూద్రి అమ్మాయినే పెళ్ళాడాలి. దీన్ని జ్యేష‘త్వము లేదా జ్యేష‘స్వామ్యం అంటారు. అది వారి ఆచారం మరి. అంటే ఎంతమది కొడుకులున్నా పెద్దకొడుకుదే ఆస్తి, పెత్తనం అన్న మాట. పితృస్వామ్య వ్యవస్థలోని తెలియని, కనిపించని

మరొక తీవ్రమైన కోణం. ఇది సాధ్యం కాకుండా పోతుందేమోనని ఆమె భయం కాదు. ఆమె భయం అల్లా వర్ణ సంకరం అయిపోతుందేమోనని. ఆందాళ్‌ను తొలిచేస్తున్న మరొక సమస్య కొడుకు అంతర్ముఖత్వ తత్వం. అంతే కాదు, కొడుకు ఒకవేళ ఏ నాయర్ కులపు అమ్మాయినో ప్రేమిస్తే కుటుంబ గౌరవం, వంశ పరిస్థితులు ప్రమాదకరంగా మారతాయి. నాయర్ కుల కోడలు తన నంబూద్రీ కొడుకుతో కాపురం చేయడానికి శాస్త్ర ప్రకారం అనర్హురాలు. అలాగే వారిద్దరికీ పుట్టిన సంతానం కూడా నాయర్ కులానికే చెందుతారు. తండ్రి కులం సంక్రమించ దన్నమాట. ఏ రకంగా చూసినా ఆమె వంశం ఎన్నో విధాలుగా నష్టపోతుంది అదీ ఆమె ఆందోళనకు మరొక కారణం.

♦♦♦

కొడుకు కార్తిక్ ఏ సంగతి తేల్చకుండా తప్పించుకు తిరుగుతున్నాడు. భర్త పెద్దగా పట్టించుకున్నట్టు అనిపించడం లేదు. ఆమె పూజలూ, వ్రతాలూ, నోములూ ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ఒకరోజు తల్లీ, కొడుకులు రిలయన్స్ మార్కెట్కి వెళ్లి తిరిగి వస్తూ తల్లిని కారులో కూర్చోబెట్టి మొబైల్ కేబుల్ ఏదో కొనుక్కోవడానికి షాప్ లోని కెళ్ళాడు, కార్తిక్. అటూ ఇటూ చూస్తూ కారులో ముందు సీట్లోనే కూర్చున్న ఆమె యాదృచ్ఛికంగా డేష్ బోర్డ్ లాగింది. అందులోనుండి రెండు రకాల లిప్ స్టిక్కులూ, రెండు హెయిర్ బాండ్లూ జారి పడ్డాయి. ఒక్కసారి గతుక్కుమంది. ఆత్రుత ఆపుకోలేక లోనికి చేయిపెట్టి చూస్తే ఒక కాండోమ్ పేకెట్ బయటకు కనిపించింది. ఆమె గుండె వేగం ఒక్కసారిగా పెరిగింది. తమాయించుకుని అన్నీ గబగబా అన్నీ లోపల సర్దేసింది. ఆమెలో ఏదో తెలియని ఆదుర్ద సన్నగా మొదలైంది. ఒక ప్రక్క దుఃఖం,మరొక ప్రక్క భయం ఒక్కసారిగా ఆమెను ఆవహించాయ్. తమకు తెలియకుండా కొడుకు ఎక్కడో కాపురం పెట్టేశాడనే నిర్ధారణకు వచ్చేసింది. ఇప్పుడు ఆమె నిర్ధారణకు ఆధారాలు వెతకాలి. ముభావంగానే ఇల్లు చేరింది. కార్తిక్ మీద విపరీతమైన కోపం వచ్చింది. కొడుకు మీద మొదటి సారి మౌన యుద్ధం ప్రకటించింది. భర్తతో కూడా మాట్లాడం తగ్గించేసింది. అతనితో పంచుకోవడానికి కూడా ఆమెకు మనస్కరించలేదు.

♦♦♦

మరొక వారం తిరిగింది. గమనించి "ఏ మౌతుంది ఈ ఇంట్లో?! ఎందుకు ఏదో స్తబ్ధత, ఏదో వెలితిగా అనిపిస్తుంది?, ఈజ్ ఎవ్రీ థింగ్ ఓకే ?"...ఒకసాయంత్రం డిన్నర్ టేబుల్ దగ్గర అడిగాడు ప్రొఫెసర్, ముగ్గురూ ఉన్నప్పుడు .

"నథింగ్, ఏమీ లేదు" ఇద్దరూ దాదాపు ఒకే సారి అన్నారు.

"లుక్ బాయ్! నువ్వు ఇక నీ పెళ్లి సంగతి తేల్చాలి . ఇట్ ఇస్ టైం నౌ " అన్నాడు ప్రొఫెసర్ .

"తేల్చేదేముంది, వాడు పెద్దవాడు అయిపోయాడు, మనకు చెప్పకుండానే ఎక్కడో సంసారం వెలగ బెడుతున్నాడని నాకు అనుమానం, ఇక దాచి లాభం లేదు, ఎవరా అమ్మాయి?" అన్ని రోజుల అక్కసు కక్కేసింది తల్లి . తన మనసులోని మాటను బయట పెట్టమని ఒత్తిడి చేసింది.

"నో.. నో..నో .. నథింగ్ లైక్ దట్..అటువంటిదేమీ లేదు, నువ్వేదో అనవసరంగా ఏదేదో ఊహించుకుంటున్నావ్ మామ్" కార్తిక్ కూల్ గానే అన్నాడు.

"నో ..సంథింగ్ ఇస్ దేర్ .. నువ్వు ఏదోదాస్తున్నావ్.. " తల్లి హటాత్తుగా గొంతు పెంచింది

ఆమె స్వరం తీవ్రతకు భర్త, కొడుకు ఇద్దరూ ఒక్కసారి అవాక్కై తేరుకున్నారు. భర్త కొడుకు వైపు నిరసనగా చూస్తూ భార్య సముదాయించ ప్రత్నిస్తున్నాడు.

"కార్తిక్ ఏదో దాస్తున్నాడు .." అంది, దుఃఖాన్ని ఆపుకోవడానికి ప్రయత్నిస్తూ.

గ్లాసులో మంచినీళ్ళు పోసి తల్లి నోటికి అందిస్తూ, తను కూడా గుక్కెడు నీళ్ళు తాగి దూరంగా మరొక కుర్చీలోని కుర్చుని..

"ఓకే.. డాడ్ ! ఇంకా దాచి లాభం లేదు, ఎస్ , నేను ప్రేమిస్తున్నాను...ఐ ఆం ఇన్ లవ్ "

''ఎవరు,?! మన అమ్మాయినే? ఎక్కడ ఉంటుంది?బాగుటుందా? నీ క్లాస్ మేటా? కోలీగా?" చిక్కు ముడి వీడిన ఆతృతతో ఒక్కసారి ఊగిపోయింది తల్లి.

కార్తిక్ ని పూర్తిగా చెప్పనీ అన్నాడు ప్రొఫెసర్

"లేదు మామ్.. నేను ప్రేమిస్తున్నది అమ్మాయిని కాదు అబ్బాయిని, పేరు రజనీష్, నాకు ఐ. ఐ. ఎం లో క్లాస్ మేట్. ఐదు సంవత్సరాలుగా ప్రేమించుకుంటున్నాము ." ఇద్దరి గుండె లోతుల్లో ఎక్కడో ఫిరంగు పేలిన శబ్దం. చెరొక శకలమై దూరంగా అగాధం లోనికి విసిరివేయబడ్డ భావన. తల్లి భయంతో కంపించిపోతుంటే, తండ్రి మొదటి సారి దుఃఖాన్ని

ఆశ్రయించాల్సి వచ్చింది. తేరుకుని వెంటనే ప్రొఫెసర్ భార్య ప్రక్కకు వెళ్లి ఆమెను సముదాయించబోయాడు.

"వాట్. ఏమైంది నీకు? ఏమి మాట్లాడుతున్నావ్??" అని ఒక్కసారిగా లేవబోయి తమాయించుకుని

మళ్ళీ గబుక్కన లేచి ఒక్క ఉదుటన సింక్ దగ్గరకు వెళ్లి వాంతి చేసుకుని అక్కడే నేల మీద కూలబడిపోయింది. ప్రొఫెసర్ ఆమెను కాస్త పొదివి పట్టుకోవడం తప్ప ఏమీ చేయలేని నిస్సహాయుడైపోయాడు.

"ఒహ్హ షిట్, దిస్ ఇస్ టూ మచ్ .." అన్నాడు మెల్లగా తండ్రి కూడా ఊహించని సమాధానమది

అవమానం, కోపం, నిస్సహాయత దుఃఖం ఒక్కసారిగా ఆ విద్యార్థులైన తల్లితండ్రుల్ని నిర్వీర్యం చేసేసాయి. ఊహించని ఉత్పాతం అది. ఎలా స్పందించాలో తెలియని సందిగ్ధ. స్వలింగ సంపర్కం గురించి వినడం కూడా పాపం అని తలచే వంశం నుంచి వచ్చిన వారసుడు ఈ రీతిగా మారడంతో మనసు కకావికలమై భవిష్యత్ అంతా ఒక్క సారిగా చీకటిగా అనిపించింది ఇద్దరికీ.

♦♦♦

ముగ్గురూ ముభావంగానే ఉన్నారు. మాటల్లేవు. తండ్రి త్వరగానే కోలుకున్నాడు. భార్యతోనూ, కొడుకుతోనూ మామూలుగా ఉండడానికి ప్రయత్నిస్తున్నాడు. కొడుకు మీద మనసు విరిగి పోయింది అనడం కంటే, తప్పని పరిస్థితుల్లో ఒప్పుకోక తప్పని అనివార్యతను త్వరగా అర్థం చేసుకుని తనకు తానూ సర్దిచెప్పుకున్నాడు. ఎల్. జి. బి. టి. హక్కుల గురించి, చట్టం గురించి చదివి ఉన్నాడు. ఇప్పుడు ఆ వర్గానికి భాదితుడౌతాడని కలలో కూడా అనుకోలేదు. ఈ మధ్య దేశ వ్యాప్తంగా జరుగుతున్న చర్చలనూ గమనిస్తున్నాడు. కానీ అతని భార్యలోని బ్రాహ్మణీకం ఆమెను నిలవనీయట్లేదు. మరెన్నో ప్రశ్నలు ఆమెలో కలకలం సృష్టిస్తున్నాయ్. ఇక ఉండబట్టలేక కొడుకు తన గదిలో ఏదో కంప్యుటర్ మీద పని చేసుకుంటూ ఉంటే వచ్చి ప్రక్కన కూర్చుంది. సన్నగా నవ్వుతూ తల్లి మీద చేయి వేసాడు కార్తిక్.

"ఆ అబ్బాయి నంబూద్రి బ్రాహ్మణ కుర్రాడేనా", అని మెల్లగా అడిగింది..

తల అడ్డంగా ఊపాడు కార్తిక్. అర్థం కానట్టు చూసిందామె.

"నో ...కాదు" అన్నాడు, శాంతంగా

తల్లికి మరొక శరాఘాతం, మరొక అవమానం, ఒకదానిని మించినది ఒకటి.

" మై గాడ్! మురుగా..!! కొడుకు కులాంతర స్వలింగ వివాహానికి సిద్ధ పడుతున్నాడా ?"

"పోనీ , మలయాళీ యేనా ??" మళ్ళీ అమాయకం గా, దీనంగా నిస్సహాయంగా హీన స్వరంతో అడిగింది.

"అవన్నీ ఎందులే మామ్, అవసరమా!?" అన్నాడు, అవును అవసరం అన్నట్లు తల ఊపింది, ఆమె.

"మలయాళీ యే, కానీ .. పరయ కులస్తుడు" అన్నాడు కార్తిక్.

పరయ కులమా? వీడికేమైనా పిచ్చా?! మరీ ఇంత దారుణమా? నంబూద్రి వంశానికి ఇంత దుర్దశ వస్తుందని ఆమె కలలో కూడా ఊహించలేదు. కేరళలో నంబూద్రీ బ్రాహ్మణులు, నంబూద్రీలను తప్ప మిగిలినవారినందరినీ సూద్రులుగానో, అంటరానివారిగానో చూస్తారు. ఇంకా చెప్పాలంటే నంబూద్రీలు అంటరానితనాన్నే కాదు, చూడరాని తనాన్నీ, వారి దరిదాపుల్లోనికి కూడా రానీయని, చేరనీయని తనంని (అన్ అప్రోచ్ బిలిటి) పాటించే అమానవీయ వర్గం. వివేకానందుడు అంతటి వాడే కేరళలో పర్యటించి ఇవన్నీ చూసి ఆ రాష్ట్రాన్ని " మేడ్ హౌస్ ఆఫ్ కాస్ట్స్" (కులాల ఉన్మత్త గృహం) అన్నాడంటే కేరళలో కుల వివక్ష తీవ్రతను అర్థం చేసుకోవచ్చు. తోటి బ్రాహ్మణుడైన సరే, అతడు నంబూద్రి బ్రాహ్మణుడు కాకపోతే స్నానం చేసే పూజకు ఉపక్రమిస్తారు, వీరు. ఒక "నాయర్" కులస్తుడు నంబూద్రి బ్రాహ్మణుడికి దగ్గరగా రావచ్చు, కానీ అతన్ని తాక కూడదు. ఒక "ఇలవ" లేదా "ఇజవా" కులస్తుడు నంబూద్రీలకు కనీసం ముప్పైఆరు అడుగుల దూరంలో మసలుకోవాలి. "పులియ" కులస్తుడు తొంభై ఆరు అడుగులు దూరలో ఉండాలి. "పరయ" కులస్తులు వీరికి ఇంకా దూరంగా సంచరించాలి. ఇవన్నీ కేరళలోని అస్పృశ్య కులాలు. అటువంటి కులోన్మాద ఆచారాల వారసత్వాన్ని పుణికి పుచ్చుకున్న ప్రొఫెసర్ గారి కుటుంబం ఒక నిమ్న జాతి చెందినా సంబంధమా ?? అది కూడా అమ్మాయికి బదులు అబ్బాయిని స్వలింగ వివాహానికి అంగీకరించడమా?? అంటే యావత్ నంబూద్రి బ్రాహ్మణ వ్యవస్థే మైల పడిపోతుందనే ఆలోచన ఆమెను తొలిచేస్తుంది.

♦♦♦

మరొక వారం గడిచింది. ఇంటిలో వాతావరణం మరింత

## కవిత

# తోడూ నీడా

- కౌలూరి ప్రసాదరావు
9346700089

ఎవరో నన్ను వెంబడిస్తున్నారు
నాకు లీలగా తెలుస్తోంది
ఆ ఉనికిని గుర్తించగలుగుతున్నా
కానీ ఎవరో తెలీటం లేదు
మొదట్లో నీడనుకున్నా
నీడ డ్యూటీ దిగినపుడూ
సెలవు పెట్టినపుడూ కూడా
అదృశ్యంగా అనుసరిస్తోందది
చెవులకి స్పర్శ తెలిసినా
కళ్ళు చూడలేకపోతున్నాయి
ఛాయకి పురమాయించా
వెనుకనున్న దాన్ని కనిపెట్టమని
తర్వాత ఆ సంగతి మరిచా!
నా సమస్యలటు వంటివి మరి?!
ఏపని చేసినా ఏదొక లోటు
ఇంకా మంచిగా చేయాల్సిందని
కవితరాస్తుంటే తెలీని వెలితి
మరింత దిద్దాల్సిందని
తీసుకున్న నిర్ణయాలలో కొరత
మెరుగైన విధానాలు కాదని

అడుగడుగునా ప్రతీక్షణం
ఏదొక మానసిక సంఘర్షణ
నామీద నాకే హితవు లేదు
షాడో సాధించింది
వెనుక వెంటాడుతున్న దాన్ని
ముందుకు తోసింది
పాపం దానికీ భయమేగా!
తనకి స్థానచలనమౌతుందని

'ఎవరు నువ్వు?'
"తోడూ నీడలో మొదటిదాన్ని!"
'నువ్వు తోడా?'
'నన్ను అసంతృప్తి అంటారు!'
ఒక్కసారిగా కళ్ళలో విస్ఫోటన
ఫోర్త్ డైమెన్షన్‌లో విశ్వరూపం



'రిలాక్సేషన్ డ్యూటికొస్తే
రిలీవైపోదామనుకుంటున్నా!'
చేతులు పట్టుకు ప్రాధేయపడ్డా!
"నువ్వులేకపోతే జీవచ్ఛవాన్ని
కవిగా మనిషిగానూ
నా చివరి శ్వాసవరకూ
నన్ను వెంబడిస్తూనే ఉండు!"

♦

భయానకంగా తయారైంది. ఒకరితో ఒకరు సంబంధం లేకుండా వ్యవహరిస్తున్నారు. ఒకరి ఎత్తుగడ మరొకరికి అంతుబట్ట కుండా ఉంది. ఆండాళ్ పూజులూ నోములూ, వ్రతాలు పరాకాష్టకు చేరాయి. ఆమె ఏదో నిర్ణయానికి వచ్చినట్లు కనిపిస్తుంది. కానీ, స్వలింగ సంపర్కం అనేది ఒక మానసిక, భౌతిక , రొమాంటిక్ అట్రాక్షన్ అని, ఎన్నో దేశాల్లో అది చట్ట బద్ధమేననీ, మన దేశం కూడా 2018లో స్వలింగ వివాహాలకు చట్టబద్ధత కలిగించిందనీ ఆమెకీ తెలుసు. "వికృతి యావం ప్రకృతి" అంటే "వికృతమైనది కూడా ప్రకృతిలో భాగమే" అనే రుగ్వేద సూక్తీ కూడా ఆమెకు తెలుసు. కౌటిల్యుడు తన అర్ధశాస్త్రంలో కూడా స్వలింగ సంపర్కానికి సంబంధించి పెద్దగా ఆంక్షలూ, బలమైన శిక్షలూ ఏమీ పెట్టలేదని ఇంకా బాగా తెలుసు. అయినా కూడా ఆమె ఎక్కడా రాజీ పడుతున్నట్లు కనబడడం లేదు.

రోజూ కాఫీ అక్కడ పెట్టేసి శబ్దం చేసి వెళ్ళిపోయే ఆమె, ఒక రోజు ఉదయమే కొడుక్కి కాఫీ కప్పు అందిస్తూ డైలీ న్యూస్ పేపర్ మాట్రిమోనియల్ పేజి ను తెరచి కార్తిక్ ముందు పెట్టింది. ఏమిటి అన్నట్లు ప్రశ్నార్ధకంగా చూసాడు. నీకోసమే, చూడు అన్నట్లు సైగ చేసింది.

తల్లి అడ్రస్‌తో ఒక ప్రకటన "స్వలింగ వివాహానికి నంబూద్రి బ్రాహ్మణ వరుడు కావలెను." అంటూ కార్తిక్ వివరాలు, అతని తండ్రి వివరాలు అందులోన్నాయి.

కార్తీక్ స్పందించలేదు, అక్కడ నుండీ లేచి గబగబా తయారై వెళ్ళిపోయాడు.

అలా వెళ్ళిన కార్తిక్ మళ్ళీ ఇంటికి రాలేదు.

సంవత్సరం తర్వాత తల్లికి మెసేజ్ పెట్టాడు, "నేను, రజనీష్ ఒక పరయ కుల అనాధ బాలికను దత్తత తీసుకున్నాం, మనవరాలను చూడాలనిపిస్తే ఈ అడ్రెస్‌కు రాగలరు.."

***(సుమారు ఆరు నెలల క్రితం "కేరళ లో LGBT వర్గానికి చెందిన హరీష్ అయ్యర్ కు పెళ్లి సంబంధం వెతికిన తల్లి" అనే వార్త ఆధారంగా రాసిన కథ )***


♦

## కవిత

# మళ్ళీ మనుష్యులను నిద్ర లేపుదాం

- డా॥కత్తి పద్మారావు


వీధులన్నీ కిక్కిరిసి వున్నాయి
వస్తువులకు రంగులు వేసి అమ్ముతున్నారు
మార్కెట్ ఒక రంగుల వలయం
వీధికి వీధికి పాత్రలన్ని మారిపోతున్నాయి
మెరుపుల కలలు ఉత్తరోత్తర ఆబాస
మనిషిలో అంతస్సంభాషణ ప్రారంభమైంది
చినుకు సన్నదారగ పడినపుడంతా
బండరాయిలో కూడా చలనం
జీవన చర్యల్లో కదలికలు



అంతరంగాన్ని చూడడం ప్రారంభించాక, అదొక విశ్వగోళం
ఏ పార్శ్వాన్ని ఆవిష్కరించినా జీవితకాల చర్య
నిరంతర భావోజ్వలత, వాస్తవం ఊహా సమ్మిళిత ప్రవాహం
సృజనాత్మకత అక్కడ నుండే వస్తుంది
నదులన్నీ నిండుగ ప్రవహిస్తున్నాయి
పంటచేలో పచ్చదనం వెల్లివిరుస్తుంది
అయినా కొందరికి ఆహారం లేదు
పనిచేసే చేతులకు సూర్యోదయం అలసత్వంలోనే స్తబ్ధత
అవును! నిన్నటి వరకు చీకటిని నిషేధించారు
ఇపుడు చీకటి దొరక్క అల్లాడుతున్నారు కదా!
పిసరంత ఒంటరితనం
విశ్రాంతి మనిషిని ఉజ్వలం చేస్తుంది
మనస్సుకు విశ్రాంతినివ్వక అది రోగగ్రస్తమవుతుంది
ఎవరో పెత్తనంలో అది బానిసత్వలోకి వెళుతోంది
మీరు ఎవరి కోసం జీవిస్తున్నారు
మీరు పాడే పాట మీకోసమేనా?
అది మీ గొంతులో నుండి వస్తుందా?
మీ గుండెల నుండి వస్తుందా!
అది కొన్ని సార్లు నదులను పొంగిస్తుంది
ఆ పాటలో ఆవేదనా సుడులున్నాయి
అందరూ! తాము కలిగివున్న వాటిని కోల్పోతున్నారు
తమకు లేని వాటిని అభిలషిస్తున్నారు
కలిగివున్నది సంపదకాదా!
మేఘం మొక్క మొలవడానికి వర్షించడంలేదు
గింజ రాలడానికి వర్షిస్తుంది
సృష్టి కావాల్సిన చోట విధ్వంసం జరుగుతుంది
అక్షరమే తరతరాలకు ప్రవహిస్తుంది
అక్షరంలో జీవం వుంది
అవును! వారు అంధులే అంతర్ముఖులు కాలేక
బాహ్యాడంబరాలకు ధనం ధారపోస్తున్నారు
నిన్నటిది ఈ రోజుకి నచ్చడం లేదు
ఈ రోజుది రేపటికి పనికిరాదు
మనుషులు గుంపులుగా ఉన్న చోటుకి వారు వెళ్ళడం లేదు
దు:ఖం ఉన్న చోటును  నిరాకరిస్తున్నారు
వారు వస్త్రశాలల్లో తిరుగుతున్నారు
ఆభరణశాలల్లో పూటలు పూటలు గడుపుతున్నారు
వారికి పుస్తకశాలలు అంటే పట్టదు
అక్షర విదురులవుతున్నారు
దేని మీద మోజు పడుతున్నారో
అది వారికి తృప్తి నివ్వడం లేదు
తల్లి ప్రేమ నుండి వారు తప్పుకొన్నాక
వారిలో కరుణ భావం లోపించింది
మరణం వారికి ఒక కర్మకాండ
దు:ఖం హేతువు కాదు కన్నీరే లేని వారి
కళ్ళు గాజు పెంకుల్లా కనిపిస్తున్నాయి
వాటిలో జీవం లేదు, అవి భావాలు పలకడం లేదు
వారి మాటలన్నీ వ్యాపరీకృతం అయ్యాయి
మానవ వ్యవస్థల గురించి ఒక్క వాక్యం వారికి తెలియదు
వారి తల్లిదండ్రులను వృద్ధాశ్రమాల్లో పెట్టారు
వారిని పలకరించడానికి తీరిక లేదు
వాళ్ళు పలకరింపు కోసం తపిస్తున్నారు
వీళ్ళు అనంత భాష మాట్లాడతారు
ఆ భాషలో కృత్రిమత్వం, ఆ భాష నిరాకరణం
ఆ భాషలో నిర్లక్ష్యత, ఆ భాషలో నిందావాక్యం
ఇతరులను ఉత్సాహపరచే ఒక్క వాక్యం అందులో లేదు
ఆత్మీయత ఉన్న మనిషిని
మానవత్వం వున్న మనిషిని నిదుర లేపాలి
ఈనాడు మనిషి పై మార్కెట్ విజయం సాధిస్తుంది
మనుషులు వస్తువులవుతారు
జీవించడం ఒకరు నేర్పేదికాదు
ప్రేమ ఆత్మీయ బంధాల నుండే అది సాధ్యం
మనిషి ప్రకృతి నుండి జనించాడు
ప్రకృతే మనిషిని పునరుజ్జీవింప చేయాలి
ఆవేపే మన పయనం.

♦

విశ్లేషణ



# ప్రపంచీకరణ - వ్యవసాయం కులవృత్తులు - సీమకవిత్వం

- డా॥ రాధేయ
8247523474

"గత కాలంబు మేలు
వచ్చు కాలంబు కంటెన్" అని నన్నయ 11వ శతాబ్దంలో ప్రకటించినా

*"మంచి గతమున కొంచెమేనోయి*
*మందగించిక ముందు కడుగేయి"*

అంటూ 19వ శతాబ్దంలో ఒక స్పష్టమైన సూటైన జవాబిచ్చాడు భవిష్యత్ ద్రష్ట మహాకవి గురజాడ. తొంబై వ దశకంలో భారతదేశంలో నూతన ఆర్థిక సంస్కరణలు ప్రారంభమయ్యాయి. గాట్ (జనరల్ అగ్రిమెంట్ ట్రేడ్ అండ్ టారిఫ్స్) ఒప్పందంపై మనదేశం సంతకం చేశాక జాతీయంగా, అంతర్జాతీయంగా అనేకనేక మార్పులు సంభవించాయి.

ప్రపంచబ్యాంకు, వరల్డ్‌ట్రేడ్ ఆర్గనైజేషన్ (WTO) కలసి ఉమ్మడిగా ప్రపంచంపై పట్టు బిగించాయి. ముఖ్యంగా మూడవ ప్రపంచదేశాలను తమ ఆధీనంలోకి తెచ్చుకున్నాయి. ప్రపంచబ్యాంకు వద్దకు వెళ్ళిన దేశాలకు షరతులు పెట్టి అప్పులివ్వడం మొదలయింది. అంతర్జాతీయ వాణిజ్యానికి దేశాలసరిహద్దులు చెరిగిపోయాయి. ఈ పరిణామాలతో ప్రపంచబ్యాంకు WTO పై ఆధిపత్యం కల్గిన అగ్రదేశాలదే ప్రపంచంపై పెత్తనమయింది. బలవంతుడికీ, బలహీనుడికీ మధ్య పోటీ పెట్టడమే ప్రపంచీకరణగా రూఢి అయ్యింది. ఈ పోటీలో సామ్రాజ్యవాద దేశాలకి ప్రయోజనం చేకూరింది.

ఒక కేంద్రమంటూ లేకుండా, నిర్ణీత అధికార వ్యవస్థ అనేది లేకుండా ప్రపంచాన్నంతా ఒక సంతలాగా మార్చి వస్తువులు, మేధస్సు, సంస్కృతిని ఒకరికొకరు ఇచ్చిపుచ్చుకోవటం ప్రపంచీకరణ అని చెప్పవచ్చు. గ్లోబలైజేషన్ అనే ఆంగ్ల పదానికి సమానార్థంగా మనం ప్రపంచీకరణగా వాడుతున్నాం. కె. శివారెడ్డి ఈ ప్రపంచీకరణ మీద స్పందిస్తూ –

*"పెట్టుబడి ప్రజలకు ఒకదేశం లేకుండా చేస్తుంది*
*పెట్టుబడి ఒక దేశం ప్రజల్ని ఆ దేశంలోనే*
*కాందిశీకులుగా మారుస్తుంది*
*పెట్టుబడి మనిషిని ఇద్దరు మనుషులుగా చీలుస్తుంది*
*చుట్టూ నెత్తుటి వాసన...*
*రక్తం లేకుండా జొరబడుతున్న దోపిడి విషం"*

అంటారు –

*"ప్రాణమున్న ప్రజల ప్రాణాల్ని*
*ప్రాణం లేని కాగితమే పరిపాలిస్తోందని తెలుసు"*

అంటాడు మానవ జీవనంలో సంస్కృతి అనేది చాలా కీలకమైంది. మనం ఎలా జీవిస్తామనేది ఒక సంస్కృతి. జీవనశైలి, వేషభాషలు, ఆచార వ్యవహారాలు, సాధారణ విశ్వాసాలు, కళాసాహిత్యాలు, కుటుంబజీవనం, మానవ

సంబంధాలన్నీ ఈ సంస్కృతిలో భాగమై వుంటాయి. బలహీనులను మరింత బలహీనులుగా జేయడం, బలవంతుణ్ణి మరింత సంపన్నునిగా జేయడం దీని సంస్కృతి. ఒక్క ముక్కలో జెప్పాలంటే మన జీవన విధానాన్ని సమూలంగా మార్చివేస్తుంది.

మనం జీవిస్తున్న పల్లెలు కూడా ఈ విధ్వంసానికి లోనుకాక తప్పలేదు. ఈ విధ్వంసం అంతటితో ఆగక చేతివృత్తుల్ని వ్యవసాయాన్ని పూర్తిగా నిర్వీర్యం చేసింది.

ఈ ప్రపంచీకరణ రాయలసీమ జనజీవనాన్ని, వ్యవసాయాన్ని, చేతివృత్తులను, కుటీర పరిశ్రమల్ని ఎలా విధ్వంసం చేస్తుందో విశ్లేషించడమే ఈ వ్యాసం ఉద్దేశ్యం. కరువుకు పుట్టిల్లు అయిన రాయలసీమలో వ్యవసాయం జూదంగా పరిణమించింది. ప్రకృతిశాపం ఒకవైపు, పాలకుల నిర్లక్ష్యం మరోవైపు వ్యవసాయరంగాన్ని తీవ్రమైన దుర్భిక్షానికి గురిచేసింది. ఈ సంక్షోభం తీవ్రమై ఆత్మహత్యలే ప్రత్యామ్నాయంగా ఎన్నుకునే స్థితికి సీమరైతులకు చేరుకున్నాడంటే అతిశయోక్తి ఎంతమాత్రం కాదు.

*మట్టిని బువ్వగా పంచిన చేతులలో*
*మిగులుతున్న దింత బూడిద*
*మట్టిని సంపద చేసి పోసిన ఒడిలో*
*ఆధిపత్యం మొలుస్తున్నది అతిగా*
*మట్టిని స్వేచ్ఛగా ఎగరేయాల్సినచోట*
*చేతులిరిచి సంకెళ్ళుమొలిపిస్తున్నది*
*(వెంకటకృష్ణ - చినుకుదీవెన)*

*పెట్టుబడి సమ్మెటవేటు*
*ప్రపంచీకరణ అయిన దోపిడీకి*
*ప్రాంతీయ వ్యక్తీకరణే ఈ చావులు*
*ఈరోజు చంపాల్సిన వారికి తూటాలు*
*రేపు చంపాల్సిన వారికి అన్నపుపొట్లాలు*
*విసిరేసే సామ్రాజ్యవాద దుర్నీతికి*
*ప్రాంతీయ సిఇవోలు మననేతలు (దస్తగిరి - వొరుపు)*

*వేపపువ్వు డాలర్ ముఖంతో వెక్కిరిస్తుంటే*
*సింగపూర్ సేద్యం చేయలేక చితికిపోతున్నారు*
*కరువు కాలంలో కూలీగా వలసపోతున్నారు*
*(వొరుపు - వి.చంద్రశేఖరశాస్త్రి)*

*ఇక్కడ, జీవితంపట్ల పూచీలేదు కనుకే*
*జీవితంపట్ల ప్రేమా లేదు*
*పీడన ఇక్కడ కొత్తకాదు*
*పుట్టుక ఒక పీడకల*
*అప్పుల్లో పుట్టి, అప్పుల్లో పెరిగి*
*అప్పుల్లో చచ్చిపోయే రుణగ్రస్త*
*జీవితాలకు పీడన కొత్తకాదు*
*(అవేద - డా॥ జూపల్లి ప్రేమ్‌చంద్)*

*జీవనదులు సముద్రంపాలు*
*జనజీవనం మట్టిపాలు*
*కడలిలో కలిసే నదులు చాలు*
*కరువుసీమకు అదే పదివేలు*
*నాగలికే కాదు, నాలుకకీ దాహం తీరదు*
*విత్తనాన్ని సుత్తితో కొట్టినాసరే*
*భూమిలోకి దిగదు (వై.శ్రీరాములు - జలగండం)*

కరువు సీమలో కన్నీటిసేద్యం చేయలేక, అప్పులతో వ్యసాయం చేస్తూ జీవితాన్ని నెట్టుకొస్తూ దిగుబడిలేక, పెట్టుబడిరాక అప్పు చెల్లించలేని స్థితిలో ఆత్మగౌరవం చంపుకోలేక ఒక కుటుంబ యజమాని ఆత్మహత్య చేసుకుంటే ఆ కుటుంబంలో భార్యాబిడ్డల పరిస్థితి ఎంత దారుణంగా ఉంటుందో ఆ తండ్రి బిడ్డలు పడే వేదన ఎంత దయనీయంగా ఉంటుందో మనసీమ కవయిత్రి వర్ణించారు చూడండి

*నాన్నా! నాన్నా! ఎక్కడికెళ్ళిపోయావు నాన్నా*
*మళ్ళీ ఎప్పుడొస్తావు నాన్నా*
*దిగంతాలలో కలసిపోయేముందు*
*మేం దిక్కులేని అనాథలమై పోతామన్న*
*ఆలోచనే రాలేదా నాన్నా*
*అప్పులవాళ్ళకు మొహం చూపలేక*
*ఎవరికీ దొరక్కుండా ధైర్యంగా*
*మట్టిలో దాక్కున్నావా నాన్నా*
*పందిరి గుంజే పలాయనం చిత్తగిస్తే*
*ఈ తుఫానులో మాకు దిక్కెవరు నాన్నా*
*మాకు ఏమీ వద్దునాన్నా*
*ఈ ఇల్లు కూడా బ్యాంక్‌వాళ్ళే జప్తుచేసుకోనీ*
*చెట్టుకిందనైనా ఉంటాం, కూలిపనులతో*
*నూకలు గంజైనా తాగుతాం కానీ మాకుమాత్రం*

*నువ్వు కావాలి నాన్నా! నీ(పేమ కావాలి నాన్నా*
*నువ్వులేనిలోటు ఏ ఎక్స్‌గేషియాలు పూడ్చలేవని*
*నీకుమాత్రం తెలీదా నాన్నా!*
*చెప్పునాన్నా మళ్ళీ ఎప్పుడొస్తావో*
*(యం.ఆర్. అరుణకుమారి - చిత్తూరు)*

సీమ జనజీవనంలో బక్కచిక్కిన రైతు జనజీవనమే మనకళ్ళముందు కదలాడే ఆచార్య రాచపాళెం 'పొలి' దీర్ఘకావ్యం.

*ఇప్పుడు మానాయన*
*మోకాలిచిప్ప లరిగిపోయి*
*అప్పులగుట్టమీద కదలలేని, ఎగరలేని, ఒంటరిగువ్వై*
*జ(రిపోతులాంటి వెన్నుపూస వంగిన విల్లై*
*దుడ్డుకర్రల్లాంటి కాళ్ళు మాదిగ కొమ్మలై*
*చెట్టంత మనిషి పిడికెడు ముద్దైనాడు*
*ఇప్పుడు మానాయన*
*చిల్లులు పడిపోయిన మోటబాన*
*తెగిపోయిన తొండాప్తాడు*
*మేడి విరిగిపోయిన మడక నొగ*
*సేద్యంలో క్షతగాత్ర సైనికుడు*
*ఏ తాలిబన్లో కూల్చివేసిన బుద్ధుడు*
*(రాచపాళెం చంద్రశేఖరరెడ్డి - పొలి)*

*నది గట్టుపల్లె తనాలు ఎండి*
*ప్రపంచీకరణ గాలి దుమారాని కెగిరి*
*పట్టణాల్లో రాలిపోతున్న*
*చిరిగిపోయిన విస్తరాకులయ్యాయి*
*ఇది పెన్నమ్మ ఒక నిర్జీవ శిథిల శకలం*
*కాలిబూడిదై మిగిలిన ఒక వసంతవనం*
*(సద్దపల్లి చిదంబరరెడ్డి - మహాభినిష్క్రమణం)*

***కులవృత్తుల విధ్వంసంలో 'మగ్గం'***

శ్రమైక జీవన సౌందర్యానికి సమానమైనది లేనేలేదని మహాకవి శ్రీశ్రీ ప్రకటించినట్లుగా భారతదేశం వృత్తి ప్రధానమైన దేశం. అన్ని వృత్తులూ శ్రమతో కూడుకున్నవే.

తరతరాలుగా వస్తున్న సాంప్రదాయ కుల వృత్తులన్నీ బ్రిటీష్‌వారి రాకతో యాంత్రీకరణ ప్రారంభమై శ్రమదోపిడీ ప్రారంభమైంది. అంతేకాదు ఇవాళ ప్రపంచీకరణ నేపథ్యంలో కోట్లాది మందికి ఉపాధి కల్పించే కులవృత్తులన్నీ విధ్వంసమై నిర్వీర్యమైపోయాయి.

భారతదేశంలో అతిపెద్ద ఉపాధిరంగం వ్యవసాయం. ఆ తర్వాత రెండవ అతిపెద్ద ఉపాధిరంగం చేనేతరంగం. దేశంలో 40లక్షల దాకా మగ్గాలు ఉన్నట్లు, మరీ గ్రామీణ ప్రాంతాలో 33 లక్షల మగ్గాలు ఉన్నట్లుగా అంచనా. ఈ మగ్గాల వలన ఒక్క కోటి ఇరవై నాలుగు లక్షల మందికి ప్రత్యక్షంగా పరోక్షంగానూ జీవనోపాధి లభిస్తోంది.

ఇవాళ ముడినూలు కొనుగోలు భారమైంది. రసాయనాలు రూపాయిని వెక్కిరిస్తున్నాయి. ప్రపంచం ఒంటికి మూరెడు గడ్డనేసి నాగరికత నేర్పిన ఒంటికి జానెడు గుడ్డ కూడా మిగలని విషాదం. అగ్గిపెట్టెలో ఇమిడే చీరెను నేసిన నేతగాడు తన ఇంటి దూలానికే శవమై వేలాడే దృశ్యం. మగ్గాల శాలలన్నీ మార్చురీ గదులుగా రూపాంతరం చెందుతున్న దీవాళ. తన దు:ఖాన్ని దీర్ఘ కావ్యంగా రాధేయ 'మగ్గంబతుకు'గా ఆవిష్కృతమైంది. ఈ నేతన్నల మృత్యుఘోష జాతీయస్థాయిలో సంచలనం సృష్టిస్తోంది.

**ఉండలుగా బిగిసిన తమ నరాల్ని**
**కండెలుగా వడుకుతున్నారు**
**పేగుల్లో మెలికలు తిరిగిపోతున్న ఆకలిని**
**పోగులుగా అతికేసుకుంటున్నారు**
**జరీ అంచులమీద జలతారు స్వప్నాల్ని అతికించి**
**మగ్గంమీదే మరణ శాసనాల్ని నేస్తున్న**
**ఈ నేతగాళ్ళ ఆకలి చావులకు**
**ఖరీదుకట్టే షరాబులెవ్వరు?**
**ఈ విధ్వంస విషాదానికి**
**పల్లవి ప్రపంచీకరణది**
**చరణం సామ్రాజ్యవాదానికి**
**పాపం పాలనాయంత్రాంగానిది**
**(రాధేయ - మగ్గంబతుకు)**

**గుంతలో ఆత్మను పొదిగిన మగ్గం**
**తన నిజదేహ మెవరో తెలుసా? అని అడిగింది**
**పగ్గంలా మారిన మగ్గం**
**తనకొనకు వేలాడుతున్నదెవరో**
**తెలుసా? అని అడిగింది**
**పెట్టుబడులు నిండిన ఒక సంత**
**తనను నిలువరించే దెవరని అడిగింది**

*ఒక పని తనమున్న చేతన*
*తనలో ఆయుధముంది అందుకునేదెవరు అంది*
*(జి. వెంకటకృష్ణ – చినుకుదీవి)*

*పడుగు అతణ్ణి నిలువుగా చుట్టేసి*
*పేక అతణ్ణి అడ్డంగా కట్టేసి*
*అతన్నొక బ్రతికున్న మమ్మీని చేశాయి*
*అతడి జీవిత రాట్నంలో*
*ఆద్యంతం కష్టనష్టాలే*
*మాస్టర్ వీవర్స్ సంస్కృతీ*
*విషపుగూటిలో మోసపోయి*
*యిరుకున్న సాలీడు అతడు*
*(టి. రాజారాం, అతడే...)*

**చర్మశిల్పి :**

ఈ కవికి టవర్‌క్లాక్ సెంటర్‌లో చెప్పులకు అతుకులేస్తూ ఓ చర్మకారుడు కన్పించాడు. కవి దృష్టిలో అతడు చర్మశిల్పి. వొళ్ళంతా చెమటకాలువతో ఎండిపోయిన బోరు బావులాంటి గొంతుతో పాదచారుల పాదముద్రల్ని కొలుస్తున్నాడు. రంగురంగుల్లో వివిధ సైజుల్లో ఆకర్షించే కంపెనీ చెప్పులషాపు ముందు ఆకలి మేఘమై కురుస్తున్నాడు –

*మన పాదాలకు అద్భుత అందాల్ని*
*ఆవిష్కరించే అతడి స్వీయ ప్రతిభ*
*ప్రపంచీకరణ సమ్మెటదెబ్బకు*
*వొంగిపోయిన మేకు అయ్యింది*
*అతని తలమీద నిటారుగా తెరుచుకున్న గొడుగు*
*వడివీధిలో నల్లజెండా మొలిచినట్లుంది*
*ఆధునిక పాదుకా ప్రపంచంలో*
*అతడికి అతడే వొక మూలనపడ్డ పనిముట్టు*
*(టి. రాజారాం – అతడే)*

**మృణ్మయశిల్పి :**

ఈ ప్రపంచీకరణ కీకారణ్యంలో బతుకుమీద నమ్మకం సన్నగిల్లిన ఓ కుమ్మరిని అతని పనిముట్టు మట్టిసారెను చూస్తాడు. మట్టితొక్కుతూ ఉంటే సారె తిప్పుదూ వుంటే అతని ఒంటికండరాల్లో ఒక లయాత్మక సౌందర్యాన్ని ఈ కవి చూస్తున్నాడు.

*“కరాల్లో సత్తువంతా చూపుల్లో స్థిరీకరించి*
*సారెపై సుతారంగా చేతుల్ని కదుపుతూ*
*మట్టిముద్దలకు మనోహర రూపాన్నిచ్చే*
*‘మృణ్మయశిల్పి’ అతడు*
*తానుమాత్రం బ్రతుకు బానలోని*
*దరిద్రాన్ని మూయలేని మూకటి అవుతున్నాడు*
*ప్లాస్టిక్, జర్మన్ సిల్వర్ స్టీలు, ఫ్రిజ్, కూలర్*
*ఇవన్నీ అతని బ్రతుకును భళ్ళున*
*పగిలిన బానను చేశాయి*
*మార్కెట్ ఎకానమీలో*
*నాణ్యమైన అమ్ముడుబోని కుండే*
*అతడి పోరాటం*
*(టి. రాజారాం – అతడే)*

**రజకుడు :**

అంతేకాదు ఇవాళ ‘రజకవృత్తి’ పల్లెల్ని విడిచిపెట్టి పట్టణాల్లోకి ఉపాధి కోసం వలసవెళ్ళింది. అంతటితో ఆగలేదు. ప్రతి ఇంటికి వాషింగ్ మిషన్లు వచ్చి వారి బతుకుల్ని ఎగతాళి చేస్తున్నాయి. మనకు స్వాతంత్ర్యం వచ్చి 70 ఏళ్ళకు పైబడినా నేటికీ గ్రామాల్లో నివసించే ఈ కులాలవారు సాంఘిక వివక్షకు, కులవివక్షకు గురి అవుతున్నారు. వీరిని కులంపేరుతోనే గుర్తిస్తారు. గ్రామాలవారు తమ ఊళ్ళ నుండి ఈ కులవృత్తులవారిని బహిష్కరణ చేసిన సందర్భాలు చాలా ఉన్నాయి.

**మంగలి :**

అలాగే క్షురకర్మగా భావించే మంగలివృత్తి నిత్యమంగళుడు బతుకుతో పోరాటం చేసే నిత్యయోధుడు. తరతరాల వారసత్వం అందించిన కులవృత్తి మీద అతనికి నిత్యం కత్తిగాట్లే. పట్నంలో సెలూన్‌లు, జెంట్స్ బ్యూటీ పార్లర్‌లు వచ్చి వీరి బతుకు తెరువును దెబ్బతీశాయి.

అలాగే కల్లుగీత కార్మికులు, కమ్మరి, స్వర్ణకారుల బతుకులు బజార్నపడ్డాయి. కుట్టుమిషనుతో బతుకుబండిని లాగించే దర్జీవాడు రెడీమేడ్ వస్త్రప్రపంచంలో అదేషాపు వద్ద చిరిగిపోయిన చొక్కాలకు, ప్యాంట్‌లకు అతుకులేసుకుంటూ స్ట్రీట్ టైలర్‌గా మారిపోయిన వైనం చూడొచ్చు.

ఇవి మన రాయలసీమ రైతుల మరియు కులవృత్తుల జీవనపోరాట యోధుల హాహాకారాలు. అసంఘటిత కార్మికులు ఆకలి కడుపును చేతబట్టుకొని వలసబోతున్న కార్మికుల ఆర్తనాదాలు. ప్రపంచీకరణ నేపథ్యంలో కోట్లాదిమందికి

## కవిత

# బుస కొడుతున్న ప్రశ్నలు!?

- అమ్జద్
8686171752



*నేల మనసులో*
*విత్తనమొకటి నాటి చూస్తే*
*స్వప్నంలో తెల్లారుజామున*
*మొలకెత్తింది*
*ప్రశ్న రూపంలో మొలకొకటి!*
*తెల్లని కాండం మెడ పై*
*పచ్చని రెండు పత్రదళాలు*
*తలకాయల్లా*
*తెలివొచ్చినట్లు విచ్చుకొన్నాయి!*
*అవి రాజకీయ సూర్యుణ్ణి*
*లాక్కొని తమవైపుకు*
*బెదిరించి పొరుగు గాలిని,*
*వేళ్లూనుకొన్న నేలపొరల్లోంచి*
*రక్తం పీలుస్తున్న జలగలా*

*జలాన్ని పీలుస్తూ*
*చుట్టు ప్రక్కలున్న*
*జనాల శాంతిని*
*బలాత్కరిస్తూ*
*బలుస్తున్న కాండాన్ని*
*సహజ కిరణజన్య ద్వారా*
*తలలు వృద్ధి చెంది*
*శాఖోపశాఖలై*
*విద్యామందిరాలలో పగుళ్లనిస్తూ*
*జాతి మత వర్ణ భేదాలతో*

*సంబంధం లేకుండా*
*మసులుకొంటున్న వాతావరణాన్ని*
*కలుషితం చేస్తూ*
*విషవాయువులు*
*ప్రయోగిస్తున్నాయి*
*పత్రదళాలనుంచి*
*రూపాంతరం చెందిన*
*తలల్లో, స్థావరమేర్పరుచుకున్న*
*విషనాగులు...*
*బుస కొట్టుతూన్న ప్రశ్నలు!?* ♦

ఉపాధి కల్పించే చిన్నతరహా పరిశ్రమలన్నీ మూతబడిపోతున్నాయి. ఉత్పాదకత పెరుగుతున్నా కార్మికుల వేతనాలు పడిపోతున్నాయి. అన్ని రంగాల్లోనూ యంత్రీకరణ వచ్చి మానవశ్రమను విధ్వంసం చేస్తోంది. మానవశ్రమకు మూలాధారమైన, పేదల జీవనాధారమైన అన్నివృత్తుల్నీ ధ్వంసం చేసే ప్రక్రియను ప్రపంచీకరణ పకడ్బందీ వ్యూహంగా అమలుపరుస్తోంది.

రాయలసీమ కవిత్వంలో ఈ ప్రపంచీకరణ వ్యతిరేక కవిత్వం చాలా ఆలస్యంగా మొదలైంది. మొదటిగా ఇక్కడ జీవన్మరణ సమస్య అయిన వ్యవసాయంపైనే ప్రధానంగా దృష్టి కేంద్రీకరించింది. ఆ తర్వాత కులవృత్తుల విధ్వంసాన్ని తీవ్రంగా పరిగణిస్తూ కవిత్వం వచ్చింది. ఈ నేపథ్యంలో భాగంగా 2006 చేనేత కార్మికుల జీవిత విధ్వంసంపై నా కవిత్వం 'మగ్గంబతుకు' దీర్ఘకావ్యంగా వచ్చింది. చేనేత కార్మికుల దయనీయ బతుకు మీద వచ్చిన తొలి దీర్ఘకావ్యంగా ఈ 'మగ్గంబతుకు' విమర్శకులు పేర్కొన్నారు. తర్వాత సీమ వ్యవసాయంలో చితికిపోతున్న రైతు జీవితాన్ని ఆచార్య రాచపాళెంగారు 'పొలి' పేరుతో దీర్ఘకావ్యంగా రాశారు.

ఈ కావ్యం రాయలసీమ రైతు జీవనవ్యధ. తన తండ్రి రెక్కల కష్టంలోంచి జాలువారిన వ్యవసాయ కవిత్వం. ప్రపంచీకరణ, ప్రైవేటీకరణ, సరళీకరణ ఆర్థిక విధానాలతో ఈనాడు రైతును కుళ్ళబొడుస్తున్న దుర్మార్గపు వ్యవస్థను ఈ 'పొలి' కావ్యంలో వారు ఆవిష్కరించారు.


**ఉపసంహారం : ప్రపంచీకరణ గురించి ఒక్క మాటలో చెప్పాలంటే మన జీవన విధానం సమూలంగా మారిపోయింది. ఈ క్రమంలో జీవితానికి సంబంధించిన చాలా అభిప్రాయాలు తల్లకిందులైపోయాయి. ప్రతిదీ సొంతం చేసుకోవాలనే దృష్టి మనుషుల్లో పెరిగిపోయింది. సమిష్టితనం, సమూహచైతన్యం బలహీనపడింది.**

ప్రపంచీకరణలోని అసమానతలకు వ్యతిరేకంగా ఇప్పటికే ఉధృతస్థాయిలో సాగుతున్న ఉద్యమాలు, పోరాటాలు రానున్నకాలంలో మరింతగా తీవ్రతరం అవుతాయి.


తమతమ సాంస్కృతిక ప్రత్యేకతలు కాపాడుకోవాలనే చైతన్యం మరింత పెరుగుతుంది.

మరోవైపున ఆర్థిక, రాజకీయ, సైనిక, ఆధిక్యత కలిగివున్న ప్రపంచీకరణ శక్తులు తమ పట్టును ఇంకా దృఢతరం చేసుకునేందుకు ప్రయత్నిస్తాయి. ఇప్పటికే ప్రపంచ సామాజిక వేదిక వంటి సంస్థలు ఆవిర్భవించాయి.

ఇవాళ తెలుగుసాహిత్యంలో ప్రపంచీకరణ అన్నది ప్రధాన ఇతివృత్తంగా మారింది. దాన్ని గురించి తెలుసుకోవడం హానికర ప్రభావాలను నిశితంగా విమర్శించడం సాధారణ లక్షణమైంది. ఇవన్నీ భవిష్యత్తులో గొప్ప ప్రవాహంగామారి సమానతా సూత్రంపై ఆధారపడిన అంతర్జాతీయ వ్యవస్థను నిర్మించుకోవడానికి దారితీయాలి. సాంకేతికాభివృద్ధి సాంస్కృతిక వికాసానికి విశ్వమానవ సౌభ్రాతృత్వానికి బాటలువేయాలి. ♦




లోసారి సుధాకర్



# ఆముదపు చెట్టే బోధి వృక్షం..

- కెంగార మోహన్
9000730403

అక్షరాలపూలు ముళ్ళలా గుచ్చుకుంటాయి..విరభూసిన వాక్యాలు విధ్వంసం సృష్టిస్తాయి.అభివ్యక్తి కట్టలు తెంచుకుని మనోసముద్రాన్ని దాటి వచ్చేస్తుంది. ఎత్తుగడలు అందమైన అలల్లా ఎగసి పడతాయి. మాటలు తూటాలై పేల్తాయి. ఇది కవిత్వం..కాలగర్భాన్ని చీల్చుకుని వచ్చే కవిత్వం. లోసారిసుధాకర్ కవిత్వం నిండా ప్రాణముంటుంది. మనిషి జీవితముంటుంది. జీవనచిత్రముంటుంది. జీవితకాలంలో ఏర్పడే అనేకానేక జీవనచిత్రాలు.. జీవితకాలమంతా మనిషి పడే యాతన రికార్డు చేయబడి ఉంటుంది. కవిత్వం లోతుగా ఉంటుందనో, హృదయాన్ని కదిలిస్తుందనో చెప్పాలని ఉన్నా ఇంకా అంతకంటే గొప్ప మాటలుంటే రాయాలనిపిస్తుంటుంది. వొకానొక సందర్భంలో ఈయన కవిత్వం చదివాక ఇంతకంటే ఇంకేం రాయాలి అని నిరుత్సాహం ఆవహిస్తుంది. సమాజంపట్ల ఈ కవికి నిర్దిష్ట దృక్పథం ఉంది. అది భౌతికవాద దృక్పథమే. భౌతికవాద దృక్పథం కలిగిన ఏకవి అయినా మనిషిని కేంద్రంగా చేసుకుని ఆ మనిషి చుట్టూ కవిత్వాన్ని నిర్మిస్తారు. ఎందుకంటే మనిషే చరిత్ర నిర్మాత అన్న బలమైన సంకల్పముంటుంది. ఇక ఈ కవి రాసిన నా రహస్యమందిరంలో కవిత్వంలోకి ప్రవేశించడానికి చాలా సాహసమే చేయాలి.

***"యేళ్ళుగా సముద్రపు ఒడ్డున నిల్చున్నాను***
***నాలుగు మాటలైనా మాట్లాడదామని***
***ఓ కరచాలనమై పులకిద్దామని***
***వెన్నెల రాత్రుల్ని పెదవులుగా చేసుకొని***
***కెరటాల్నైనా ముద్దాడదామని***
***ఎంతగా ఎదురు చూశానని***
***తనువంతా ఓకన్నుగా మార్చుకొని***
***దీని రహస్యమందిరంలో దూరి..."*** ..శీర్షిక చదివాక ఏదేదో ఊహించుకుంటాం..అక్కడే మన అంతర్మథనం మొదలౌతుంది. కవి అంతరంగంలో దాగిన రహస్యకుటీరాల్ని వెతుకుతాము. కాని తాను చివరికొచ్చేసరికి "ఇప్పుడు సముద్రం నా వొడ్డున నిల్చుని నాలోకి చూస్తుంది" అని ముక్తాయించేసరికి మనలో ఉద్విగ్న చిత్రాలు రెటీనాపై ఆవిష్కృతమౌతాయి. ఈ కవిత నిండా పదచిత్రాలు పలకరిస్తాయి. తనకు తానుగా తనలో తను చొరబడి సౌశీల్యంగా పరిచితమౌతాడు. ఇతడు కవి..కవిత్వం కోసమే పుట్టిన వాడని అనాలనిపిస్తుంది. శక్తివంతమైన కవిత్వం రాశాడనిపిస్తుంది. వృత్తిలో పట్టుకున్న ఆయుధాలకంటే కలమే బలమైన పాశుపతాస్త్రమని

నమ్మినట్టున్నాడనిపిస్తుంది. ఆ ఆయుధానికి ఆంక్షలెక్కువ...ఈ ఆయుధానికి ఆంక్షల్లేవు..అడ్డుకట్టల్లేవ్..నరాలు బిగబట్టి గుండెల నుండి వస్తున్న కవితాక్షర తూటాలను లెక్కకులేనన్ని పేల్చొచ్చు. కవి ప్రయాణం భారంతో కూడుతున్నది..అతని గమనం..గమ్యం..లక్ష్యం అంతరాలు లేని సమాజం..పచ్చటి పైరులాంటి మనుషులు..కల్మషం తెలియని వ్యవస్థ..ఈ దిశగా పయనిస్తూనే కవిత్వం రాస్తున్నాడని స్పష్టంగా అర్థమౌతుంది. అందుకేనేమో ..

***"అతి సాహసవంతంగా ఓ నడక మొదలైంది***
***నిప్పుల్ని తొక్కుతూ కరకు కత్తుల్ని కసికసిగా దాటుతూ***
***నిర్భయంగా తలెత్తి తరాల చీకట్లను***
***తరతరాల బానిసత్వాన్ని ప్రశ్నిస్తూ శిరస్సెత్తి, శిఖరాలవైపుకేసి***
***ఆకాశపు దారులకేసి ఓ నడకమొదలైంది..."*** తుంపర్లు తుంపర్లుగా పడే జడివానలాంటి కవిత్వపు తుఫాను ఇలానే ఉంటుంది..నడకకు ఒక గమ్యం ఉంటుంది..అది నిరంతరం సాగుతుంది. కవి కోరుకున్న ఆశల ప్రపంచం వైపు..ఆశయాల దిక్కుల్ని కలుపుతూ వెళ్తున్న నడక.. అనివార్యంగా సాగుతున్న నడక మొదలవ్వకుండా ఎలా ఉంటుంది. చీకట్లను చీల్చుకుంటూ..బానిసత్వాన్ని ప్రశ్నించుకుంటూ...అన్యాయాన్ని నిలదీస్తూ..వెలుగులు జిమ్ముతూ సాగుతున్న పయనమిది..అంతం లేని పయనమని తెలిసినా ఆపకుండా సాగిపోవాల్సిన బహుముఖ ప్రయాణం. నిస్సందేహంగా కవి కలల ప్రపంచంలో విహరించిన భ్రాంతి కలగుతున్నట్లనిపిస్తున్నా వెంటనే తేరుకున్నట్టు.. చురకవేసినట్టు..మెలకువ వచ్చినట్టు అమాంతంగా తను వెళ్ళాల్సిన దారిలోకి వొళ్ళంతా కళ్ళుచేసుకుని వచ్చేస్తాడు. కవులు కాలాన్ని వేలుపట్టుకుని నడిపిస్తుంటారు. ఆ కాలం తిరోగమించాలని చూస్తే నాల్గు కవిత్వపు దెబ్బలేసి పురోగమనం వైపు నడిపిస్తూ దారిలో పెడుతుంటారు..కాని లోసారి సుధాకర్ ఆవిష్కరిస్తున్న ఆకురాలు కాలంలో...

***చెట్టును ఒంటరిని చేసి***
***మరి చెట్టుమాత్రం***
***ఆశల చిగుళ్ళతో కొన్ని కాలాలు***
***ఆవేదనను ఆకులుగా రాల్చుకుని కొన్ని కాలాలు***
***ఆకాశపు దారులకేసి ఎదురు చూస్తూ***

ఇంకొన్ని కాలాలు..లోసారి సుధాకర్ కవిత్వంలో ఫిలాసఫికల్ థాట్స్ కవిత్వమంతా మల్లెపందిరి పొదల్లా అల్లుకుపోతుంటాయి. ఎంతగా యోచిస్తాడో మరి..కలాన్ని అంచనా వేయగల దార్శనికత ఈ కవికుంది..నైరాశ్యం ఉన్నట్లనిపించినా మళ్ళీ ఉత్తేజం పొంది తనకు తాను సంభాళించుకుని ముందుకు సాగుతాడు..అదే ఆకురాలు కాలంలో..

***చెట్టు గొప్ప ఆశాజీవి***
***అందరికి అదర్శజీవి***
***అవును కదా కన్నీళ్ళు ఉప్పగానే ఉంటాయ్***
***కాలం కర్కశంగానే ఉంటుంది***

***భూమ్మీద రెక్కలు మొలవని మనిషి లేదు కదా***..ఎంత సున్నితంగా ఎంత సుకుమారంగా లాలిస్తున్నట్టు జోలపాడుతున్నట్టు..అప్పుడప్పుడు ఘర్జిస్తున్నట్టు అక్షరాల్ని..వాక్యాల్ని కవిత్వం చేస్తాడు...సమాజాన్ని ఎంత సూక్ష్మాతి సూక్ష్మంగా పరిశీలిస్తాడు..పరీక్షిస్తాడు..ఎలాగంటే సమాజాన్ని నాళికలో వేసి విలువల ద్రావణమేసి కలియదిప్పి చూస్తాడు..తన ప్రయోగశాలలో ఉన్నవన్నీ తన న్యూరోట్రాన్స్‌మీటర్ల నుండి ఉద్భవించినవే..నిజంగా ఇంత గాఢతగా యోచిస్తాడా..? ఈ సంపుటిలో స్పృశించని వస్తువు లేదు... దాదాపు తన గుండెల్లోంచి తన్నుకొచ్చిన ప్రతీది కవిత్వం చేశాడు..ఈ సంపుటికి నాల్గు ఆప్తవాక్యాలు రాస్తున్న సందర్భంలో అనేకానేక ప్రవళ్ళికలుద్భవించాయి..వాటన్నిటినీ సంక్షిప్తంగా పరిచయం మాత్రమే అప్పుడు చేయాల్సి వచ్చింది. ఇప్పుడు కవిత్వం అమ్మలా..నా గుండెల్ని తాకినపుడు మామూలు మాటలకు వీలెక్కడుంటుంది. కవి ఈ కవిత్వంలో యుద్ధవీరుడిలా పోరాడుతున్నాడు. నిజజీవితంలోనూ అలాగే పోరాటం ఉండొచ్చు. అది వాస్తవం కూడా..ఎన్నాళ్ళని.. ఎన్నేళ్ళని అలా అన్నీ చూస్తూ కూర్చుండాడు.. కవి ప్రపంచపౌరుడని భావిస్తున్న కవులెవరైనా ఇలాగే ఉంటారు.

***"అక్షరం ఆయుధమైతే***
***నేనెన్ని అక్షరాలను నేర్చాను.***
***ఎన్ని ఆయుధాలను అమ్ముల పొదిలో దాచాను.***
***ఎన్ని యుద్ధాలను కలగన్నాను***
***ఎన్నింటిపై యుద్ధం ప్రకటించాను.."*** నిజమే కదా..కవి

ప్రకటించిన యుద్ధమిది..కవి చేస్తున్న అక్షరయుద్ధమిది..ఈ యుద్ధమైదానంలో పోరాడేది ఒక్కడే అయినా అవతలి శత్రువులొక్కరుండరు. కవి మహాసంగ్రామంలో ఒక్కనెత్తుటి చుక్క కారదు..విలువల పంజా విసిరిన ప్రతీసారీ వేలమంది కుహానా రాజకీయ కుట్రదారులు, గతితప్పిన నీతిమాలిన మనుషులు నేలకొరుగుతారు. కవిత్వం దేనికదే భిన్నంగా ఉంటుంది. ఈ కవికి సమాజం పట్ల బాధ్యతేకాదు..ఎలాగైనా సమాజగతిని పురోగమనం వైపు నడిపించాలనే తాపత్రయం, తపన నిరంతరం కనిపిస్తాయి. కవిత్వం నిండా సున్నితమైన తిరుగుబాటుతత్వం..ఒక మార్మికత..నిండైన తాత్వికత..ఇవన్నీ ప్రతీ కవితా వాక్యంలో స్పష్టంగా కనబడ్తాయి..మనిషిని నిద్రలేపుతాయి. అని దిగంబర కవులు చేసిన ప్రకటన గుర్తుకొస్తుంది. ప్రజల్ని మేల్కొల్పాలనే ఆ మాటన్నారు. మనిషిలోని మరో మనిషిని వేరు చేసి సిసలైన మనిషిని తీర్చిదిద్దే ప్రయత్నం ..అది కవిత్వమని భావించారు..ఆ దిశగా ప్రయత్నం చేశారు.. ఆ దిగంబర కవుల్తో ఈ కవిని పోల్చదలచుకోలేదు..ఒక ఉదాహరణగా మాత్రమే చెప్పాలనిపించింది. ఈ కవి యుద్ధం చేస్తున్నాడు. నిరంతరం కవిత్వాన్నే అస్త్రంగా చేసుకుని సైనికుడిలా పోరాడుతున్నాడు. అతడు ఒంటరి సైన్యం..అతడొక సైన్యం..ప్రతీ కవిత సమాజగర్భాన్ని చీల్చుకొచ్చి వెలుతురు విరజిమ్ముతూ నవ్య కాంతులతో మొలకెత్తుతుంది. నిజం చెప్పాలంటే నిజాన్ని మాత్రమే చెప్పాలంటే ఈ కవి కవిత్వం నిఖార్సైన ప్రజాకవిత్వం రాసేకవి..ఈ కవి ఏ కవికీ పోలికకాదు..ఎవరి అభివ్యక్తీ..ఎవరి శైలీ కనబడదు. దేనికదే ప్రత్యేకం..

*"ఇవాళ మృత్యువు నాతో కరచాలనం చేసింది*
*నిజంగా మృత్యువు నన్ను కౌగిలించుకుంది*
*కాదు..నిజానికి మృత్యకుహరం నుంచి ఎగిరి వచ్చాను.*
*మృత్యువుతో యుద్ధం చేసి వచ్చాను.."* ఇలాంటి కవిత్వం..ఇలాంటి కవితా ఎత్తుగడలు మనకు కానరావు..బహుశా ఇంతకంటే గొప్ప కవిత్వం మనం చదివి ఉండవచ్చేమో..ఇలా భావాల్ని, అనుభవాల్ని..స్వేదాల్ని.. అనుభూతుల్ని.. ఆవేదనల్ని..వైరాగ్యాన్ని, నైరాశ్యాన్ని కవిత్వం చేయడం ఈ కవికే సాధ్యమనిపిస్తుంది. కవిత్వలోకంలో వేగుంట మోహన్ ప్రసాద్ కవిత్వం చదివితే ఒక కొత్త లోకంలోకి వచ్చినట్లుంటుందిని అంటుంటారు..అది వాస్తవం కూడా 'మో' కొత్త ప్రయోగాలే చేశారు..అంగీకరించక తప్పదు..కాని లోసారి కవిత్వ ప్రయోగాలకే ఊపిరి పోసి ప్రాణప్రతిష్ఠ చేస్తాడు. మో కవిత్వం గూర్చి ఎందుకు మాట్లాడాల్సొంచ్చిందంటే తెలుగు కవిత్వం మో లాంటి కవులుండరని, అటువంటి కవిత్వం మళ్ళీ చదవలేమని అనుకుంటూ ఉండే సందర్భంలో ఈ కవిత్వం చదివాక అభిప్రాయం మారింది. మో కవిత్వంలోని భావచిత్రాలెలా మదిని తొలుస్తాయో లోసారి కవిత్వంలోని భావ చిత్రాలు హృదయంలో ప్రళయాన్ని సృష్టించి మనోచిత్రమై కనబడ్తాయి. ఈ కవిత ఒక సారి పరిశీలిస్తే..

*"ఎప్పుడూ మెడపైన వేలాడుతున్న కత్తిలా*
*ఓ కల వెంటాడుతుంది*
*ఎప్పుడూ పరిచయం లేని ఓ వాస్తవం*
*ఎదురొచ్చి పలకరిస్తుంది*
*తల తిప్పినా*
*సమాధానం చెప్పాలని చూసినా*
*కలవొలికి కళ్ళలో గుచ్చుకుంటుంది*
*చూపు నేలపాలవుతుంది."* ఇలాంటి ఎన్నో కవితలు హత్తుకుంటాయి..ఆత్మీయంగా ఆలింగనం చేసుకుంటాయి. మృధుమధురంగా లాలిస్తాయి. అనేక భావాల్ని గుండెల్లో పోస్తాయి..ఇది కవిత్వం.."ఆనందం వచ్చినప్పుడు నన్ను పట్టుకోవడానికి ఓ పదం కావాలి.దు:ఖం వచ్చినప్పుడు నన్ను ఓదార్చడానికి ఓ కవిత కవాలి. అన్యాయం అక్రమాల వీపు వాయగొట్టడానికి ఓ కొరడా కావాలి. అది కలమైతే సరి..ఆ కలం ఈ దేశపు యువత చేతిలో ఆయుధం కావాలి" అదే నా ఈ కవి ఆశయం..ఇంతేనా ఈయన ఆశ..కాదు కాదు..ముమ్మాటికీ కాదు...ఇంకా వెదుకు తున్నాడు. మట్టి సీమలో, రాళ్ళసీమలో పుట్టిన వాడు దేన్ని వెతుకుతాడు..ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు...ఆముదపు చెట్టే బోధి వృక్షం..మొండి వేరుశనగ మొక్కే మాకు దేవతా వృక్షం..రైతే సిద్ధార్థుడు మా సీమలో...

♦

కవిత

# పిడికిలి బిగించిన

- అడిగోపుల వెంకటరత్నం
9848252946



ఆకులు కదిలీ కదలనట్లు
కదులుతున్నాయి
భయం భయంగా
అత్యంత నిశ్శబ్దంగా
అన్య మనస్సుతో
పరిసరాల్ని పరీక్షిస్తూ-
ధైర్యం చెప్పే ధైర్యం
చెట్టు కోల్పోయింంది
స్థాణువులా నిల్చి
ఉగ్గబట్టిన వూపిరితో
దీర్ఘతపస్విలా వుంది!
చరచరాల్ని స్పృశిస్తూ
నీరు నిశ్శబ్దమై పారుతూంది
పల్లంలో దాగుతూంది
నిశ్శబ్దానికి భయపడ్డ
తుంగపోచలు కాలువ నీటిలో
వొణుకుతున్నాయి!
రహదారిపై మనుషులు
కాళ్ళకు తొడుగులు దొడుక్కుని
మెల్లగా అతిమెల్లగా
పాదం భూమికి తగిలీతగలక
శబ్దరహిత నడకలు!
ఇద్దరు మనుషులు
కలిస్తే ఒకరి చెవిదగ్గర
ఒకరి మూతి ఆనించి
చెవులకే వినపడని చెవులు రిక్కిస్తే
కళ్ళతో సైగలు!
బైటకు వెళ్ళబోయిన
ఇంటాయన
వాకిట్లో నిలబడి
పై పంచె దులపబోయి
శబ్దానికి భయపడి
గుట్టుగా వేళ్ళతో నిమిరి
భుజంపై వాల్చిన నిశ్శబ్దం!
ప్రజాస్వామ్య పాలనలో
భూమి భయం చూసిన ఆకాశం
దారిలేని దారిలో
భూమి నడకకు బాధపడి
దిక్కులు పిక్కటిల్లేటట్లు
ఉరుములు వురిమింది
మేల్కొన్న భూమి
పిడికిలి బిగించి
శబ్దమై నిలిచింది!
శబ్దం భయానికి గ్రాసం
నిశ్శబ్దానికి ప్రాణం ధైర్యం!

♦

---

# టెక్నాలజీ +, - ఆలోచించు!

- ఆర్. లక్ష్మి
0884 - 2351683



ప్రపంచం నీ ముందున్న బుల్లిపెట్టెలోకి వచ్చేస్తుంది
సరే-
నీ ఇంట్లో ప్రతిగదీ ఒక మహా ప్రపంచమైపోయిందే!
గదికీ గదికీ నడుమ దూరాలను ఛేదించడానికి
క్రొత్తతరం ఖండాంతర క్షిపణులు కనిపెట్టాలేమో!

ఫార్మాలిన్‌లో ఉన్న బయోపార్ట్స్‌కూ
ప్రస్తుత ప్రపంచపు మానవసంబంధాలకూ పెద్దగా తేడా
లేదు
ఇక్కడ స్థూలదృష్టికి ఏమీ చెక్కు చెదరనట్టే ఉంటుంది
కానీ, జీవనాదపు అనుకంపనల జాడే కనిపించదు!

సృష్టిలో పువ్వు, ముల్లు రెండూ సమానమే
ప్రకృతి సమతూకంలో దేని ధర్మం దానికి ఉంది
కానీ మనిషి సంగతే వేరు-
ఇక్కడ ఆటో బేలెన్స్ లేదు. అకారణంగానే-
పువ్వై పరిమళించవలసిన మేధస్సు-
ముల్లై మరొకరిని హింసిస్తోంది.

♦




సింగంపల్లి
అశోక్‌కుమార్



# తెలుగువాడి 'గోల్డెన్ ట్రెజరీ'

- నందనోదయ

***"వెయ్యి సంవత్సరాలకు ఒక్కడే మహాకవి
ఇరవైయ్యారు అక్షరాలా అతడు మహాకవి
ప్రమోదాంతమైనా విషాదాంతమైనా
నింగి నటరంగాన మధ్యందిన మహారవి"***

ఇలా మొదలవుతుంది సింగంపల్లి అశోక్ కుమార్ వెలువరించిన 'అశోకనివాళి' మూడవ భాగం.

ఈ పోర్ట్రేయల్ (**portrayal**) కవిత ఎవరి గురించి? ఈ సంకలనంలో అశోక్ కుమార్ ఏంచెప్పేడు? జవాబులు చూడ్డానికి ముందు అసలు సాహిత్యం ఎందుకు? సాహిత్య ప్రయోజనం ఏవిటి? అన్నప్రశ్నలకు పెద్దలు చెప్పిన మాటల సారాంశాన్ని మరోసారి మననం చేసుకొందాం.

నిజమైన సాహిత్యం మనిషి దృక్పథాన్ని విస్తృతం చేస్తుంది. సంకుచితత్వాన్నీ వైయక్తిక స్వార్థాన్నీ పారదోలి సమాజాన్ని ముందుకి నడిపిస్తుంది. మనిషిలోంచి నిజమైన మనిషిని వెలికిదీస్తుంది. స్వాములూ సేవకులూ ఉండే స్వామ్య వాదానికి సమాధి కట్టి సామ్య వాదం పునాదిగా మానవ ప్రపంచాన్ని నిర్మిస్తుంది. సాహిత్యానికి పరమావధి ప్రపంచ శ్రేయస్సు.

సాహిత్యం విశ్వజనీనం. సాహిత్యానికి భాష, ప్రాంతం లాంటి ఎల్లలు ఉండకూడదు. ఇలాంటి సంస్కారం మహాకవి శ్రీశ్రీ ది. "ఎంతగ రచించనేమి సమకాలము వారలు మెచ్చరు.."అన్నది 'శ్రీశ్రీ' కి వర్తించదు. కాళిదాసు 'అభిజ్ఞాన శాకుంతలం'చదివి జర్మన్మహాకవి 'గేథే' నృత్యం చేశాడని విన్నాం. అలాగే తన సమకాలీనుల, పూర్వీకుల సాహిత్యం/కవిత్వం చదివి శ్రీశ్రీ నుంచి కూడా ఎన్ని హల్లీసకాలో!

ఇదీ ఈ రెండు సంకలనాలకీ భూమిక ఏవిటంటే, శ్రీశ్రీ తన కవితల్లోనో, వ్యాసాల్లోనో, సాహిత్య విమర్శల్లోనో ప్రస్తుతించిన అంతర్జాతీయ (భారతీయేతర) కవులు, సాహిత్యకారులు, కళాకారులు, సామాజిక ఉద్యమకారుల సంక్షిప్త జీవిత చిత్రాల తోరణాలు ఈ రెండు సంకలనాలూ.

మొదట్లో ఉదాహరించిన చరణం 'మిలీనియం షేక్స్పియర్' అంటూషేక్స్పియర్ ని చిత్రిస్తున్న అశోకనివాళి.

అశోక నివాళి మూడవ భాగం ఇలా షేక్ స్పియర్ తో మొదలై టి. ఎస్. ఇలియట్ దాకా నడుస్తుంది. ఈ భాగం లో ఏభై మంది సాహిత్యకారులచిత్రణ ఉంది. కాలం పరంగా చూస్తే 1564 నుంచి 1965 వరకూ శ్వాసించిన – సాహిత్యాన్ని శాసించిన అనాలేమో?– (అంటే గడచిన నాలుగు శతాబ్దాల) సాహిత్యకారుల జీవిత రేఖా చిత్రణ వుంది.

నాలుగో భాగం విశ్వ నటుడూ విశ్వ నరుడూ అయిన చార్లీచాప్లిన్ తో మొదలవుతుంది. ఈ భాగం లో కూడా ఏభై మంది కళాకారులు, సాహిత్యకారుల చిత్రణ ఉంది. ఈ సాహిత్య కారుల జీవిత కాలం 1889–2006 ల మధ్యకాలం. ఇంచుమించు 117 సంవత్సరాలు.

ప్రతి నివాళీ ఆ కవి–సాహిత్యకారుని ఫోటో తో ప్రారంభమవుతుంది. ఫోటో దిగువన ఆయన జీవిత–సాహిత్య రేఖా చిత్రణ (పోర్ట్రేయల్) గా ఓ లఘుకవిత నాలుగు పాదాలలో ఉంటుంది. తరువాతి పేజీలో (పక్క పేజీలో) ఆయన/ఆమె గురించి శ్రీశ్రీ చేసిన ప్రశంస/ప్రస్తుతి లేదా ప్రసంగం సంకలనంగా ఇవ్వడం జరిగింది.

ఈ ప్రస్తుతి శ్రీశ్రీ ఒకేమారు ఒకేచోట చేసింది కాదు. ఆయన అనేక సందర్భాలలో ప్రసంగవశాత్తుపేర్కొన్నవి. అలా

ఆయా కవులగురించి శ్రీశ్రీ చెప్పినవి అన్నీ గుదిగుచ్చి ఓ కవిత అనిపించేలా అశోక్ కుమార్ సంకలనం చేసినవి. అనితర సాధ్యంగా సంకలించినవి ఈ నూరు ప్రశంసలూ. ఇలా సంకలనం చెయ్యాలంటే ఒక్కో కవికి ఒక్కో సారి చొప్పున వందమంది సాహిత్యకారుల కోసం శ్రీశ్రీ సాహిత్యాన్ని మొత్తంగా వందసార్లూ చదివి తీరాల్సిందే.

మళ్ళీ ప్రతి భాగం చివరన ఆ ఏభై మంది సంక్షిప్త జీవిత/సాహిత్య సమాచారం క్లుప్తంగా ఇవ్వడం జరిగింది. 'ఇరవయ్యారు అక్షరాలా అతడు మహాకవి' అనిషేక్స్పియర్ గురించి రాస్తాడు. ('మిలీనియం షేక్స్పియర్' అన్న మకుటంతో – అశోక నివాళి మూడవ భాగం లో నివాళి–101) ఎక్కడా ఆంగ్ల భాషలో మహాకవి అని చెప్పకుండా ఇరవయ్యారు అక్షరాలా మహాకవి అని చెప్పడం ద్వారా ఆంగ్లభాషని ధ్వనింపచేస్తాడు. అంతే కాదు, 'అక్షరాలా' అన్న తెలుగు నుడికార ప్రయోగంతోషేక్స్పియర్ తెలుగు వాడితో మమేకం అయినట్లు తోచడం లేదూ?

నరుడా ఓ నెరోడా అన్న మకుటం తో 'పాబ్లో నెరోడా' కి అర్పించిన నివాళి: నీ గేయం 'మరేముంది మరణం తప్ప'/ అరుణాలాపన కామ్రేడ్ స్టాలిన్ గొప్ప/నరుడా చిలీ జాతీయ కవి సముద్రుడా/నీ అక్షరాలు ప్రజ్వలించే నిప్పుల కుప్ప. (అశోక నివాళి నాలుగో భాగం నివాళి–174) ఇంత కంటే హృద్యంగా చెప్పడం కుదిరేపని కాదు.

అలాగే నార్మన్బెతూన్ గురించి 'వైద్యుడివద్దకు రోగి ధన సేద్యం/రోగివద్దకు వైద్యుడు జనవైద్యం/జనతనీ సమతనీ ప్రేమించగలగడం/ఎబ్నార్మన్బెతూన్ కే సాధ్యం'అనిఎబ్నార్మల్ గా చెప్పాడు. క్లుప్తతా–సమగ్రతా ఏకకాలంలో సాధించవచ్చని నిరూపించాడు అశోక్ కుమార్ ఈ నివాళిలో. ఇలా ఉదాహరించుకొంటూపోతే ఇంచుమించు అన్ని నివాళులూ ఉదాహరించవలసి రావచ్చు.

అశోక నివాళి వరంపర ఒక ప్రయోగం. సామాజికపరమైన ప్రయోగం. సాహిత్యపరమైన ప్రయోగం. కేవలం ప్రయోగమే అయితే దానికంత విలువ ఇవ్వనక్కరలేదు. కానీ ఇది ఓ ప్రయోజన పరమైన ప్రయోగం. సాహిత్య–సామాజిక ప్రయోజనాల్ని జమిలిగా సాధించిన ప్రయోగం.

కవులూ/సాహిత్యకారులూ రచనలు చేసేది సమాజం కోసమే. సమాజ పురోగమనం కోసమే. ప్రతిభావంతులైన వాళ్ళు సృష్టించిన సాహిత్యం సమాజం లోని కుళ్ళునీ/స్వార్థాన్నీ పెకలించడానికి కావలిసిన శక్తినీ సమర్ధతనీ కలిగిస్తుంది. అటువంటి సాహిత్యాన్ని సృష్టించిన అంతర్జాతీయ సాహిత్యవేత్తలు/కళాకారులు నూరుమంది సాహిత్య/జీవిత సంగ్రహాలు పొందుపర్చిన ఈ సంకలనాలూ సాధించే ప్రయోజనం అనన్యం అనడం అతిశయోక్తి కాదు.

ప్రపంచ సాహిత్యానికి తలుపులు తెరిచిన ఈ సంకలనాలు సాహిత్యకారులు అధ్యయనం చెయ్యడం అవశ్యం. కవిత్వాన్ని / సాహిత్యాన్ని సృజించే వాళ్ళు ఎంత అధ్యయనం చెయ్యాలో ఈ సంకలనాలు చదివితే అర్థమవుతుంది. శ్రీశ్రీ, శ్రీశ్రీ ఎందుకయ్యాడో అవగతమవుతుంది. జాతీయ అంతర్జాతీయ సాహిత్యాన్ని అధ్యయనం చెయ్యడం వలన ఆ కవి ప్రతిభ పెరుగుతుంది. ఆతని సాహిత్యం శక్తివంతమవుతుంది. అంతర్జాతీయ/జాతీయ సాహిత్యాల అధ్యయనంతో సామాజిక దృక్పథం విస్తృతమయి ప్రయోజనకర సాహిత్యం వెలువడి సమాజం ముందుకు నడుస్తుంది. కవి నిజంగా 'అన్ ఎక్నాలెడ్జ్డు లెజిస్లేటర్ ఆఫ్ ది వరల్డ్' **(Poets are unacknowledged legislators of the World - Shelleyin his Defence of Poetry - 1821. )** అవుతాడు.

ఈ సంకలనాలు చూశాక అశోక్ కుమార్ ఎక్కలేని శిఖరాలు ఉన్నాయా అన్పిస్తోంది. ఈడాక్టరేట్లూ –గీక్టరేట్లూఆతని పరిశోధన, పరిశ్రమల ముందు అంగుష్ఠ మాత్రమైనవేఅని తోస్తోంది. తెలుగు సాహిత్యానికి అతడు చేస్తున్న సేవ అపారం. ఇంగ్లీష్ భాషలో గోల్డెన్ట్రెజరీ అనే ఓ సంకలనం వచ్చింది నాలుగు ప్రకరణాల్లో 1861 లో. పాల్గ్రేవ్ **(F. T. Palgrav)** అనే ఆయన సంకలనం చేశాడు. తరువాత ఇంకో ఇద్దరు మహనీయుల కృషితో అది ఆరు ప్రకరణాలతోఅచ్చయింది. అందులో ఆనాటికి జీవించిలేని కవుల 'బెస్ట్ పోయెమ్స్ అండ్ లిరిక్స్' ని పొందుపరచడం జరిగింది. ఆ సంకలనం ఓ సంచలనం సృష్టించింది.

ఆ సంకలనం 'బెస్ట్ పోయమ్స్' ని అందిస్తే ఈ నివాళి సంకలనాలు ప్రపంచపు 'బెస్ట్ పోయెట్స్' ని మనకు సాక్షాత్కరింప చేస్తున్నాయి. అందుకే ఈ అశోక నివాళి సంకలనాలు చదువుతుంటే ఇవి ఖచ్చితంగా తెలుగు వాడి గోల్డెన్ట్రెజరీ అని అర్థం అయింది. ఈ 'అశోక నివాళి' సంకలనాలు ముమ్మాటికీ తెలుగువాడి 'గోల్డెన్ట్రెజరీ'. కావలసిన వారు సింగంపల్లి అశోక్ కుమార్‌ను సంప్రదించండి– 9246277375. ♦

కవిత

## నీకు నాకు ఒకటే దారి

- అవ్వారు శ్రీధర్ బాబు
8500130770

కొన్ని కఠిన వాస్తవ గుళికలు
కొందరి మెదళ్లలో కూర్చాలిపుడు

శాంతి తేనెలద్దిన మాటల
జల్లులతో పుడమిని తడపాలి

సరిహద్దు రేఖల
అహంకార ఆభిజాత్యపు
ముష్టి యుద్ధపు గాలి
ప్రపంచ గమనంపై ముసరక ముందే
ఇగో మనసుల గొంతు నొక్కాలి.

ఇపుడు యుద్ధమంటే...
వెన్నెల కురిపించే చందమామకు
భగ భగ మండే సూర్య దేహాన్ని కప్పి
మనిషి భస్మాన్ని రాబందుకోరల
కప్పజెప్పటమే...!



ఇపుడు యుద్ధంపై యుద్ధమవసరం

సిద్ధమవుదాం నిరసనాయుధాలను
వెన్నుకు కట్టుకొని
భయమెరుగని నిఠారుతనాన్ని
కళ్ళలో కొంపుకొని......

తెలియజేద్దాం
మొక్కనివ్వని యుద్ధ కాంక్షకు
తలలు వంచి మొక్కమని...

నీకు నాకు ఇక అదే దారి

అయినా ఏమంత పోతుందని
వాపోతావ్
ఇద్దరం భూమి పుత్రులమే కదా...!
ఎక్కువ .. తక్కువ .. చింతనలెందుకు
ప్రకృతి పెంచిన మొక్కలమే కదా!

మనిషి తత్వంలో దాగున్న సునిశత్వాన్ని
వెలికి తీసి హృదయ విశాలతా
పచ్చని పంటలు పండిద్దాం.
గెలిచినా ఓడినా
తప్పని దైన్య స్థితి ని విసర్జిద్దాం ♦

---

## వెలుగు పూలు

- దామరకుంట శంకరయ్య
9440876788

వీళ్ళు
బ్రహ్మకే బ్రహ్మలు
నడయాడే దేవతలు
త్యాగాల తరువులు
బాధలను బంధించి సుధలను పంచి
నా జాతిని బతుకమ్మలా
నిలుపుతున్న గౌరమ్మలు



వీళ్ళు
గంపెడాశల్ని
గుండెలోనే గుటుక్కుమనిపించిన గులాబీలు
మోడువారిన చెట్లకు
చిగురులు తొడిగించే రుతువులు
నేల కౌగిట చేరి
కొత్తసృష్టికి పురుడు పోసే బీజాలు

వీళ్ళు
కాసిన్ని చినుకులకే తడిసి
పుష్పించే భూరుహాలు

భ్రమరాలకు
మతిభ్రమింపజేసే కుసుమాలు

వీళ్ళు
వంటింట్లో
దిగులు పడుతున్న కుందేల్లు
కాదు

బంధాలను బ్రతికిస్తూ
జీవితాలను వెలిగిస్తున్న దీపాలు

గడప దాటని కాళ్ళు
గగనాన్ని చుంబిస్తున్న వేళ
వర్తమానం అలజడుల సాగరం
నగలు చీరల ...మాటలు
మానిన నాల్కలిప్పుడు
భూగోళం సగం నాదంటున్నవి

వీళ్ళిప్పుడు
చీకటి తోటలో
వెలుగు పూలు ♦




న్యూ ఢిల్లీలోని షాహిన్‌బాగ్‌లో ఎన్ఆర్‌సి, ఎన్‌పిఆర్, సిఎఎలకు వ్యతిరేకంగా నిరసన తెలుపుతున్న మహిళలు

# హస్తినలో విషబీజాలతో నెత్తుటి సేద్యం

- సుబోధ్‌వర్మ

దేశ రాజధాని హస్తినలో కొనసాగుతున్న నెత్తుటి సేద్యానికి బీజం వేసింది బిజెపి నేత, మాజీ ఎమ్మెల్యే కపిల్ మిశ్రా నే. ఆయన గత ఆదివారం తన సహచరులతో కలిసి సిఎఎ వ్యతిరేకులతో ఘర్షణకు దిగటంతో ఈ హింసాకాండకు తెర లేచింది. పరిస్థితిని కట్టడి చేసే పేరుతో కేంద్ర హోం మంత్రి అమిత్‌షా తన ఆధీనం లోని ఢిల్లీ పోలీసు అధికారులతో వరుస భేటీలు నిర్వహించారు. ఈ హింసాకాండలో యాసిడ్ సీసాలు, పెట్రోలు బాంబులు చేత పట్టుకున్న సాయుధ ముఠాలు నగరం లోని ఇరుకు సందులను సైతం వదిలి పెట్టకుండా చెక్కర్లు కొడుతూ కన్పించిన దానినల్లా బుగ్గిపాలు చేశారు. ఈ క్రమంలోనే సోమవారం నాడు గ్రమీ ప్రాంతం లోని సూఫీ ప్రార్థనా మందిరం కూడా బూడిద కుప్పగా మారింది. మంగళవారం నాడు అశోక్ నగర్ లోని మసీదుపై ఈ సాయుధ ముఠాలు దాడి చేశాయి. ఈ హింసాకాండను అనేక మంది ప్రజలు తమ మొబైల్ ఫోన్లలో రికార్డు చేసుకున్నారు. సాయుధ ముఠాలు హస్తిన నడివీధుల్లో సంచరిస్తూ 'జై శ్రీరామ్' నినాదాలతో కన్పించిన షాపులన్నింటినీ ధ్వంసం చేసి తగులబెట్టాయి. ఇంత జరుగుతున్నా పోలీసులు మౌన ప్రేక్షక పాత్ర పోషించారు తప్ప వారి నుండి కనీస స్పందన కూడా కరువైంది. మంగళవారం నాడు ఈ సాయుధ ముఠాలు మరింత రెచ్చిపోయి పలువురు జర్నలిస్టులపై దాడి చేసి ఈ వీడియోలను తొలగించాలంటూ వారిపై తీవ్ర ఒత్తిడి తెచ్చారు. సిఎఎ వ్యతిరేక ప్రదర్శకులు (ప్రధానంగా ముస్లిం వర్గానికి చెందినప్పటికీ అనేక మంది హిందు వర్గం వారు కూడా సమర్ధిస్తున్నారు) వారిపై రాళ్ళు, గాజు సీసాలతో తిరగబడ్డారు. అయితే ఇటువంటి పరిస్థితుల్లో సాధారణంగా జరిగే తీరు లోనే పోలీసుల వివక్ష బట్టబయలైంది. సాయుధ ముఠాలను కట్టడి చేసేందుకు తమ వద్ద తగిన బలగాలు లేవని ఢిల్లీ పోలీసు కమిషనర్ చేతులెత్తేసినట్లు తెలుస్తోంది. దీనితో సాయుధ ముఠాలు మరింత రెచ్చిపోయాయి. బిజెపి, దాని మిత్రపక్షాలు ఈ సాయుధ ముఠాలతో కలిసి వ్యవహరించిన తీరు, ఢిల్లీ పోలీసుల నిర్లిప్తత వంటి అంశాలను యాదృచ్ఛికంగా భావించటానికి వీలు లేదు. అదే విధంగా ఈ సాయుధ ముఠాలను తన విద్వేష ప్రసంగాలతో రెచ్చగొట్టిన మాజీ ఎమ్మెల్యే మిశ్రా అదృశ్యాన్ని కూడా యాదృచ్ఛికంగా భావించటానికి వీలు లేదు. అయితే

ఇందుకు కావాల్సిన పునాది ఆదివారానికి ముందే పడింది. ఇప్పుడు దీనినే ఢిల్లీ, దేశం లోని ఇతర ప్రాంతాల ప్రజలు నిశితంగా పరిశీలించాల్సిన అవసరం వుంది.

**మైనార్టీల కట్టడి**

గత మే జూన్‌లలో జరిగిన సాధారణ ఎన్నికల్లో విజయం సాధించి తిరిగి అధికార పగ్గాలు చేపట్టిన వెంటనే బిజెపి ప్రభుత్వం ముస్లింలను శత్రువులుగా భావించే ఆరెస్సెస్ ఎజెండా అమలుకు సిద్ధపడింది. ఈ వర్గాన్ని అప్రతిష్టపాలు చేసేందుకు అనేక చర్యలు చేపట్టింది. దేశంలో ఏకైక ముస్లిం మెజార్టీ రాష్ట్రం జమ్మూ కాశ్మీర్‌లో రాజ్యాంగం 370వ అధికరణాన్ని రద్దు చేసి దానిని రెండు ముక్కలు చేయటం, 'విదేశీయుల'ను దేశం నుండి వెళ్లగొడతామంటూ బాహాటంగానే తొడలు చరుచుకోవటం, జాతీయ పౌరసత్వ రిజిస్టర్ (ఎన్ఆర్‌సి) రూపకల్పన, అయోధ్య వివాదాన్ని హిందువులకు అనుకూలంగా పరిష్కరించటం, వివక్షాపూరితమైన పౌరసత్వ చట్టాన్ని అమలు చేయటం వంటి విషబీజాలతో నెత్తుటి సేద్యానికి తెర తీసింది. ఈ చర్యలన్నింటికీ ఎన్నికలు, మతపరమైన పండుగలు, దూకుడుగా తెర పైకి తెస్తున్న హిందూ జాతీయవాదం, మీడియా నెట్‌వర్క్‌ల మద్దతు పుష్కలంగా లభించింది. ఈ ప్రక్రియ ముందు నుండే కొనసాగుతున్నప్పటికీ బిజెపి ఎన్నికల విజయం తరువాత ఊపందుకుంది. ఈ విజయంతో వారు బహుశా హిందూ రాష్ట్ర స్థాపన కల సాకారమవుతుందని భావించారేమో...? ఈ విద్వేష విస్తృతిలో బిజెపి నేతలు తమ వంతు పాత్ర విజయవంతంగా పోషిస్తున్నారన్న అంశం గమనార్హం. ప్రధాని నరేంద్ర మోడీ, హోం మంత్రి అమిత్ షా, యు.పి ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ వంటి అగ్రశ్రేణి నేతలతో పాటు వివిధ రాష్ట్రాల్లో ఎన్నికైన బిజెపి ప్రజా ప్రతినిధులు, దిగువ స్థాయి నేతలు కూడా ఈ 'విదేశీయులు', 'అక్రమ చొరబాటుదారుల'పై విద్వేష జ్వాలలు రెచ్చగొడుతూనే పొరుగునే వున్న ముస్లిం మెజార్టీ దేశాలలోని హిందూ మైనార్టీల పరిస్థితిపై మొసలి కన్నీరు కారుస్తున్నారు.

**ఢిల్లీ ఎన్నికల్లో విష ప్రచారం**

ముఖ్యంగా ఇటీవల జరిగిన ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపి నేతలు గతంలో ఎన్నడూ లేని రీతిలో అసత్యాలు, అర్థసత్యాలతో విషప్రచారం చేశారు. 'వారు' (ముస్లింలు) దేశద్రోహులని, బిజెపికి మెజార్టీ ఇవ్వకపోతే వారి ఇళ్లలోకి చొరబడి వారి కుమార్తెలను రేప్ చేసి చంపేస్తామని, దేశద్రోహులను కాల్చి చంపాలని ఉన్మాదంతో ప్రకటనలు చేశారు. నానాటికీ పెరుగుతున్న 'మొఘల్ (ముస్లిం) రాజ్యం' పై ప్రజలు అప్రమత్తంగా వుండాలంటూ బిజెపి ఎంపీలు ప్రజలకు హెచ్చరికలు జారీ చేశారు. ఈ ఉన్మాద విన్యాసాలు కేవలం బహిరంగ సభలకు మాత్రమే కాక మీడియాలో సైతం వీరవిహారం చేశాయి. ఢిల్లీ ప్రజలు ఈ విన్యాసాలతో విస్తుపోయినప్పటికీ, వెంటనే ఎన్నికలు ముంచుకు రావటంతో ఆమాద్మీ పార్టీకే తమ ఆమోద ముద్ర వేశారు. అయితే బిజెపి నాటిన విషబీజాలు మాత్రం ఒక వర్గం వారి మనసుల్లో బలంగా నాటుకు పోయాయి. ఎన్నికల దుమారంలో బిజెపి మట్టి కరవటంతో ఈ మతోన్మాద ప్రభావం పైకి లేచింది. కేంద్రంలో అధికారంలో వున్న బిజెపి ముస్లింలు, ఇతర మైనార్టీల పట్ల వ్యక్తమయ్యే వ్యతిరేకత పట్ల ఉదాసీనంగా వ్యవహరిస్తే అది దారుణ పరిస్థితులకు దారి తీస్తుంది. మైనార్టీలపై చెలరేగిన హింస పట్ల ముఖ్యంగా సాయుధ మూకల దాడుల పట్ల కఠినంగా వ్యవహరించకపోవటం వల్లే హస్తినలో హింస పేట్రేగిపోతోంది. ముఖాలకు ముసుగులు తగిలించుకున్న సాయుధులు ఇనుప రాడ్లతో యూనివర్శిటీ ఆవరణలో ప్రవేశించి ఉపాధ్యాయులు, విద్యార్థులపై దాడి చేయటం వంటి ఘటనలు జరిగినా ఎటువంటి చర్యలూ వుండవు. పోలీసులు యూనివర్శిటీ లైబ్రరీ లోకి ప్రవేశించి విద్యార్థులను చితకబాదినా ఎవరూ పట్టించుకోరు. పొరుగున యోగి ఆదిత్యనాథ్ పాలనలో వున్న యుపీలో సిఎఎ వ్యతిరేక ఆందోళనలపై పోలీసులు ఉక్కుపాదం మోపుతూ అనేక మందిని అరెస్ట్ చేశారు. పోలీసు కాల్పుల్లో 20 మందికి పైగా ప్రాణాలు కోల్పోయారు. సిఎఎ వ్యతిరేక ఆందోళనల్లో పాల్గొంటున్న కుటుంబాలకు భారీ జరిమానాలు విధించారు.

**ఈ విషబీజాల ఫలితమే ఇప్పటి నెత్తుటేరులు**

ప్రతిపాదిత సిఎఎ, ఎన్ఆర్‌సి లకు వ్యతిరేకంగా కొన సాగుతున్న ఆందోళనలను రాజకీయ శక్తులు ముస్లింలను టార్గెట్ చేసుకోటానికి ఉపయోగించిన ఫలితమే ప్రస్తుతం హస్తినలో కొనసాగుతున్న హింసాకాండ. సిఎఎ– ఎన్ఆర్‌సి– ఎన్‌పిఆర్‌లకు వ్యతిరేకంగా ఆందోళనలు, ధర్నాలు చేస్తున్న వారిలో ఎక్కువ మంది ముస్లిం మహిళలేనన్నది వాస్తవమే

# మట్టి కుండ

- ఆవుల వెంకటేసులు
9441665095



అది మట్టితో చేసిందే కావచ్చు
దానితో బంధం ఈనాటిదా ?
తరాలుగా పొయ్యి మీద కాలి పోతూ
అన్నం మెతుకై అందరి కడుపుల్ని నింపింది

అనుభవాల్ని అనువదించు కున్న
హస్తాలలో
అందమైన ఆకారంగా పురుడుపోసుకొని
కట్టెలకొలిమిలో స్వచ్ఛత పొంది
సంజీవకరణిలా  చిరాయును అందిస్తున్నా
చూపులు కరువైన నేలలో
గుడిసె ముంగిట వెన్ను విరిగిన దేహంలా
కాణి బేరానికి కూడనోచుకోలేక
రెప్పలకింద కరుగుతున్న దృశ్యంలా
మట్టిలోతుల్లోకి శిథిలశిల్పంలా కూరుకపోతోంది

మరిన్ని మాయాకృతులను సృజిస్తున్న మార్కెట్
మట్టికుండ  మనుగడను శాసిస్తే
తన ఉనికిని కాపాడుకొని దారులు మూసుకుపోయి
కాలంకూడలిలో జీవత్సవంలా కూలబడి
అనాథ శవసంస్కారంలో తలకొరివి కుండయి తనువును
చీల్చు కుంటోంది

తిరిగిరాని  వారిని తలచుకుంటూ
జరిపే పిండ ప్రధాన క్రతువులో
దేహాన్ని తాగం చేసిన బలిచక్రవర్తిలా
కాలమానినిపై  త్యాగచిహ్నమై నిలుస్తోంది


పచ్చి పుండుపై ముసురుకున్న ఈగల్లా
ఇంటా బయటా కన్నుగీటి కవ్విస్తున్న
ప్లాస్టిక్ పరికరాలు
జీవన సమతుల్యాన్ని చిదిమి వేస్తూ
సర్వ జీవుల ఆయువును  హరిస్తుంటే
అమృత బాండంలా  ఆయుస్సును పెంచుతూ
మానవాళికి మహోపకారం చేస్తున్న
మట్టి కుండ ఉసురు తీస్తున్న అనైతిక  వ్యాపారాత్మక
వైజ్ఞానిక అజ్ఞానం
ఇపుడు ప్రతి ఇంటి ముంగిట ఒక  వల్లకాడును
ఆవిష్కరిస్తోంది

♦

అయినప్పటికీ, సిఎఎ వ్యతిరేక ఆందోళనలు ముస్లింల వల్లే జరుగుతున్నాయంటూ ఢిల్లీ ఎన్నికల్లో బిజెపి చేసిన విష ప్రచారం ఇప్పుడు ఈ హింసాకాండకు ఆయుధంగా మారింది. ఎన్నికలు ముగిసి బిజెపి ఓటమిపాలు కావటంతో ఇప్పుడు మూకదాడులకు ఇతర మతోన్మాద చర్యలకు తెరలేచింది. రెండు రోజులు దేశంలో పర్యటించిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్ స్వదేశానికి బయల్దేరిన తరువాత మోడీ సర్కారుకు ఈ పరిస్థితులపై దృష్టి సారించే తీరిక దొరికింది. మోడీ సర్కారు గత రికార్డులను పరిశీలిస్తే ప్రభుత్వం సిఎఎ వ్యతిరేకులను అణచి వేసేందుకు చేసిన ప్రయత్నాలే మనకు కన్పిస్తాయి. దీనితో ఈ సమస్యకు కనుచూపు మేరలో పరిష్కారం కన్పించటం లేదనే చెప్పాల్సి వుంటుంది. ఇప్పుడు ప్రజల ముందున్న మార్గం ఒక్కటే...అందరూ ఐక్యంగా రాజ్యాంగానికి బద్ధులై అసమ్మతి హక్కును, చట్టం ముందు అందరూ సమానులేనన్న సూత్రాన్ని, లౌకిక విధానాన్ని గౌరవించాల్సి వుంది. లేకుంటే దేశ రాజధాని మరింత విధ్వంసానికి గురవటమే కాక హింసాకాండ అనేక మంది ప్రాణాలను బలి తీసుకునే ప్రమాదం లేకపోలేదు.

(ప్రజాశక్తి దినపత్రిక, **27.02.2020** సౌజన్యంతో) ♦

# ఒక బుద్ధిజీవి అంతరంగాలాపన




- మందరపు హైమవతి
9441062732

'దుర్గాపురం రోడ్డు' ఒక విభిన్నమైన ఒక వినూతనమైన శీర్షిక. పాఠకుడ్ని వెంటనే తనలోకి ప్రయాణించేలా చేస్తుంది. తనలోకి ప్రవహింపచేసుకుంటుంది. ఒళ్ళంతా వేయిగాయాలైన వెదురే వేణువై మధురగానం ఆలపిస్తుంది. అసహ్యకరమైన గొంగళిపురుగే తన శరీరాన్ని ఛేధించుకొని సీతాకోకచిలుకై రంగుల రెక్కల గానం వినిపిస్తుంది. గుండెలోతుల్లో గుచ్చుకొన్న గాయాలనుండే కవి తన అక్షర ఢమరుకాలను మోగిస్తాడు. అలాంటి కవిత్వమే అసలైన కవిత్వం.

ఏది కవిత్వం అనేదాన్ని గురించి అనేక నిర్వచనాలు ఉన్నాయి. ప్రాచీన కాలం నుంచి ఆధునిక కాలం వరకు ఎన్ని నిర్వచనాలు ఉన్నా అసలైన కవిత్వమేమిటో మన మనసుకు తెలిసిపోతుంది. మంచి కవిత్వం మనను వెంటాడుతుంది. కలలో, మెలకువలో, పనిచేసికొంటున్నపుడు, విశ్రాంతిగా ఒకచోట కూర్చున్నపుడు ఆ కవితా వాక్యాలు మన మనస్సరోవరంలోని ఆలోచనల అలలను కదిలిస్తాయి. ఏదో చెప్పలేని అస్థిమితాన్ని కలగచేస్తాయి. అలా కలవరపరిచే కవితే దేశరాజు రచించిన 'దుర్గాపురం రోడ్' లోని కవితలు.

'ఒకే ఒక్క సామూహిక స్వప్నావిష్కరణ' కవితా సంపుటంతో తెలుగు కవిత్వరంగంలో ప్రవేశించిన వీరు రెండు దశాబ్దాల తర్వాత తెచ్చిన కవితా సంపుటి 'దుర్గాపురం రోడ్'.

ప్రజాస్వామ్యం ముసుగులో నియంతృత్వం రాజ్యం చేస్తున్నపుడు రాజకీయ బకాసురులు దొంగజపం చేస్తూ కాషాయం నీతులు వల్లిస్తున్నపుడు, మానవత్వం చిరునామా కోల్పోతున్నపుడు కవి ఊరుకోడు. కలలు పేలికలై నేలరాలుతున్నపుడు, స్వాతంత్ర్యం వచ్చి ఎన్నేళ్ళైనా ధనికులకు దరిద్రులకు అంతరాలు అంతరించనపుడు ప్రజలను కంటిరెప్పలుగా కాపాడవలసిన పాలకులే వారి ప్రాథమిక హక్కుల్ని హరిస్తున్నపుడు కవిత్వం జమ్మిచెట్టులో దాచిన అక్షరాయుధాలను పైకి తీస్తాడు కవి. అరివీరుల గుండెలపై తుపాకీ మొనలు గురిపెడతాడు. మారని సమాజాన్ని ప్రశ్నిస్తాడు. ఆక్రోశిస్తాడు. ఆగ్రహిస్తాడు. పాలకుల పట్ల ప్రతిఘటనా స్వరమౌతాడు.

'రాజ్యమా... ఉలికిపడు'లో రాజ్యం క్రూరస్వభావాన్ని ఎండగడతారు ***'ఛీ... స్వప్నఫలాన్ని మరీ, మర్మాంగం/స్థాయికి దిగజార్చేస్తావనుకోలేదు../ కలలు కనమనే చెప్పాం/ కానీ ఎలాంటి కలలో నువ్వు నిర్దేశించావ్'*** అంటారు. మనది ప్రజాస్వామ్య ప్రభుత్వము. ప్రజలకోసం, ప్రజలచేత, ప్రజల కొరకు ఏర్పడినదే. కానీ నిజం చెప్పాలంటే ప్రజాస్వామ్యం ముసుగులో నియంతృత్వ ప్రభుత్వం. ***'అంతిమంగా నువ్వు మేక్ ఇన్ ఇండియా కలలు కనమన్నావ్/ వాళ్ళు మూలవాసీ కలలు కన్నారు/ సంపదను సృష్టించే కలలు కనమని నువ్వన్నావ్/సంపద సృష్టికర్తలకే దక్కాలని వారు కల కన్నారు/ చివరాఖరికి ఈ రాజ్యం నీదనుకున్నావ్/ వాళ్ళు మనందరిదీ అనుకున్నారు'*** అని రాజ్యం ప్రజలను ఎలా అణగతొక్కుతుందో వాళ్ళ హక్కుల్ని ఎలా కాలరాస్తుందో సూటిగా, నిర్భయంగా విప్పి చెప్పారు ఈ కవితలో. రాజ్యానికి ఎంత అధికారమున్నా ప్రజలు ధిక్కరిస్తారని "మర్మాంగాలు జననాంగాలు కూడానని ఓ హెచ్చరిక చేయండి" అని హెచ్చరిస్తున్నారు.

''కొత్త సాహసం' కూడా ఇలాటి కవితే. 'మన నిస్సహాయతే ఆసరాగా వాడు తెగించి బరిలో దూకాడు/ సర్వరోగ నివారిణిలా దేశభక్తిని ప్రమోట్ చేసాడు' అంటూ మన సామూహిక స్వప్నంపై సింధూరం పూసినప్పుడే/ అది ప్రాతఃకాలం కాదు. సాయంకాలం అని గుర్తించాల్సింది/ మధ్యాహ్న మార్తండునిలా మనం నిప్పులు చెరిగి ఉండాల్సింది/ కప్పిపుచ్చుకున్న తప్పులన్నిటికీ/ కొత్తగా ఖరీదు కట్టే సాహసం చేద్దాం' అని కాషాయ ప్రభుత్వంపై యుద్ధం ప్రకటించు, ఎదురు తిరగమంటారు.

కవి జీవికకోసం నగరానికి వచ్చినా తన మూలాల్ని మరచిపోలేదు. అక్కడ ఏ అరాచకం జరిగినా ఇక్కడ స్పందించడం మరవలేదు. ఉత్తరాంధ్రలో బాక్సైట్ కోసం ప్రభుత్వం కొండల్ని తవ్వుతున్నపుడు, అన్యాయాన్ని సహించలేదు కవి. పిడికిళ్ళు ఎత్తి ***'జీళ్ళు ముఖాన కొట్టి పప్పు ఎత్తికెళ్తనరట/ మట్టి పిసుక్కునే బతుకులపై అణధూళి గుమ్మరిస్తరట/ ఉత్తరాంధ్రలో మళ్ళీ అగ్గి రాజుకుంటోందట/ వస్తరా, నివురు ఊదడానికానికైనా నోళ్ళు తెరుద్దాం'*** అని 'యుద్ధం పుట్టెనంట...' లో కవి ఆక్రోశిస్తారు.

ఉన్న ఊరును, కన్నతల్లిని వదిలి వేరే ఊరికి వెళ్ళడం ఎవరికైనా ఎంత నరకమో, తీరని దుఃఖమో అది అనుభవించిన వాళ్ళకు తెలుస్తుంది. అన్నం పెట్టని ఊరినుంచి, అవకాశాలు దొరకని ఊరి నుంచి తప్పనిసరి పరిస్థితుల్లో నగరాలకు తరలి వస్తారు. విశాలమైన రహదారులు, పార్కులు, విద్యుద్దీపాలు వీటన్నిటితో నగరం ఎంత సుందరంగా వున్నా పల్లెల నుంచి వచ్చిన వారికి నగరం సొంత ఇల్లు అవదు. నగరం వారికి విడిదిలాంటిదేనన్న నగర హృదయపు ఔదార్యం ఎంత గొప్పదైనా అనుబంధం ఎంతగా పెనవేసుకున్నా అతనికి ఎప్పుడూ విడిది సొంతం కాదు' అని నగ్నసత్యాన్ని 'విడిది' కవితలో చెప్తారు.

శాస్త్రసాంకేతిక రంగాల్లో మనదేశం ఎంత పురోగమించినా ఇప్పటికీ కులమత భేదాలు పోలేదు. ఒకనాటి అంటరాని తనం అంతరించినా అగ్రకులాల ఆధిపత్యం పోలేదు. ఇటీవల వరకు కొన్ని గ్రామాల్లో రెండు గ్లాసుల సిద్ధాంతం ఉందంటే నమ్మశక్యం కాదు మనకు. మనది లౌకిక ప్రభుత్వమని గొప్పలు చెప్పుకుంటారు. కానీ బాబ్రీ మసీదు విధ్వంసం జరిగింది. గోద్రాల అమానుష ఘటనల గురించి 'పరమతాన్ని సహించక పోవడమే లౌకికవాదమని/ నెత్తురంటిన చేతులను కాపాడుకోవడమే అభివృద్ధని/ గోద్రా గొంతు విప్పి నిలదీసింది కానీ ఎందుకో ఓటర్లెవ్వరికీ వినబడలేదు' అని ప్రభుత్వ మతతత్వాన్ని నిరసిస్తారు.

తెల్లదొరలైనా నల్లదొరలైనా మనని విభజించి పాలించారు, పాలిస్తున్నారు. 'మూగపాట'లో 'ముందు మనం మనుషులుగా విడిపోయాం...తర్వాత మనం స్త్రీ పురుషులుగా విడిపోయాం/ తర్వాత మనం మతాలుగా విడిపోయాం/ చివరాఖరికి మనం విడివిడిగా మిగిలాం/ అంధత్వపు గంతల చిక్కుముళ్ళకి/ అది ముక్తకంఠపు చరమగీతమయ్యింది' అని అందరూ ఎవరికి వారు విడిపోయాక రాజ్యాన్ని ఏమీ చేయలేము అని రాజ్య స్వభావాన్ని చిత్రీకరిస్తారు.

ఈ కవితా సంపుటిలో సామాజిక కవితలే కాకుండా ప్రకృతి గురించి, ప్రేమ గురించి, పిల్లల గురించి మానవ భావోద్వేగాల గురించి రాగరంజితమైన కవితలున్నాయి. 'నేరస్తుని ఆత్మగతం'లో 'ఆమెను చూసిన క్షణం అనుకోలేదు/ ఎప్పుడో ఆమె ధనవంతురాలవుతుందని/ కానీ, ఆమెను కోరుకున్న మరుక్షణమే/ నేను పేదవాడినైపోయా/ పేదవాడెప్పుడూ, నేరస్తుడే కదా' అని ప్రేమ కూడా డబ్బునే ప్రేమిస్తుందని చెప్తారు. 'పచ్చివాసన' లో చిన్నప్పటి ప్రేమ గురించి 'జాడ తెలియని ఆనాటి మేఘమాలే/ జాలిగా మళ్ళీ మళ్ళీ వర్షిస్తూనే వుంది, నా కోసం/ నా మనసున మల్లెల మాలల్నూపుతూ/ మృత్యుప్రేమ శైథిల్యం నుంచి నన్ను మేల్కొలుపుతూ/ అప్పుడు మాత్రం/ చీకటిప్రేమ వాసనతో గుప్పుమంటుంది' అని అచ్చమైన ప్రేమ పరిమళాన్ని తలపోస్తారు.

పిల్లలన్నా, పూలన్నా అందరూ ఇష్టపడతారు. కవులకు వీళ్ళంటే మరీ మరీ ఇష్టం. 'పిల్లలు అప్పటిదాకా ఆడి ఆడి ఆ బొమ్మల్నే పక్కలో పడుకో పెట్టుకుని నిద్రపోతారు. అప్పటిదాకా గాలిపటంతో ఆడుకొన్న పాపాయి దాన్నే పక్కలో పెట్టుకొని పడుకొంటుంది. దాని గురించే కలగంటుంది. ***'ఊర్లు తిరిగి వచ్చేసరికి/ గాలిపటాన్ని హత్తుకుని పడుకునుంది పాపాయి/ దాని రెప్పల వెనుక కనుపాపల కదలికల్లో/ దూసుకుపోతున్న గాలిపటం/ పెదవులపై నగవుల్లో రెపరెపలాడుతోంది'*** అని గాలిపటం ఎగురుతున్న దృశ్యాన్ని చూస్తున్న పాపాయిని 'పతంగం' కవితలో మనకళ్ళ ముందు ఆవిష్కరిస్తారు.

పిల్లలు అమాయకత్వానికి చిరునామాలు. కల్లాకపటం తెలీని మల్లెలు. అలాంటి పిల్లల్ని మనమే వాళ్ళతో

## నానీలు



- కె.ఎ.ఎల్. సత్యవతి
9440210103

*కటకటాలకు*
*ఆ యిద్దరూ చెరోవైపు*
*ఒకరిది స్వయంకృతం!*
*మరొకరిది కర్తవ్యం!*

*నిజం! ఆమెకు*
*అతడేమీ కాదు!*
*కల! అతడికి మాత్రం*
*అన్నీ ఆమే!*

*కాడెద్దులు*
*నేలకొరిగాయి!*
*రైతన్న బతుకుబండి*
*చతికిలపడింది!*

*మాస్టారి చేతిలో*
*సుద్దముక్క విరిగింది!*
*ఏ శిష్యుడి కాలో*
*తప్పటడుగు వేసింది!*

*కుక్కి మంచంలో*
*మట్టిముద్దలా*
*వృద్ధాప్యం!*
*నవ్వులొలుకుతోంది*
*ఊయలలో బాల్యం!*

*అతడి మనసుతో*
*రాయని ప్రేమలేఖ!*
*ఆమె అందించింది*
*తన పెళ్ళి శుభలేఖ!* ♦

ఆడుకోవద్దని, వీళ్ళతో మాట్లాడవద్దని అడ్డుగోడలు కడతాం. వాళ్ళని మనలాగా తయారుచేస్తాం. 'వికృతి'లో ఈ భావానికి అద్దం పడతారు. 'పసిపాప నవ్వింది/ పుప్పొడి రాలింది/ పిల్లలే ప్రకృతి, ప్రకృతే పిల్లలు/ మనమే/ చేజేతులా వారిని మనుషుల్ని చేస్తాం' అంటారు.

'దుర్గాపురం రోడ్' పల్లెనుంచి నగరానికి వలసవచ్చిన ఒక ఆధునిక మానవుని జీవన ప్రయాణం. తాను నివసిస్తున్న దేశంలోని సమస్యలకు ప్రతిస్పందిస్తూ అనుక్షణమూ జీవన పోరాటం చేస్తున్న ఒక బుద్ధిజీవి అంతరంగాలాపన. కవిత్వాన్నే ప్రేమిస్తూ, తపిస్తూ, సమాజ రుగ్మతలకు ఒక ఆయుధంగా తన భావోద్వేగాల ప్రకటనకు ఒక ఆలంబనగా అక్షరాలను మలచుకొన్న కవి దేశరాజు.

ఈ సంపుటిలో కవితలన్నీ చదివింపచేస్తాయి. రాజ్యహింసను ప్రతిఘటించే కవితలు నిప్పురవ్వలను వెదజల్లితే, మానవ జీవనానుభవాలను చిత్రించిన కవితలు హృదయానికి నెమలీకలు హత్తుకొన్నంత మెత్తగా ఉంటాయి.

యానం ప్రేయసి, ఆరెంజ్ రాగా, దుర్గాపురం రోడ్, మనదైనది మొదలైన ప్రేమ కవితలు ప్రేమ ఉయ్యాలలు ఊగిస్తాయి. 'ఉనికి', 'ఇజీనారం ఓ ససందర్భ ప్రేలాపన' కవితలు, ఉపాధికోసం నగరంలో నివసిస్తున్నా పుట్టిన ఊరు గురించి కలవరింతలు. తప్పిపోయిన పిల్లాడు తల్లిని వెదుక్కొనే కన్నీటి పాటలు. దుఃఖవాక్యం, సామూహిక విదూషకత్వం, నీడ, ఆఖరి సన్నివేశం ఆదివాసీ కవితలు మరీ మరీ చదవదగినవి.

దేశరాజు కవితా నిర్మాణం తెలిసిన కవి. రాజ్యహింసను ధిక్కరించేటప్పుడు నిర్భయంగా సూటిగా ఎక్కుపెట్టిన బాణాలు వీరి పద్యాలు. అనుభూతుల్ని, భావోద్వేగాలను వర్ణించేటప్పుడు మల్లెపూల మాలలాటి సుతిమెత్తని శైలి. కవిత్వ ప్రారంభం, ముగింపు అలవోకగా సాగిపోతాయి మైదానంలో ప్రవహించేనదిలా.

చురుక్కుమనిపించే కొంచెం వ్యంగ్యం, కొరడాల్లా ఝళిపించే వాక్యాలు, కొంచెం తాత్వికత, మరికొంత మర్మజ్ఞత ఈ సంపుటిలోని కవితల ప్రత్యేకతలు.

నీలోంచి నీవు బయటకు రాలేనప్పుడు/ ఎక్కడెక్కడికో వెళ్ళి ఏం ప్రయోజనం? నిజమే, కానీ/ నాలోని నన్నే అక్కడక్కడా వెతుక్కుంటూంటాను' అన్నట్లుగా నిరంతరం తనను అన్వేషిస్తూ సాగిన ప్రయాణమే ఈ సంపుటి. ఇక సంపుటి శీర్షిక 'దుర్గాపురం రోడ్' చిన్నప్పుడు కవి ప్రేమించిన అమ్మాయి దుర్గాపురం స్టేషన్‌లో కనిపిస్తుందా లేదా అనేదే ఇతివృత్తం. 'రోడ్డు పక్కనే వెలుగుతాయా దీపాలు? చెక్కిళ్ళపై కూడా/ ఏం/ శరీరానికేనా, మనసుకొద్దా వెలుతురు' ఈ కవిత అంతా ఒక పాటలాగా సాగుతుంది.

'ఎన్‌కౌంటర్ రుతువు', 'కనుపాల కోయిలలు', 'గాలి పెదవులు', 'మోహపు ఊలుదారాలు', 'అలల బుగ్గలు', 'చీకటి చువ్వలు' మొదలైన పదచిత్రాలు పారవశ్యపు ఊయల్లో ఊగిస్తాయి. 'అక్షరాల మధ్య ఎడం పెరిగిపోయింది, వాక్యాల మధ్య వ్యాకరణం మారిపోయింది/ ఖాళీలను రూపాయిలతో పూరించుకొనే కార్యశూరులు మీరు', 'హృదయం తప్ప దేహం లేని వాళ్ళం' మొదలైన వాక్యాలు మనసు మీద ముద్రవేస్తాయి.

అనుభవాలు, అనుభూతులు అందరికీ వుంటాయి. చేయితిరిగిన కవే వాటిలోని కవిత్వాన్ని చేయగలడు. అలాటి కవిత్వమర్మం తెలిసిన ఈ కవి తన కవిత్వ ప్రయాణాన్ని ఆపగూడదని, నిరంతరం ఆగక సాగుతుండాలని ఆకాంక్షిస్తున్నాను. ♦

## ఆ రాత్రి కళ్ళు సైతం

- కొండా శిరీష,
6300396530

సూర్యునికి దుప్పటి కప్పి చంద్రుడు ఉదయిస్తున్నాడు
రాత్రి కళ్ళకు వెన్నెల దారుల్ని పరుస్తూ....



నమ్మిన వారికి రక్షణ కవచమై
కళ్ళల్లో ఒత్తులు వెలిగించుకుని
మెలకువని మోస్తూ,
ఆ వెన్నెల వాకిట్లో
కూర్చున్నాడతను

పగలంతా కర్షక సూరుడై శ్రమిస్తాడు
తనకు అపురూపమైన రెండు దీపాల్ని వెలిగించడానికి

రేయంతా నిద్రని భుజానికెత్తుకొని
పచ్చని సమాజాన్ని మేస్తూ
రాత్రిళ్ళు పాకులాడుతోన్న విషపురుగులకు కాపలాగా
మారుతాడు,
ఆ దీపాలు అఖండజ్యోతిగా వెలగాలని,

దోమ కాట్లను భరిస్తూ
బాధల్ని పంటి బిగువున పాతిపెట్టి
చలి షామియానా కింద వణుకుతూ నిలుచున్న
ఆ కృషీవలుడి సహనానికి ఆ రాత్రి కళ్ళు సైతం
చెమ్మగిల్లుతున్నాయి

కష్టాలు కడతేరకున్నా
కన్నీరు కరిగిపోకున్నా
కష్టాన్నే నమ్ముకుని
బతుకు బండికి ఆశల చక్రాలు కట్టుకుని
పయనిస్తుంటాడు

ఎన్నో త్యాగాలకు ప్రతిరూపమై నిలిచి
క్షణం క్షణం కరిగిపోతున్నా
కొండంత కృషికి ఆవిరవుతున్నా
తాను మాత్రం మా పెదాలపై చిరునవ్వై మురిసిపోతాడు ♦

---

## మది సంఘర్షణ

- స్వప్న మేకల
9052221870

మువ్వలు లేని నిశబ్దపు సవ్వడులు
కాళ్ళకి తగిలి కదలనీయకుండా అడ్డుకుంటున్నాయి ..!!
అలల తాకిడికి కలలు కరిగిపోతూ
ఆశల మూట నుండి జారిపోతున్నాయి ..!!
వేదనపు ఆనవాళ్ళు ఇసుక తీరాల్లో చేరి
మనసుకు తీరని గాయాన్ని రేపి కడలి అంచున
మౌనంగా ఆవేదన అలజడులని రేపుతున్నాయి..!!
తీరం చేరిన ప్రయాణంలో
అవాంతరాల కెరటాలు
ముందుకి వెనక్కి వచ్చి పోతూ
అలల్లా సాగిపోతూ
అడుగులకే ముడి వేసి
అల్లుకుపోతున్నాయి ..!!



మూగబోయిన హృదయంలో
సంఘర్షణ ఎన్నటిదో ఏమో..!!

కడలిలో కలవకముందే ..
కన్నీళ్ళతో తడవకముందే
అడుగులని గమ్యపు దిశగా పయనించి
మది గాయానికి సడి పూత పూసి
అల్లర్లు సంద్రపు సంభాషణ తో కలిసి
కొత్త రాగాలు పలుకుతాయేమని
అలలతో సాగే కలల ఎదురుచూపే మరి.. ఇంతలా..!! ♦



# పెద్దమ్మ పెరుగు

- ఆర్ సి కృష్ణ స్వామి రాజు
9393662821

ఒక రెండవ శనివారం సాయంత్రం –

పది చదివే శీనడు ఊర్లోని రచ్చ బండ కాడి నేరేడు చెట్టు కింద కొన్ని గులకరాళ్లు చేతిలో పెట్టుకొని నిలబడివున్నాడు. అప్పుడప్పుడు చెట్టు మీద రాళ్ళేసి కిందపడిన నేరేడు పండ్లు ఏరుతున్నాడు. నేరేడు చెట్టు కింద పడుకొని వున్న రెండు ఊరి కుక్కలు రాళ్ళ దెబ్బలు ఎక్కడ తినాల్సి వస్తుందోనని తోకలాడిస్తూ దూరంగా వున్న మర్రి చెట్టు కింది కెళ్ళాయి.

పడుకోవడానికి నేల అనువుగా వుందో లేదోనని మట్టిని వాసన చూశాయి. తరువాత కాళ్లతో మట్టిని తోసి చిన్న గుంతలాగా చేశాయి. అందులో నడుము పెట్టి తల, కాళ్ళు బయటకు పెట్టాయి. సోఫాలో పడుకొని టీవీ చూస్తున్నట్లుగా శీనడి వైపే చూస్తున్నాయి.

దోవన పోతున్న పది ఫెయిలైన సుందరం 'నేల మీద పడిన నేరేడు పండ్లల్లో మట్టి, ఇసుక లేని పండ్లు కొన్ని ఇవ్వు' అని శీనడిని అడిగినాడు. 'సొమ్ము ఒకడిది, షోకు ఒకడిది లాగుంది వ్యవహారం. కష్టపడి చెట్టు మీద రాళ్ళేసి, రాలిన పండ్లను ఏరుకొంటూ వుంటే వీడి గోల ఒకటి' అనుకొని విననట్లు వుండిపోయినాడు శీనడు. ఒక్క నేరేడు పండు కూడా శీనడు ఇవ్వడని తెలుసుకున్న సుందరం 'ప్రతి కుక్కకీ ఏదో ఒక రోజు అవకాశం వస్తుంది' అంటూ అక్కడినుంచి చరచరా వెళ్ళిపోయినాడు.

♦♦♦

నేరేడు పండ్లు ఏరుకొని కుప్పగా చేసి రచ్చబండ కాడ కూర్చొని కూని రాగాలు తీస్తూ తింటున్నాడు శీనడు.

ఎదురింట్లో చేస్తున్న చింత పండు రసం ఘుమ ఘుమలు శీనడిని మత్తెక్కించాయి. కట్టెల పొయ్యి పైన రసం లో ఉ డుకుతున్న కొత్తిమీర కరివేపాకు ఇంగువ వాసనలు శీనడి ముక్కుకు జ్యాం జ్యాం మని తగిలాయి.

'మామూలుగా అమ్మని రసం చేయమంటే చేయదు కదా, ఎప్పుడూ రాగి సంగటి, అందులోకి పప్పు–మునగాకు, మునగాకు పచ్చడి, మునగాకు పొడి లేదా మునక్కాయల పులుసో, మునక్కాయల తాళింపో … రోజు మార్చి రోజు అవే చేస్తుంది కానీ, కమ్మటి వేడి వేడి రసమన్నం తిని ఎన్ని రోజులయ్యిందబ్బా' అనుకున్నాడు.

అప్పుడే ఆకాశంలో మెరుపు మెరిసింది. శీనడి మనసులో కూడా మెరుపు లాంటి ఆలోచన వచ్చింది. 'జ్వరం వస్తే అమ్మ వేడివేడి చింతపండు రసమన్నం చేయడం మామూలే కదా, జిలకర, మిరియాలు, కొత్తిమీర, కరివేపాకు, ఇంగువ లు వేసి రసం చేసి అందులోకి తెల్ల అన్నం పిసుక్కొని తింటుంటే …. నా స్వామి రంగా … ఆ మజానే వేరు కదా' అని కలలు కంటూ చకచక నడుచుకొంటూ ఇంటికెళ్ళాడు.

"అమ్మా, జ్వరం వచ్చినట్లు వుందే" అంటూ ఇంటి తిన్నె మీద ముడుచుకొని పడుకున్నాడు. 'ఒరేయ్ కొడకా... ఎక్కడెక్కడ తిరిగితివో, ఎవరి పాపిష్టి కండ్లు నీ పైన పడినాయో'అంటూ భుజం తట్టి ఓదార్చి ఇంట్లోకి పోయింది. చలి లేక పోయినా దుప్పటి కప్పుకొని దొంగ దగ్గులు దగ్గుతూ పడుకున్నాడు. అప్పుడప్పుడూ మంచి మంచి వాసనలు ముక్కుకి తగులుతూ వుంటే " నా ప్లాను ఫలించింది కదా, రోజూ సంగటి తినీ తినీ బోరెత్తింది ... అమ్మ చేసే తెల్ల అన్నం, వేడి వేడి రసం కుశాలగా తిని రసం జుర్రుకొని తాగవచ్చు కదా "అనుకొని దుప్పటి ముసుగులోనే ఈస్ట్ మెన్ కలర్ కలలు కన్నాడు.

'అమ్మ సెగలు గక్కే రసం బువ్వ ఇప్పుడు తెస్తుంది, అప్పుడు తెస్తుంది' అని ఆశగా ఎదురు చూశాడు. అర్ధగంటకు చిన్నగా అమ్మ లక్ష్మమ్మ అడుగులు వినబడేసరికి ప్రాణం లేచి వచ్చింది. చిన్నగా దుప్పటి కొంచెం తీసి తొంగి చూశాడు. అమ్మ వచ్చింది కానీ అమ్మ చేతిలో కంచం, రస మన్నం కనిపించలేదు. గుండె గుభేల్ మంది. తేరిపార చూస్తే అమ్మ కుడి చేతిలోస్టీలు గ్లాసు, ఎడమ చేతిలో చిన్న చెంబు వుంది. ప్లాను ఫల్టీ కొట్టిందని తెలిసిపోయింది. అమ్మని ఏమిటది అని అడిగే లోగానే "శీనా, జ్వరం, అజీర్ణం, పడిసెం, ఒళ్ళు నొప్పులు అన్నీ చిటికలో మాయమవుతాయి, ఈ శొంఠి కషాయం తాగినావంటే" అని దగ్గరికి రాబోయింది. గబుక్కున దుప్పటి విసిరేసి ఊర్లోకి పరుగులు తీద్దామనుకున్నాడు.

ఇంతలో ఎక్కడినుంచి వచ్చినాడో సుందరం.... కసికసిగా వున్నాడు. గబగబా వచ్చి ఎగిరి శీనడి మీద పడి వాడి కాళ్ళు చేతులు రెండూ పట్టుకున్నాడు. "పిన్నమ్మా ,నేనూ చాలా రోజులుగా చూస్తా వుండా ... మనిషి ఎండి పోతా వుండాడు.మందో మాకో పెట్టకపోతే వీడు మరింత అన్యాయం అయిపోతాడు. నేను గట్టిగా పట్టుకొంటా. వాడి నోట్లో శొంఠి కషాయం నువ్వు పోసేయ్" అని లక్ష్మమ్మకు చెప్పినాడు. గ్లాసులోడిది, గిన్నెలోడిది అంతా శీనడి నోట్లో పోసినారు.

శొంఠి పని అయిపోయినాక సుందరం ఒక్క నిమిషం అక్కడ నిలబడలేదు. కులకతా ఊర్లోకి పోయినాడు.

'ఎంత పని చేసినాడు సుందరం? నాలుగు నేరేడు పండ్లు ఇవ్వలేదని కసి తీర్చుకున్నాడు కదబ్బా' అనుకున్నాడు శీనడు. ఇంకెప్పుడూ దొంగ జ్వరం వేషాలు వేయ కూడ దనుకొన్నాడు

♦♦♦

తెల్లారింది.

కోళ్లు కూస్తున్నాయి.

లక్ష్మమ్మ తన కొడుకు శీనడిని నీళ్ల తొట్టె పైన కూర్చోబెట్టి వాడి తలకి పచ్చి ఆముదం రాస్తూ చెప్పింది.

"అరే కొడకా.... ఊర్లో అందరూ మీ శీనడికి ఏమయ్యింది? బల్లికగా బలహీనంగా వుంటా ఉండాడు! కోడి గుడ్డు, బర్రె పెరుగు పెట్టరాదా! బలం వస్తుంది " అని చెబుతూ వున్నారు. ప్రతి బుధవారం మన కోడి పెట్టే గుడ్డు ఒకటి ఉడకబెట్టి ఇస్తా. నాటు గుడ్డు కదా, నీ ఒంట్లోకి కొంచెం రక్తం చేరుతాది.

ఇంక... మా అక్క... అదే మీ పెద్దమ్మ పెరుగు భలే వుంటుంది. ఈ నాలుగు పల్లెల్లో మీ పెద్దమ్మ గడ్డ పెరుగు వున్నంత రుచిగా కమ్మగా ఇంకెక్కడా వుండదు.

ప్రతి ఆదివారం పెద్దమ్మ ఇంటికి వెళ్ళు. నేను చెప్పినానని చెప్పు. చిన్న మట్టి కుండలో మంచి గడ్డ పెరుగు ఇస్తుంది. పెరుగు తింటే నీ ఒంట్లో కొంచెం కండ పెడుతుందేమో చూద్దాం "

బుద్ధిమంతుడి లెక్కన అమ్మ మాటలు విన్న శీనడు.... ఆ వారం నుంచీ మైలు దూరంలో ఎగువ ఊరులో వున్న పెద్దమ్మ ఇంటికి చంకలు గుద్దుకొంటూ వెళ్లి పెరుగు తెచ్చుకొనే వాడు. ఒక రోజు గడ్డ పెరుగు రెండురోజులు మజ్జిగ జ్యాం జ్యాం మని తినేవాడు.

గుడ్డు, పెరుగు పెడుతున్నాము కదా, ఒంట్లోకి రక్తం వస్తోందో లేదోనని లక్ష్మమ్మ అప్పుడప్పుడు వాడి కళ్ళ కింది రెప్పలను తెరిచి చూసేది. కొంచెం రక్తం జీరలు కనబడితే పొంగిపోయేది. కొడుక్కి బలం వస్తోందని ముసిముసి నవ్వులు నవ్వుకొనేది.

ఇలా ....పది, ఇంటర్, ఇంజినీరింగ్ చదువులు పూర్తి చేశాడు శీనడు.

♦♦♦

బెంగళూరులో హెబ్బాల్ రోడ్డులో వున్న మానితా టెక్ పార్క్ లో సాఫ్ట్ వేర్ ఉద్యోగం లో చేరి నెల రోజులయ్యింది శీనడు అలియాస్ శ్రీనివాస మూర్తి.

జీతమొచ్చే రోజు.

మొబైల్ లో 'క్లింగ్' మని మెసేజ్ శబ్దం వచ్చింది. ఓపెన్ చేసి చూస్తే తన బ్యాంకు అకౌంట్ లో జీతం క్రెడిట్ అయినట్లు వుంది.

ఆనందానికి అవధులు లేకుండా పోయింది. ఎగిరి డ్యాన్సు చేద్దామనుకున్నాడు. చూసినోళ్లు పిచ్చి పట్టిందనుకొంటారేమోనని ఆ ప్రయత్నం మానుకున్నాడు. అక్కడే నాగవర సిగ్నల్ వద్ద వున్న అడయార్ ఆనంద భవన్ హోటల్ కి వెళ్ళాడు. చక్కటి, చిక్కటి ఫిల్టర్ కాఫీ తాగాడు.

అమ్మకు నచ్చిన జీడిపప్పు స్వీటు, మిక్చర్, పెద్దమ్మకు నచ్చిన గుమ్మడి కాయ హల్వా, కారా బూందీ ప్యాక్ చేయించుకున్నాడు. మైసూర్ సిల్క్ ఎంపోరియం వెళ్ళాడు. అమ్మకొక చీర, పెద్దమ్మకొక చీర కొన్నాడు.

అలాగే తన పాత అరిగిపోయిన చెప్పుల్ని మురికి కాల్వలో పారేశాడు. బాటా చెప్పుల షాపు కెళ్ళి పదిహేనువందలు పెట్టి మంచి చెప్పులు కొనుక్కున్నాడు.

బ్యాగు తగిలించుకొని గబగబా నడుచుకొంటూ బస్ స్టాండ్ చేరి ఊరి బస్సు ఎక్కాడు.

♦♦♦

ఇంటి కెళ్లే ముందు పెద్దమ్మను కలుద్దామని పెద్దమ్మ ఇంటికెళ్ళాడు.

పెద్దమ్మ కానగ చెట్టు కింద తన నల్ల బర్రెను నీళ్ళేసి గడ్డితో కడుగుతోంది.

నవ్వుతూ ఇంటికి వచ్చిన శీనడిని అభిమానంగా పలకరించింది. చేసే పని ఆపేసి ఇంట్లోకి వెళ్లి నల్ల కుండ నీళ్లు అందించింది. శీనడు తను తెచ్చిన చీర, స్వీటు హాటు అందిస్తూ "నీళ్లు మళ్ల తాగతా పెద్దమ్మా, మీ ఇంట్లో పెరుగు తినాలని వుంది" అన్నాడు.

పెద్దమ్మ పెరుగు తెచ్చే లోగా "పెద్దమ్మా! నువ్వు ఇచ్చే బాగా కాచిన పాలతో చేసిన ఎర్ర పెరుగు భలే తియ్యగా ఉంటుంది. నాకు ఎర్ర పెరుగు అంటే ప్రాణమనుకో" అన్నాడు. చిన్న గిన్నెలో గడ్డ పెరుగు తెచ్చింది. గబగబా పెద్దమ్మ చేతిలోని గిన్నెను తీసుకొని పెరుగు కొంచెం నోటిలో పెట్టుకున్నాడు. నాలిక నుంచి గొంతు గుండా కడుపులోకి సర్రున జారిపోయింది. నోరు తుడుచుకొంటూ "పెద్దమ్మా. మీ ఇంట్లో పెరుగు ఇంత బాగుండడానికి కారణమేమి ? మాయ మంత్రాలేమైనా వున్నాయా ! తోడు పెట్టడంలో, పాలు కాగించడంలో తేడా ఏమైనా వుందా ?

మా అమ్మ ఎప్పుడూ చెప్పేది, తింటే మీ ఇంట్లో పెరుగే తినాలని. ఈ నాలుగు ఊర్లల్లో మీ ఇంట్లో వున్నట్లు పెరుగు ఎవ్వరింట్లోనూ వుండదని. అల్లా ఉద్దీన్ అద్భుత దీపం లాంటిదేమైనా ఇంట్లో పెట్టుకొని ఉండావా?" అని నవ్వుతూ అడిగినాడు.

పెద్దమ్మ పైట కొంగు నోటికి అడ్డం పెట్టుకొని పడీ పడీ నవ్వింది.

"శీనా, నీకు తిక్క ఏమైనా పట్టిందా? అటూఇటూ మన నాలుగు ఊర్లల్లో అందరి ఇండ్లల్లోనూ పెరుగు ఇదే మాదిరి వుంటుంది.

మీ అమ్మ పేదరాలు. కరెంటు షాకు కొట్టి మీ నాయన చనిపోయినప్పటినుంచీ కూలికీ నాలికీ పోయి నాలుగు అణాలు సంపాదించి నిన్ను చదివించింది. పాలు పెరుగు కొనే స్థోమత లేదు. పాడి పెంచే వసతి లేదు.

ఇంట్లో మునక్కాయ చెట్టుకు కాచిన మునక్కాయలు, మునగాకు అమ్మి పైపై ఖర్చులకు వాడుకొనేది. నాలుగు కోళ్లు పెంచి నాటుగుడ్లు అమ్ముకొనేది. నీకు బలం రావాలని వారానికొకసారి నీకు గుడ్డు ఉడకబెట్టి ఇచ్చేది.

మీ అమ్మకు అక్కనైన నేను కొంచెం వసతిగా, స్థిమితంగా, వుండానని మా పెరుగు తీసుకొనేది. నువ్వు సరిగా తినక బలహీనవై సరిగా చదవ లేకపోతావేమోనని ఆమె భయపడింది. నా పెరుగు భలే రుచిగా వుంటుందని ఈ మాదిరి పెరుగు ఎక్కడా వుండదని, ఎక్కడా దొరకదని నిన్ను నమ్మించింది. మంచి పెరుగు అని చెబితే నువ్వు ఇష్టంగా తింటావని ఆశ పడింది. మైలు దూరం వారం వారం నడిచి పెరుగు తీసుకెళ్లడానికి విసుగు చెందవని ఆలా చెప్పింది. అంతే తప్పితే మా ఇంట్లో పెరుగులో స్పెషల్ ఏమీ లేదు. మీ అమ్మ ఏమి చేసినా నీ కోసమేరా శీనా .... " అని చెప్పింది.

పెద్దమ్మ చెబుతుంటే శీనడికి దుఃఖం ముంచుకొచ్చింది. తనను తాను సముదాయించుకొని గబగబా లేచి ఊరి వైపు నడిచినాడు.

♦♦♦

అమ్మ తిన్నె పైన కూర్చొని బియ్యంలో రాళ్లు ఏరుతోంది. అమ్మ చుట్టూ కోళ్లు మెడలాడిస్తూ తిరుగుతున్నాయి. ఎప్పుడైనా అమ్మ రాళ్లతో పాటు ఒకటీ రెండూ బియ్యపుగింజలు విసిరితే కోళ్లు పోటీలు పడి బియ్యాన్ని ఏరుకొని తింటున్నాయి

వెనకనే వెళ్లి అమ్మని వాటేసుకుని "అమ్మా అమ్మా నీకెందుకే ఇన్ని కష్టాలు! బెంగళూరు రారాదా, చల్లగా వుంటుంది"అని అన్నాడు

"ఒరేయ్ శీనా , నేను బెంగళూరు వస్తే ఇక్కడి

## కవిత

# మౌన సంభాషణ

- విల్సన్ రావు కొమ్మవరపు
8985435515

*కొన్నిసార్లు అప్రయత్నంగా*
*సరేలే అనుకుంటాం గానీ*
*గుండెలో తడి ఇంకిపోతే*
*కళ్ళు నదులు కాలేవు*

*కోట్లు ఖర్చు పెట్టి*
*ప్రాజెక్టులు కట్టగలవేమో గానీ*
*నా చుట్టూ నిరంతరం తిరిగే*
*నా భూమితల్లి ఆత్మను*
*నా కళ్ళముందు నిలబెట్టగలవా?*

*ఎవరికి వాళ్ళం*
*పరిధులు విధించుకొని*
*మాట్లాడాల్సిన సమయం.*

*హక్కు ఉంది కదాని*
*భూమితల్లి కోసం నోరు తెరిచావో*
*ఆ తరువాత నీ హక్కు గురించి*
*ఆలోచిస్తామంటారు.*

*ఇప్పుడు ఆశ్చర్యంగా*
*నేను మౌనంగా మాట్లాడుతున్నాను.*



♦

మునగచెట్టు వాడిపోదా! వున్న నాలుగు కోళ్ల చచ్చిపోవా! ఈ ఊర్లోనే పుట్టినాను ఈ ఊర్లోనే పెరిగినాను ఈ ఊర్లోనే పెండ్లాడినాను. ఈ ఊర్లోనే చచ్చి పోవాలని వుందిరా. నేను మన ఊరు వదిలి ఎక్కడికీ రానురా. ఈ నేల వదిలి ఎక్కడికీ రావాలనిపించదురా “అని బదులిచ్చింది.

శీనడు అమ్మ ముందరికి వచ్చి తను తెచ్చిన స్వీటు హాటు చీర చేతికిచ్చి “అమ్మా అమ్మా వస్తా వస్తా పెద్దమ్మ ఇంటికి వెళ్లి వచ్చినాను. పెద్దమ్మ పెరుగు కమ్మగా రుచిగా వుంటుందని నీ కోసం తెచ్చినాను” అని చెప్పి పెరుగున్న స్టీలు గిన్నె చేతికిచ్చినాడు

“ఒరేయ్ శీనా, పెద్దమ్మ పెరుగైనా, మన ఇంట్లో పెరుగైనా కమ్మగా రుచిగానే వుంటుందిరా” అంది.

“మరి నేను చదువుకునేటప్పుడు పెద్దమ్మ పెరుగు కమ్మగా రుచిగా వుంటుందని ఇంకెక్కడా ఇంత మంచి పెరుగు వుండదని చెప్పినావు కదా” అని అడిగినాడు.

“ఇంటి పెద్ద లేకపోతే ఇంట్లోవాళ్ళు పడే బాధ చిన్న బాధ కాదది.

ఆ బాధ పడే వాళ్ళకే తెలుస్తుంది. ఒకరికి చెప్పుకొనే బాధ కాదది. చెప్పుకున్నా ఎదుటి వాళ్ళకి అంత సులభంగా అర్థమయ్యేది కాదది.

రూపాయి నోటు కండ్లారా చూడబోతామా అని అల్లాడిన రోజులవి. అబ్బ నాన్న లేని కొడుకైనా నువ్వు చెట్టంత ఎదగాలని నలుగురిలో నాణ్యంగా బతకాలని రేయింబగళ్ళు కష్టపడినానురా. బియ్యం వెల ఎక్కువని, రాగిపిండి వెల తక్కువని రోజూ సంగటి ముద్దలు కెలికి నీకు పెట్టేదాన్ని. మన పెరట్లోని మునగచెట్టు ఆకులతో మునక్కాయలతో రోజులు గడిపినాను. రోజూ నేను చెసే సంగటి మునగ కూరలు తినలేక నువ్వు ఎక్కడ తిండి తగ్గించేస్తావోనని భయ పడే దానిని. పెద్దమ్మ పెరుగు భలే వుంటుందని చెబితే ఒక్క పిడచ సంగటి ముద్ద అయినా ఎక్కువ తింటావేమోనని అట్లా చెబుతూ వచ్చినాను.

నా కొడుకు నలుగురిలో నాణ్యంగా వుండాలని, కడ రోజులలో నైనా నేను తల ఎత్తుకు తిరగాలని వేయి దేముళ్ళకు మొక్కినాను. ఒకరి ఇంటికి పోకుండా ఒకరి దగ్గర చేయి చాచకుండా ఉన్నంతలో సంసారం లాగినాను.

తోడబుట్టిన నా అక్క బంగారం రా. పెద్దమ్మ పెద్ద ధనవంతురాలు కాదురా. అయినా తనకున్నంతలో మనకు సహాయం చేసి మనం ఎదగాలని కోరుకొందిరా. ఎంతైనా తోడబుట్టింది కదా, నా సంసారం బాగుండాలని పెద్దమ్మ తాపత్రయం... “ అంటూ' ఓ' అని ఏడవసాగింది.

లక్ష్మమ్మ ఏడ్చిందని శీనడు ఏడ్చినాడు.

అమ్మా కొడుకులిద్దరూ ఏడుస్తూ ఒకరినొకరు ఓదార్చుకొన్నారు. కోళ్లు వారిద్దరి వైపు మెడలాడిస్తూ చూడసాగాయి. గాలికి మునగచెట్టు మునగపూలు రాల్చింది.

స్టీలు గిన్నె లోని పెద్దమ్మ పెరుగు మిలమిలా మెరుస్తోంది.

♦

విశ్లేషణ



# అన్నమయ్య సంకీర్తనల్లో జానపద కళా రూపాలు

- డాక్టర్ కందిమళ్ల సాంబశివరావు
98483 51517

**ఏ** పదం వింటే తనువు తరువు ఆనందపారవశ్యంతో ఫలపుష్పభరితమౌతుందో.. ఏ పలుకు వింటే మానస సరోవరం అమందానంద కందళిత హృదయారవిందమౌతుందో... ఏ మాట వింటే అవ్యక్తానంద సంభరిత రసప్లావితమౌతుందో... ఆ పదం సర్వకాల సర్వావస్థల్లో అమృతబిందు సందోహమౌతుంది. అది జంజత్వం నుండి జాగృతికి; అసత్యం నుండి సత్యానికీ దారిచూపే నిత్య సత్య చైతన్యరసస్ఫూర్తి – దీప్తికి ఆకారమై నిలుస్తుంది. శతాబ్దాలు గడిచినా భాషా భేదం లేకుండా జన సామాన్యానికి పూజనీయమైన సారస్వత నిధానమై... ప్రతి పలుకూ సమ్మదమై... సమ్మదమై, స్వార్థ చింతనతో చెదరిన; చెరిగిని మనస్సులను ఒకటిగా చేసే సమాహారమై, మనోవల్మీకంలో బుసలుకొట్టే కోరికల కాల సర్పాల ఘూత్కారరవాగ్నులను అణచివేసే సలిలమై ఒప్పారుతుంది.

పద్యానికి పట్టాభిషేకం చేసి అంగరంగ వైభవంగా సుందర సుమనోహరంగా రచించి కవులు తరిస్తున్న కాలంలో జనం నాలుకలపై లాస్యం చేస్తున్న అసలు సిసలైన అచ్చ తెలుగులో సంకీర్తనలను రచించి పామరజనులకు జ్ఞానభిక్షను పెట్టిన ప్రజాకవి శేఖరుడు తాళ్లపాక అన్నమాచార్యులు. తరతరాలుగా ప్రజలమధ్య ప్రజలచేత పుట్టిన ప్రజాగుండె చప్పుళ్లను ప్రతిబింబమైన అపురూప జానపద శిల్పకళాసంపదను తన పదాలలో అంతర్భాగం చేసి భవితకు, నవతకు దారులు వేసిన పదకవితాపితామహుడు అన్నమయ్య. ఆ మహనీయుని ఆశయం.. ఆలోచనం.. ఆచరణం.. ఆవిష్కరణం అనితర సాధ్యం.

పామరజన నందోహాన్ని అలరించడానికి ఆకర్షించడానికి.. అన్నమయ్య జానపద కళారీతులను తన పద సాహిత్యంలో అంతర్భాగంగా చేసిన తీరు అద్భుతం. తెలుగు నాట అనాదిగా ఉన్న దేశిసంబంధమైన కవిత్వం... కళలు, ఆట పాటలు సామాన్య ప్రజలకు చిటికెడు విజ్ఞానాన్ని, చారెడు వినోదాన్ని పంచి పెట్టాయి. తెలుగు సాహిత్య ఆరంభకాలం నాటికే ప్రజల మధ్య విలసిల్లుతున్న జానపద కళావైభవాన్ని పాల్కురికి సోమన బసవ పురాణంలో కళ్లకు కట్టినట్లుగా అభివర్ణించారు. పర్వత పదములు; ఆనంద పదములు; శంకర పదములు; నివాళి పదములు; వాలేశు పదములు; గొబ్బి పదములు; వెన్నెల పదములు వంటి జానపద కళారీతులు జనబాహుళ్యంలో ఉన్నట్లు పాల్కురికి పేర్కొన్నారు.

*“భారతాది కథల చీరమరుగుల*
*నారంగ బొమ్మల నాడించువారు*
*కడునద్భుతముగ కంబ సూత్రంబు*
*లదరంగ బొమ్మల నాడించువారు*
*వెండియు భవు బహువిధ చరిత్రముల*
*ఖండిత గతి నాటకంబు లాడుచును*
*ప్రమధ పురాతన పటు చరిత్రములు*

*క్రమమొంద బహునాటకము లాడువారు*
*అటుగాక సాంగ భాషాంగ క్రియాంగ*
*పలు నాటకంబుల నటియించువారు*
*లలితాంగ రసకళాలంకార రేఖ*
*బలవడ బహురూప మాడెడువారు"*

ఈ మాటల వలన ఆనాటికాలంలో బొమ్మలాటలు; బహురూపాలు; పగటి వేషాలు, వీధి నాటకముల వంటి జానపదకళా ప్రక్రియలు విశేష ప్రచారంలో ఉన్నట్టు ద్యోతకమౌతుంది.

జానపదుల జ్ఞాన పథాలను ఆవిష్కరించే గుండె చప్పుళ్లు జానపద కళారూపాలు. బేషజాల ముసుగులకు దూరంగా నిష్కళ్మషమైన అమాయకత్వానికి దగ్గరగా పల్లీయుల వినోదార్థం ఆవిర్భవించిన అసలు సిసలైన కళాసంపదకు కుదుళ్లు ఈ జానపద కళారూపాలు. జనజీవనం నుండి పుట్టిన నిక్కమైన మాటల మూటలు ప్రదర్శనగా అవతారమెత్తిన వేళ ఒళ్లు పులకింతలతో పూచినప్పుడు ఆ మధురిమలకు ఆనవాళ్లు జానపద కళారూపాలు. ఆలోచనలు జడ్డిగం నుండి జారిన పుక్కిట పుక్కిట పురాణాలు, అద్భుతాంశాలు అనే విత్తనాలు వేదిక అనే నాగేటి చాళ్లలో పడినప్పుడు వినోదపు పంట విరగబడి కాస్తే సంతోషపు పురులలో దాచుకొనే సిరులే ఈ జానపద కళారూపాలు. కళకళ కోసం... కాదూ... ప్రజల కోసం... ప్రగతి కోసం అనే వాదాలు ఉన్నవేళ గ్రామరుకు అందని; గ్లామర్‌కు నోచుకోని గ్రామ్యభాషతో జన సామాన్యానికి వినోదాన్నీ, విజ్ఞానాన్నీ పంచి ప్రత్యక్షంగా; పరోక్షంగా నైతిక జీవన మార్గాలకు ద్వారాలు తెరచిన ఘనత నిస్సందేహంగా జానపద కళారూపాలకు దక్కుతుంది.

అటువంటి అపురూపమైన జానపద కళాప్రక్రియలను అన్నమయ్య తన సంకీర్తనల్లో ప్రస్తావించడమే కాకుండా సోదాహరణంగా వివరించారు. బొమ్మలాటలు; కోలాటం; గొబ్బిపదములు; తుమ్మెద పదములు; చందమామ పదములు; అల్లో నేరేళ్లు; జాజర; ఛాంగుభళా; తందనాన; దోబూచి; ఎఱుక; బహురూపం; యక్షగానం; వీధినాటకం; పగటి వేషాల వంటి జానపద కళారీతులను నిక్షిప్తం చేశారు. వర్తమానంతో పాటు భూతకాలంలో అలరారిన జానపద కళారూపాలకు సంకీర్తనల్లో చోటు కల్పించి తరతరాల కాలం తెలుగు జనుల మస్తిష్కాలలో నిలిచిపోవడానికి భూమికగా నిలిచారు.

**తోలుబొమ్మలాట**

తెలుగునాట ఆబాల గోపాలాన్నీ ఆనందింపజేసి సుదీర్ఘకాలం దివ్యంగా వెలిగిన కళారూపం తోలు బొమ్మలాట. లలిత కళలన్నీ సలక్షణంగా... సులక్షణంగా మూర్తీభవించిన కళారూపం తోలుబొమ్మలాట. అన్నమయ్య సంకీర్తనల్లో బొమ్మలాట కళారూపాన్ని మనిషి జీవితంతో పోల్చి వివరించిన వైనం హృద్యంగా ఉంటుంది.

*ఆటవారి గూడి అన్నిచోట్ల*
*బొమ్మలాట లాడించ నధికుండనైతివి*
*గురుతరమగు పెద్ద కొట్బాము లోపల*
*తిరమైన పెనుమాయ తెరగట్టి*
*అరయ నజ్ఞానములని యుద్ధముగజేసి*
*సురగ సుజ్ఞాన దీపములు ముట్టించి*
*తోలుబొమ్మల దొరకని గడియించి*
*గాలి చేత వాది కదిలించి*
*తూలేటి రసములు తొమ్మిది గడియించి*
*నాలుగు ముఖముల నలువున నాడించ*
*నిన్నే మెత్తురుగాని నీకేమి నీ లేరు*
*మన్నించు దాతలు మరి లేరు*
*ఈ మాయల లోకం ఒక పశువుల కొట్టమట.*

పెనుమాయ అనే తెరను గట్టి అజ్ఞాన తిమిరాలను పోగొట్టడానికి ఈ బొమ్మలాట ద్వారా సుజ్ఞాన దీపాలను వెలిగించాట. జనులందరినీ తోలుబొమ్మలుగా జేసి పలు విధాలుగా ఆ దేవ దేవుడు ఆడిస్తున్నాడట. "నిన్నే మెత్తురుగాని నీకేమి నీలేరు" అనే మాటల ద్వారా నీయంతటి మహనీయుని మెచ్చుకొంటారేగానీ ఏమీ ఇవ్వక శూన్య హస్తాలను చూపుతారని భగవంతుని పరంగా చెప్పినా బొమ్మలాట వారి దైన్యమైన స్థితిని కళ్లకు కట్టినట్లు వర్ణించారు.

**కోలాటం**

వెన్నెల రాత్రులలో సాగే హృద్యమైన కళారూపం కోలాటం. ఇది బృంద నాట్యం. చేతిలో రెండు కోలలను పట్టి వలయాకారంగా కళాకారులు ఉంటారు. ఒకరినొకరు కోలలను తాకిస్తూ లయబద్ధంగా పాటలు పాడుతూ అడుగులు వేస్తూ విన్యాసాలు చేస్తారు. కోలాటం కళారూపాన్ని పురుషులతో

పాటు స్త్రీలు కూడా ప్రదర్శించడం విశేషం. వనితల కోలాటాన్ని రూపచిత్ర సాక్షాత్కారంతో అన్నమయ్య వర్ణించిన తీరు అద్భుతంగా ఉంటుంది.

***వేడుకల వసంతము వేళనిదే***
***వాడవాడల వెంట వనితలాడేరు***
***కేలుకేలు జుట్టు బట్టి కెందామర మోములెత్తి***
***కోలకోల దాక జేసి గుంపు నాయక***
***చీలుకొని ఇద్దరేసి జంటలే సతులు గూడి***
***వోలి వేరొకతె కోలనొడ్డుతా నాడేరు***

ఈ సంకీర్తనలో కోలాటం వేసే వారిలో తానూ ఒకటైనట్టుగా వివరణాత్మక చిత్రణ చేయడం గమనార్హం. ఇద్దరిద్దరుగా కోలాటం వేసే తీరును సముచితంగా వర్ణిస్తూ తన వర్ణనా వైదగ్ధ్యాన్ని సైతం ప్రకటించుకొను వరణీయ కవి అన్నమయ్య. కోలాటానికి చెందినరీతిని మరొక సంకీర్తనలో కూడా వివరించారు.

***గోవింద నందనందన గోపాలకృష్ణ నీ***
***భావము మాకు జిక్కె గోపాలకృష్ణ***
***కొంగు పట్టిన దేమోయి గోపాలకృష్ణ మా***
***పంగెన కోపుదునా గోపాలకృష్ణ***
***దొంగ తనాల నవ్వేవు గోపాలకృష్ణ***
***బంగారు కాసెతోడి గోపాలకృష్ణ***
***కొమ్మల చీరలంటిన గోపాలకృష్ణ***
***పమ్మి నిన్నుం దిట్టేము గోపాలకృష్ణ***
***కుమ్మరించే వేల సిగ్గు గోపాలకృష్ణ***
***బమ్మెర పోతిందుల గోపాలకృష్ణ***

చీరెల దొంగ గోపాలకృష్ణుని గోపికలు ఆటపట్టించడం ఇందు అభివర్ణితం. ఈ సంకీర్తన తాళప్రధానంగా నడుస్తుంది.

**జాజర**

పుచ్చపువ్వులాంటి వెన్నెల రాత్రులలో శృంగార ప్రియులైన స్త్రీలు పాడే పాట జాజర. ఈ జాజర పాటల్లో శృంగారరసం సరసమధురంగా చిందులు వేస్తుంది. కొండకచో హాస్యం; చమత్కారాలు చిప్పిల్లుతాయి. అన్నమయ్య విరచించిన ఈ సంకీర్తనల్లో జాజర కళారూపం ప్రత్యక్షమౌతుంది.

***చాలు చాలు నీ జాజర నన్ను***
***జాల బరచె నీ జాజర***
***వలపు వేదనల వాడేను ఈ***
***తలనొప్పులచే దలకేను***
***పులకల మేనితో దొరలేను కదు***
***జాలిగొని జల్లకు జాజర***
***బల్లని నినుగని ఉడికేను నీ***
***చిల్లర చేతుల చిదిమేను***

ఈ జాజర కళారూపం మనోహరంగా ధ్వనిస్తుంది.

**గొబ్బిళ్లు**

సంక్రాంతి పర్వదినాలలో మహిళలు వయోభేదం లేకుండా ఆడిపాడే కళారూపం గొబ్బిపాటలు. తెలంగాణాలో బొడ్డెమ్మ, బతుకమ్మ పాటలు కూడా ఈ కోవలోకే వస్తాయి. ఆవుపేడతో గొబ్బెమ్మలను చేసి బంతి, మందారాలతో అలంకరించి ముత్యాల ముగ్గుల్లో ప్రతిష్టించడం జరుగుతుంది.

గొబ్బెమ్మల చుట్టూ మహిళలు ఆడుతూ పాడుతూ తిరుగుతారు. అన్నమయ్య తన సంకీర్తనల్లో గొబ్బెమ్మ పదాలను హృద్యంగా వివరించారు.

***కొలను దోపరికి గొబ్బిళ్లో యదు***
***కుల స్వామికి గొబ్బిళ్లో***
***కొండ గొడుగుగా గోవుల గాచిన***
***కొండక శిశువుకు గొబ్బిళ్లో***
***ఈ సంకీర్తన సరళ సుబోధకంగా ఉంటుంది***

***చందమామ పదాలు***

వెన్నెల్లో ఆడపిల్లలు తుళ్లుతూ ఆడే ఆట... పాడే పాట చందమామ పదాలు. చాంతాడు లాంటి దీర్ఘం తీస్తూ బుడి బుడి ఏడ్పులతో నయగారాలు పోయే శిశువులను లాలిస్తూ బుజ్జగిస్తూ ప్రతి తెలుగమ్మ పాడే పాటను వ్రాసింది అన్నమాచార్యుల వారే.

***చందమామ రావో జాబిల్లి రావో***
***కుందనపు వైడికోరి వెన్నబాలు తేవో***
***అల్లో నేరెళ్లో***

వెన్నెల కాంతిలో వెన్నలాంటి మనసున్న ఆడపిల్లలు ఆడుతూ పాడే కళారూపం అల్లో నేరెళ్లో. పాటలోని ప్రతి పాదం చివర అల్లో నేరెళ్లో అనే మకుటం అంత్యప్రాసగా నడుస్తుంది.

***నెయ్యములల్లో నేరెళ్లో***
***బయ్యన ఊరెడి ఉవ్విళ్లో***

*పలచని చెమటల బహుమూలముల*
*చెలనములోన చెలువములే*

తెలుగుదనం; తెలుగు ధనం ఉట్టిపడేలా అల్లోనేరెళ్లో పదాన్ని మన కందించిన అన్నమయ్య కవితా వైభవం అనన్య సామాన్యం.

**ఛాంగుభళా**

ఛాంగుభళా; తందనానా పదాలు బుర్రకథల్లో, దరువుల్లో పాటల్లో పునరుక్తాలు. ఛాంగుభళా అనే రూపాన్ని గూర్చి పాల్కురికి సోమన కూడా పేర్కొన్నారు. ఛాంగుభళా అనేది కోలాటం వరుసల్లో ఒకటిగా భావిస్తున్నారు. అలమేలు మంగ వైభవాన్ని వివరిస్తూ అన్నమయ్య ఛాంగుభళా సంకీర్తనను రసరమ్యంగా వివరించారు.

*చక్కని తల్లికి ఛాంగుభళా*
*చక్కెర మోవికి ఛాంగుభళా*

*తందనాన*

ఏకతార వంటి వాయిద్య విశేషాన్ని మీటుతూ పాడేపాట తందనాన. కథాగేయ ప్రవర్తన లాంటి పదం తందనాన. ఒకరు ఆడి పాడి వివరిస్తూ ఉంటే ప్రేక్షకులు ఆనందించే విధానం ఇందులో గమనించగలం. అన్నమయ్య విరచిత తందనాన సంకీర్తన బహుళ ప్రజాదరణ పొందింది.

*తందనాన అహి తందనాన పురే*
*తందనాన భళా తందనాన*
*బ్రహ్మమొక్కటే పరబ్రహ్మ మొక్కటే*
*పరబ్రహ్మమొక్కటే పరబ్రహ్మమొక్కటే*
*కందువగు హీనాధికములిందులేవు*
*అందరికీ శ్రీహరే అంతరాత్మ*
*ఇందులో జంతు కులమంతా వొకటే*
*నిండార రాజు నిద్రించు నిద్రయు నొకటే*
*అండనే బంటు నిద్రనదియూ నొకటే*
*మెండైన బ్రాహ్మణుడు మెట్టు భూమి యొకటే*
*చండాలుండేటి సరిభూమి యొకటే.*

వర్ణం, వర్గం, కులం, మతం, మనిషి నిర్మించుకొన్న అడ్డు గోడలేననీ, అందరూ సమానులే అనే సమైక్యతను ప్రబోధించారు.

**ఎరుకల సాని**

ఎరుక చెప్పడం ద్వారా ఎరుకలసాని సంఘంలో పరువు ప్రతిష్టలను కలిగి ఉండేది. సమాజంలోనే కాదు సాహిత్యంలో కూడా ఎరుకలసాని విశిష్ట స్థానాన్ని అలంకరించింది. ఒక ప్రముఖ పాత్రగా అలరారింది కూడా. కురవంజి కళారూపంతోపాటు యక్షగానాలలో కూడా ఎరుకలసాని ఒక పాత్రగా ప్రవేశించి నాయికా, నాయకులకు ఎరుక చెప్పి నిష్క్రమించేది.

*ఎరుక చెప్పితి వినవమ్మ*
*కరుణతో కలనే కనకపూ బొమ్మ*
*ఎరుక ఎరుకా ఏడు జగములు*

అన్నమయ్య సంకీర్తనల్లో ఇటువంటి ఎరుకసాని కళారూప ప్రసక్తి కన్పిస్తుంది.

**బహురూపి**

ఇది అభినయ ప్రధానమైన కళారూపం. పదకవితాపితామహుడైన అన్నమయ్య సంకీర్తనల్లో బహురూపం కళాప్రక్రియ కన్పిస్తుంది. "పన్నిన తెరమరుగు బహురూపములెల్లాన" అనే సంకీర్తనలో బహురూప కళాప్రక్రియ కన్పిస్తుంది. "అలరులు కురియగ నాడెగదె అలకుల కులుకుల అలమేల్ మంగ" అనే సంకీర్తనలో అరతెరమరుగున ఆడిన భామా కలాపాన్ని స్ఫురణకు తెస్తుంది. మరొక సంకీర్తనలో నాయిక తెరమరుగున ఆడుతూ దేశి శుద్ధంగాలను అభినయించి చూపిన తీరును, చిందు మొదలైన ఆటలను బహుతాళములతో అభినయించిన వైనాన్నీ అన్నమయ్య అభివర్ణించి దేశినృత్యాన్ని బహువిధాలా ప్రకటించి ఉండడం గమనార్హం.

జానపదుల ఆనందానుభూతులు; అభిప్రాయ వ్యక్తీకరణకు ఆలవాలమైన జానపద కళారూపాలను తన సంకీర్తనల్లో అంతర్భాగం చేసిన అన్నమయ్య ఆలోచన అనితర సాధ్యమైనది.

జన బాహుళ్యంలో విశేష వ్యాప్తిలో ఉన్న జానపద కళారూపాలను తన సంకీర్తనల్లో ప్రయోగించడం మూలంగా ఆ మహనీయుని పదకవితా సుమ సౌరభం పామరజనుల నాసికా పుటాలకు చేరింది అనడంలో అతిశయోక్తి లేదు. ♦

## కన్నీటి కావ్యం

- తిరునగరి శరత్ చంద్ర
6309873682

తీరం చేరని అలలై
కలలు కలవరపడుతున్న వేళ
ఘనీభవించిన పవనాల తెరపై
చూపులు కన్నీటికావ్యాన్ని రాస్తున్నాయి.
బాధల సుడిగుండాలు
వర్తమానపు చీకటి నుంచి
భవిష్యత్తు ఉదయానికి
వెలుగు వంతెనై నిలబడుతున్నపుడు
పూసిన నిస్వార్థపు పుష్పం
మూసిన కాలపువాకిట్లో
విశ్వాసపు గాలులను వీస్తున్నపుడు
గళం కన్నీటిస్వరమై వినబడుతుంది.
ఈ కన్నీరు –
నెత్తురుతో తడిసిన
నిన్నటి చరిత్రను
తుడిచేసి సరికొత్త అధ్యాయాన్ని సృష్టిస్తుంది.
మెలకువతో నిద్రిస్తున్న
కొంగలు తీసే
అరాచకాల ఆవులింతల్ని
కుట్టిపడేస్తుంది.
చెత్తా చెదారం అంతా



వీరవిహారం చేస్తుంటే
ఈ కన్నీరు ప్రక్షాళన చేస్తుంది.
చెత్తను కడిగేస్తుంది. మోసాన్ని కడిగిపారేస్తుంది.
ఈ కన్నీటికి ఆవేశం ఎక్కువ.
సముద్రాలన్నీ దీనిలో ఇంకిపోతాయి.
మేఘాలన్నీ ఆవిరైపోతాయి.
అది –
బాంబులా పేలుతుంది
బజారులా నిలబడుతుంది
ఆకలికి బందోబస్తై కనబడుతుంది.
ఒక్కోసారి
ఒక్కో తీరుగా ఎగబడుతుంది.
అందుకే –
ఈ కన్నీటికి కన్నీటితో సెల్యూట్ చేయాలి.
దొర్లిపడే
ఒక్కో కన్నీటిబిందువులోంచి
ఒక్కో కావ్యాన్నేరుకుని
అనుభవాలముద్ర అద్దుకోవాలి ♦

## పూడిక

- చొక్కాపు. లక్ష్మునాయుడు
9573250528

చుట్టూ సముద్రం–
మధ్యలో మహా సామ్రాజ్యం.

జీవనదులు,,
జానపదుల జీవిక నింపే
పచ్చని పంట పొలాలు–
పరిమళ భరితమైన పుస్తకాలు–
నీళ్ల అడుగున
విష పురుగుల వాసన!
బుడగలు బుడగలుగా
సెగలు కక్కుతూ
కానరాని కుట్ర–

ద్వీపాంతర వాసాన్ని
మోసుకొస్తున్న మాయ గాలి!

ఒంటి నిండా అంటువ్యాధిలా
ప్రభలుతున్న పరాయీకరణ!



శత్రు శిబిరాలుగా చూపే గందరగోళం!

కనికట్టు తో
కాలాన్ని తిరగతోడే విన్యాసం.
వర్తమానానికి గతాన్ని దోషిని చేసే
విఫలయత్నం.

నిరాదరణను నెపం చేసి
శరీరం నుండి ఇంద్రియాల్ని,,
మట్టి నుండి మొక్కల్ని
వేరుపరుస్తున్న సందేహం!
మంచు కొండల్ని

రేపటి ఆకాశం క్రింద
నిశ్చింతగా నిద్రపోతున్నపుడు
దేహం మునిగి పోతున్న చప్పుడు–

ఇప్పుడు...
పూడికను కప్పుకొనేందుకు
నమ్మకమైన అక్షరాలు కావాలి.
ముంచుకొస్తున్న కుతంత్రం నుంచి
బయట పడేందుకు కొన్ని తెప్పలు కావాలి. ♦

# స్వీకారం




## మట్టి మొగ్గలు


**బోల యాదయ్య**

వెల : 50/- పేజీలు: 82

ప్రతులకు : 9912206427

బోల యాదయ్య రాసిన ఈ మట్టి మొగ్గలులో తన అనుభవాలున్నాయి. ఒలికిపోయిన గంజనీళ్ళున్నాయి. రెక్కలు తెగిన ఆశలున్నాయి. కన్నీళ్ళ గుంర్తులున్నాయి. బాధల బరువులున్నాయి. అన్యాయాల ఆగడాలున్నాయి. పగిలిపోయిన గాజుముక్కలున్నాయి. ఇలా వైవిధ్యభరితమైన మొగ్గలన్నీ ఇందులో దర్శనమిస్తాయి.

**- డా॥ భీంపల్లి శ్రీకాంత్**




## యానాం కవితలు


**శిఖామణి**

వెల : 150/- పేజీలు: 208

ప్రతులకు: 9848202526

శిఖామణి నిక్కమైన కవి కనుక అలా రికార్డు చేసిన చరిత్రాత్మక కవితలలో కవిత్వాంశ కూడా అద్వితీయమే. అందుకనే బాప్ప కవితనో, యానాం సరస్వతి కవితనో, పూలకుర్రాడు కవితనో ఉత్త వైయక్తిక వ్యక్తీకరణలుగా కొట్టిపారేయలేం. ప్రతి ఒక్కరూ ఎక్కడో ఒకచోట ఈ కవితలతో కనెక్ట్ అవుతారు. వాటిని సార్వజనీన వాక్యాలుగా హృదయగతం చేసుకొంటారు.

**- బొల్లోజు బాబా**




## తిరుగుబాటు స్వరాలు

**ఖలీల్ జిబ్రాన్: "స్పిరిట్స్ రెబలియన్"కు తెలుగు అనువాదం**

**డాక్టర్ ఎస్. జతిన్ కుమార్**

వెల :75/- పేజీలు: 70

ప్రతులకు: 040-24652387

సమాజం అందరి సమభోగ్యం కావాలని ఎలుగెత్తటం నేరమా? మనుషులు చేసిన చట్టాలకు కట్టుబడి నోరు మూసుకోవలసిందేనా? ఇలా ఎన్నో ప్రశ్నలు - సమాధానాలకై ఈ స్వరాలు వినండి. మానవత్వాన్ని, మనోసౌకుమార్యాన్ని తట్టిలేపే తిరుగుబాటు స్వరాలివి. స్వేచ్ఛ, స్వాతంత్ర్యం, సమన్యాయం కోరుకున్న స్వరాలివి.

**- డాక్టర్ ఎస్. జతిన్ కుమార్**



## బతుకమ్మ నానీలు

**డా॥ భీంపల్లి శ్రీకాంత్**

వెల : 30/- పేజీలు: 50

ప్రతులకు: 9032844017

వివిధ వస్తువులతో నానీలు రాయడంలో ఒకింత సౌలభ్యం కవికి దొరుకుతుంది. కానీ ఏకాంశ నానీలు రాయడం వస్తువులోని భిన్న కోణాలను పసిగట్టాల్సి ఉంటది. చమత్కారవంతంగా, సరసంగా, ధ్వని పూర్వకంగా చెప్పాల్సి ఉంటది. భీంపల్లి బతుకమ్మను వస్తువుగా తీసుకుని అది తెలంగాణ పల్లె జీవితానికి ఎన్ని రంగులద్దుతున్నదో మనకు ఈ నానీల్లో ఆవిష్కరిస్తున్నడు.

**- కోట్ల వెంకటేశ్వర రెడ్డి**



## యోధుడు కొండారెడ్డి చారిత్రక నవల

**గొరెడ్డి హరిశ్చంద్రారెడ్డి**

వెల :50/- పేజీలు: 80

ప్రతులకు: 9110595847

ఎన్నో ఊహలు, కల్పితాలతో వచ్చిన అనేక చారిత్రక నవలలకంటే ఇది భిన్నమైనది. ఆధునిక తరం తెలుసుకోవాల్సిన కథాంశం. పరిశోధిస్తే గొప్ప సత్యాలను ఈ సమాజానికి అందించవచ్చని రచయిత నిరూపించారు. ఈ క్రమంలో వాస్తవమైన చరిత్ర రాస్తేనే చరిత్రలో స్థానం ఉంటుందని ఈ రచన ద్వారా వర్తమాన రచయితలకు, వర్ధమాన రచయితలకు స్ఫూర్తిదాయకమైన సందేశమిచ్చారు. ఇది ప్రతి పౌరుడు చదవాల్సిన పుస్తకం.

**- కెంగార మోహన్**




## ఆకాశమంత చూపు కవిత్వం

**బి. గోవర్ధనరావు**


వెల :60/- పేజీలు: 107

ప్రతులకు: 9441968930

కవితాభివ్యక్తిలో సహజంగా కొంత హెచ్చుతగ్గులున్నా, ఇందులోని 38 కవితలలో వస్తు వైవిధ్యం బహుముఖంగా వుంది. అన్నీ చదివిన తర్వాత, ముఖ్యంగా ఏకబిగిన చదివితే, కవి హృదయాన్నేకాక కవిత్వంలోని నిజాయితీని కూడా పాఠకుడు ఆస్వాదించగలుగుతాడని నేనభిప్రాయపడుతున్నాను.

**- దివికుమార్**

# స్వీకారం



## నేను నమ్మిన దారిలో...

స్వీయ జీవన రేఖలు


**మార్ని రామకృష్ణారావు**

వెల :100/- పేజీలు: 184

ప్రతులకు: 9949079040

ఒక సామాన్య వ్యక్తి నిజాయితీతో, నిబద్ధతతో తను నమ్మిన సత్యాన్ని ఆచరిస్తూ జీవితంలో ఎంత ఉన్నతంగా ఎదగవచ్చో అనేదానికి మార్ని రామకృష్ణారావు గారి జీవితం ఒక గొప్ప ఉదాహరణ. ఆయన జీవితం నుండి ఈ తరం నేర్చుకోవలసింది ఎంతో ఉంది. నిరాడంబరమైన ఆదర్శ జీవనశైలికి ఈ స్వీయ జీవిత చరిత్ర నిలువెత్తు సాక్ష్యం. ఈ పుస్తకం తప్పనిసరిగా అందరూ చదవాలి.

**- వోరప్రసాద్**



## గ్రీన్‌బుక్-2 కొత్తనీరు రెక్కలు

**యం.కె. సుగమ్‌బాబు**

వెల :100/- పేజీలు: 149

ప్రతులకు : 8096615202

మనిషి జీవితం అంతిమంగా ఏమి చెబుతోంది. పరిమితమైన జీవితం అపరిమితమైన పరిధిలో వ్యాకులపడటం, అశాంతిలోకి జారిపోవడం మాత్రమే కాదనుకుంటాను. ఒక తాత్విక అవగాహన మాత్రమే మనిషిని సేదతీరుస్తుందని, మనశ్శాంతిని ప్రసాదిస్తుందని, సరైన తోవలో నడిపిస్తుందని నమ్ముతాను. ఈ ఆలోచనే నాతో 'రెక్కలు' ప్రక్రియ రాయించింది. 'రెక్కలు' ప్రవహించే కాలానికి ప్రతీకలు.

**- యం.కె. సుగమ్‌బాబు**




## దండకడియం కవిత్వం


**తగుళ్ళ గోపాల్**

వెల : 150/- పేజీలు: 164

ప్రతులకు: 9505056316

గోపాల్ కవిత్వానికి భూమికా, ప్రాతిపదికా, పెనుతుఫానై చెలరేగుతూ పాత ఆధిపత్య భావజాలాలను సమూలంగా తుడిచిపెట్టి కొత్త భాషనూ, కొత్త చరిత్రనూ రాస్తున్న ఈ సబాల్టర్న్ చైతన్యమే. గోపాల్ కవిత్వం ఇన్నాళ్లూ అణచివేతకు గురైన అనేకానేక అస్తిత్వాల ధిక్కార ప్రకటన. పురివిప్పిన అనేక సబాల్టర్న్ అస్తిత్వ చైతన్యాల గానం. సంఘర్షిస్తూ వికసిస్తున్న వేల పూల పరిమళం.

**- నారాయణస్వామి వెంకటయోగి**



## పడమటి గాలి

ఆంగ్ల కవితల అనువాదం


**డా॥ ముద్దు వెంకటరమణారావు**

వెల :150/- పేజీలు: 264

ప్రతులకు: 9177794351

ఇంగ్లీషు కవిత్వం మాత్రం (Poetry) మొదట నుంచీ ఇప్పటి వరకు, ముఖ్యులైన కవుల రచనలను కనీసం ఒక్కొక్కటి అనువదించి, ప్రచురించాలని సంకల్పం కలిగింది. ఒక్కొక్కటి దేనికి అనువాదమో ఆ ఇంగ్లీషు పద్యాన్ని, కవిని acknowledge చేస్తూ బ్రాకెట్లలో ఉదహరించాను. Immortal Poems పుస్తకంలో వున్న రచనలను మాత్రం ఇంగ్లీషు మాతృక, తెలుగులో నా అనుసరణ, రెండూ ప్రచురించాను.

**- రచయిత**




## కన్యాశుల్కం నాటకాన్ని తెలుగు వాళ్ళెవరూ సరిగ్గా అర్థం చేసుకోలేదా


**అంపశయ్య నవీన్**

వెల :300/- పేజీలు: 317

ప్రతులకు: 040-24652387

ఇది నేను ప్రచురిస్తున్న నా ఐదవ వ్యాసాల సంకలనం. నేను ఈ వ్యాసాల్ని, పుస్తక సమీక్షల్ని, ముందుమాటల్ని, ఈ లోకం నుండి శాశ్వతంగా వెళ్ళిపోయిన సాహితీ మిత్రులను గూర్చి రాసిన నివాళుల్ని- ఆయా సందర్భాలలో రాశాను. ఈ వ్యాసాల్లోని ఒక వ్యాసాన్ని గూర్చి ప్రత్యేకంగా చెప్పాలి. దాన్నే ఈ సంకలనానికి శీర్షికగా పెట్టాను.

**- అంపశయ్య నవీన్**



## తల్లీ నిన్ను తలంచి

కన్నబిడ్డల గుండె చప్పుడు

**డా॥ సి. భవానీదేవి**

వెల : అమూల్యం, పేజీలు: 257

ప్రతులకు : 040-27636172

నేను 'నది మాసపత్రిక' లో ఈ శీర్షికలో 54 మంది పెద్దల్ని వారి అమ్మ గురించి చెప్పమని పలకరించాను. ఢిల్లీకి రాజయినా ఒక అమ్మకి బిడ్డేనని నిజాన్ని రుజువు చేసిన వీళ్ళంతా వాళ్ళ అమ్మ గురించి మాట్లాడేటప్పుడు పసిపిల్లలైపోయారు. ఒక్కొక్కరు మాట్లాడుతుంటే వింటూ నేను కూడా బాల్యంలోకి ప్రయాణించి వాళ్ళ కుటుంబంలో ఒక సభ్యురాలిగా ఆ దృశ్యాలన్నీ చూశాను.

**- డా॥ సి. భవానీదేవి**

# స్వీకారం




## మేరువు నవల


**నల్లూరి రుక్మిణి**

**వెల : 90/- పేజీలు: 159**

**ప్రతులకు : 9989133401**

అనసూయమ్మే కాదు, అలాంటి వాళ్ళ జీవితాలన్నీ సంక్లిష్టంగానే వుంటాయి. అందువల్లే 'మేరువు'లోని సావిత్రమ్మ ఓ నమూనా. అంటే సావిత్రమ్మ కంటే కూడా ముందుకు వెళ్ళి ప్రాణాలను తృణప్రాయంగా ఎంచిన త్యాగధనులు ఈ యాభై ఏళ్ళలో అనేకమందిని నా కంటిముందే చూశాను. వాళ్ళందరి జీవితాలూ రికార్డు చేయదగినవి.

**- రచయిత్రి**




## పాలపిట్ట వినూత్న కథ

**కథా సంకలనం**

**వెల : 150/- పేజీలు: 352**

**ప్రతులకు: 9848787284**

ఇవాళ్టి రచయితలు ఏయే అంశాల గురించి ఆలోచిస్తున్నారో, వారిని స్పందింపజేసే సంఘటనలు ఏమిటో ఈ కథలు చదివితే బోధపడుతుంది. ఒకటీ రెండు మినహాయించి అన్నీ కొత్త కథలే. మొదటిసారిగా పాఠకుల ముందుకు వచ్చిన కథలివి. మంచి కథల కోసం దప్పికగొన్న పాఠకుల దాహాన్ని తీర్చేందుకు చేసిన ఒక ప్రయత్నమిది. పాఠకులే ఈ కథల మేలిమిని గురించి చెప్పగలరని ఆశ.


**- పాలపిట్ట బుక్స్**

## గుంటూరు సీమ సాహిత్య చరిత్ర

**పెనుగొండ లక్ష్మీనారాయణ**


**వెల :200/- పేజీలు: 299**

**ప్రతులకు: 9291530714**




గుంటూరు సీమ సాహిత్య చరిత్ర ఆ ప్రాంత గుర్తింపు చైతన్యంతో రచయిత వ్రాసాడని అనుకునే అవకాశం లేకపోలేదు. కానీ రచన మొత్తం చదివినప్పుడు తెలుగు సాహిత్య చరిత్రలో గుంటూరు సీమ చరిత్ర ఒక విడదీయరాని భాగం అని తెలుగు సాహిత్య చరిత్ర నిర్మాణానికి దోహదం చేశాయని భారతదేశంలో జరుగుతున్న పరిణామాల నేపథ్యంలో వికసించాయని బోధపడుతుంది.

**- ఆచార్య కేతు విశ్వనాథ రెడ్డి**



## దుర్గాపురం రోడ్ కవిత్వం

**దేశరాజు**

**వెల : 135/- పేజీలు: 176**

**ప్రతులకు: 9948680009**

ఉత్తరాంధ్ర పోరాటపటిమంతా, ఇన్నాళ్ళ సుదీర్ఘ వామపక్ష పోరాటాల సారాన్ని తనలో ఇంకించుకుని అక్కడి నుంచి సామాజిక పరిణామాల చరిత్రనంతా తన కవితలో రకరకాలుగా అనేక సందర్భాల్లో అనేక రకాలుగా అభినవ వ్యక్తీకరణలో పద్య నిర్మాణాలు చేసుకుంటూ పోతున్నాడు.

**- శివారెడ్డి**

## యాభైయేళ్ళ అంపశయ్య

**స్వర్ణోత్సవ జ్ఞాపిక**

**సంపాదకులు: డి. స్వప్న**


**వెల :200/- పేజీలు: 298**

**ప్రతులకు: 040-24652387**




ఈ స్వర్ణోత్సవ సంపుటిలో ఎంతో మంది గొప్ప రచయితలు, విమర్శకులు, సాహితీ మిత్రులు, అభిమాన పాఠకులు తమ స్పందనను ఎంతో ఆత్మీయంగా తెలియజేసారు. అంపశయ్య నవల ప్రత్యేకతలు, శిల్పం, శైలి, కథాగమనం – ఇలా అనేక విషయాలను విస్తృతంగా విశ్లేషించారు. ఒక నవల వెలువడి 50 యేళ్ళు గడిచిన సందర్భంగా 60 మందికి పైగా లబ్ధప్రతిష్ఠులైన రచయితలతో పాటు నారాయణ, సురేంద్ర లాంటి సామాన్య పాఠకులు కూడా ఈ నవల చదివినప్పటి తమ అనుభూతులను తెలియజేయడం అపూర్వమైన సన్నివేశం.

**- డి. స్వప్న**




## బతుకమ్మ మొగ్గలు

**డా॥ భీంపల్లి శ్రీకాంత్**


**వెల :30/- పేజీలు: 36**

**ప్రతులకు: 9032844017**

భీంపల్లి శ్రీకాంత్ ఈ మధ్యకాలంలో 'మొగ్గలు' అనే నూతన ప్రక్రియను ఆరంభించారు. ఇదీ చాలామంది కవుల, యువకవులకు ప్రేరణదాయకమై వేలాది మొగ్గలను వివిధ ప్రాంతాల్లో కవులు రచించి ఆవిష్కరిస్తున్నారు. నిజం చెప్పాలంటే ప్రపంచంలో తెలుగు సాహిత్యంలో ఉన్నన్ని ప్రక్రియలు వేరే భాషా సాహిత్యాలలో లేవు. వీరి 'బతుకమ్మ మొగ్గలు' చదివి సాహితీ పరిమళాలను ఆఘ్రానిద్దాం.

**- డా॥ గన్నోజు శ్రీనివాసాచారి**

# స్వీకారం



## బతుకమ్మ మొగ్గలు సంకలనం

**డా॥ భీంపల్లి శ్రీకాంత్**

**డా॥ గుంటి గోపి, సృజామి**

**వెల : 40/- పేజీలు: 100**

**ప్రతులకు : 9032844017**

వందమంది ఆత్మీయ కవిమిత్రులు తక్షణమే స్పందించి మొగ్గలు ప్రక్రియల్లో అద్భుతంగా బతుకమ్మను బతికించారు. ఒక్కొక్కరు ఒక్కో రీతిలో స్పందించి బతుకమ్మకు పూల హారతులిచ్చారు. ఏక వస్తువుపై మొగ్గలు రావడం ఇదే తొలిసారి కావడం విశేషం.

**- డాక్టర్ భీంపల్లి శ్రీకాంత్**



## రామకృష్ణ శతకం

**టి. అంబుజ**

**వెల : 30/- పేజీలు: 28**

**ప్రతులకు: 9493710142**

శ్రీమతి టి. అంబుజ గారు 'రామకృష్ణ మాట ప్రగతిబాట' అన్న మకుటంతో తెలుగు పద్యకవితా ప్రపంచంలోకి తొలి అడుగు వేసింది. ఈ రామకృష్ణ శతకంలో కవయిత్రి సామాజిక వాస్తవికతను - ఆధునికతను - ఆటవెలదులలో పొదిగి సాహితీలోకానికి అందించింది. అలవోకగా పెదవులపై ఆడే మామూలు పదాలతోనే శతకాన్ని నడిపించింది.

**- వల్లభాపురం జనార్దన**



## తొలకరి జల్లు కవిత్వం

**ఉప్పరి తిరుమలేష్**

**వెల : లేదు. పేజీలు: 70**

**ప్రతులకు: 9618961384**

సహజంగా ఒక తెలంగాణ కవి ఎంచుకునే వస్తువే ఈ సంకలనం నిండా విస్తరించింది. బోనాలు, కాళోజీ, అంబేద్కర్, జ్యోతీబాపూలే, యాదాద్రి శిల్పకళ, సావిత్రి బాయి, సినారె, మేడారం జాతరలపై రాసిన కవితలు ఈ ప్రాంతం కాని వారు రాయడం కష్టం. ఇతర కవితలలోని వస్తువు వైవిధ్యభూతమైనదే. శీర్షికలలో వాచ్యమూ, అభివ్యక్తిలో వాచ్యమూ ఇది తొలకరి కవితాసంపుటి అని చెప్పకనే చెబుతోంది.

**- డా॥ ఏనుగు నరసింహా రెడ్డి**



## అంబేద్కర్ కళామండలి పాటలు


**నాగాబత్తుల గోపాలకృష్ణ**

**వెల :30/- పేజీలు: 56**

**ప్రతులకు: 9440372046**

నాగాబత్తుల గోపాలకృష్ణ అంబేద్కర్‌ను నరనరాల నింపుకున్న మననున్న దళితుడు. ఏమి ఆశించకుండా తాను నమ్మిన అంబేద్కర్ సిద్ధాంతాన్ని ప్రచారం చేయడానికి పూనుకున్న దళిత దళపతి. దళితుల ఉద్యమాన్ని, అంబేద్కర్ ఆశయాలను, అంబేద్కర్ జీవితాన్ని పాటల్లా ఏర్చికూర్చి అందిస్తున్న వైనం గొప్ప సాహసం. తెలుగు గేయ సాహిత్యంలోనూ ప్రసిద్ధాలైన ఓలచ్చాగువ్వమ్మాడి, చందమామయ్యో, ఎన్నియాల్లో, ఉయ్యా వంటి బాణీలను తీసుకొని గోపాలకృష్ణ ఈ పాటలను కట్టాడు.

**- డా॥ గూటం స్వామి**



## బదర్ అబాబీలు

**(నూతన వచన కవితా ప్రక్రియ)**


**షేక్ కరీముల్లా**

**వెల :40/- పేజీలు: 40**

**ప్రతులకు: 9441502990**

వర్తమాన తెలుగు సాహిత్యం విస్తృతమైనది. అనేకానేక అస్తిత్వ ఉద్యమాలకు నిలయమిది. ఈ క్రమంలోనే భాషలోని సంక్లిష్టతను దూరం చేస్తూ జనసామాన్యానికి దగ్గరయ్యేలా కవిత్వం సంక్షిప్త రూపం దాల్చే దశ యిది. ఇటువంటి సందర్భంలో ముస్లిం కవులకు తమ సామాజిక సాంస్కృతిక అస్తిత్వాన్ని నిలబెట్టుకుంటూ చైతన్యం కలిగించే ఒక నూతన వచన కవితా ప్రక్రియ అవసరం అన్పించింది. ఈ ఆలోచన కలిగిందే తడవుగా "అబాబీలు" అనే నూతన వచన కవితా ప్రక్రియ ఆవిష్కరించే ఉద్దేశ్యంతో ఈ "బదర్"ను మీ ముందుకు తెస్తున్నాను.

**- షేక్ కరీముల్లా**



## ఇదీ వరస...!


**బుర్రా లక్ష్మీనారాయణ**

**వెల :100/- పేజీలు: 160**

**ప్రతులకు: 9676699300**

గాఢమైన అభివ్యక్తి, తాత్విక పరిమళం కలగలసిన కవితాలోకాన్ని సృజించారు బుర్రా లక్ష్మీనారాయణ. 'కలచాలనమ్' ద్వారా పరిచితులైన వారిలోని కవితాశక్తికి నిదర్శనం ఈ పుస్తకం. వచనమే కాదు కవిత్వమూ శక్తివంతంగా రాయగలరని చెప్పడానికి దాఖలాగా నిలిచిన పుస్తకమిది. అనేకానేక భావాల సమ్మిళితమైన ఒక వేదనానురక్తి ఈ సంపుటి నిండా పరుచుకొని వుంది. వ్యక్తిగతమూ, సామాజికమూ, ఆత్మాశ్రయమూ అనే గీతల్ని చెరిపేస్తూ లోలోపలి అలజడిని కవిత్వం చేయడానికి లక్ష్మీనారాయణ గారు ప్రయత్నించారు.

**- పాలపిట్ట బుక్స్**



## ఎన్నెల మొగ్గలు సెంద్రి తలపులు


**బుర్రా లక్ష్మీనారాయణ**

వెల : 50/- పేజీలు: 60

ప్రతులకు : 9676699300

సెంద్రి మనసును సుతారంగా ఆవిష్కరించడమే కాకుండా... ఆమెకు మట్టి రంగు చీర, నెమలి కంటంచీర, కల్లు రంగు రైక, నింగి రంగు రైక.. వంటివి కవి తన సుకుమార భావాలతో కట్టబెడతాడు. సెంద్రి సుకుమారే కాదు, మాటకారి కూడా, అందుకే 'మనసు లేని మాట రాదు, మాటలేని మనసు లేదు' అంటుంది. అలాంటి సెంద్రి తలపులు ప్రతి పాఠకుడి గుండె తలుపులు తడతాయని నేను నమ్ముతున్నాను.

**- కె.వి.యస్. వర్మ**




## నవచైతన్యం కథలు

**రేగులపాటి కిషన్‌రావు**

వెల : 100/- పేజీలు: 98

ప్రతులకు: 7396036922

రేగులపాటి కిషన్‌రావు సీనియర్ కథకులు. ఇప్పటికే సంస్కారం కథలు, ఈ తరం పెళ్ళికూతురు, అన్వేషణ, పరిమళించిన మానవత్వం వంటి కథా సంపుటాలు వెలువరించారు. నవచైతన్యం వారి తాజా కథా సంపుటి. ఈ సంపుటి 14 కథల సమాహారం. వివిధ పత్రికలలో ఇప్పటికే ప్రచురితమైన ఈ కథలు పాఠకుల ఆదరణకు నోచుకున్నాయి. ఇప్పుడు కథా సంపుటి రూపంలో పాఠకుల ముందుకు వస్తున్నాయి.



## మహాత్మాగాంధీ

**ముస్లిం సహచరులు - అనుచరులు**

**సయ్యద్ నశీర్ అహమ్మద్**

వెల :25/- పేజీలు: 32

ప్రతులకు: 9440241727

ఈ విపత్కర పరిస్థితులలో ఈ దేశంలోని అన్ని సాంఘిక జన సముదాయాల మధ్యన ఉన్న స్నేహ సోదరభావం, జాతి సమైక్యత, సమగ్రతలను మరింత పటిష్టం చేసుకోవాల్సి ఉంది. ఆ కారణంగా మన పూర్వీకులు మాతృభూమి విముక్తి పోరాటంలో ఎలా కలిసి మెలిసి ఐక్యంగా బ్రిటీష్ వలసపాలకులతో పోరాడిన చరిత్రను ప్రజల ఎరుకలోకి తేవాల్సిన ఆవశ్యకత ఏర్పడింది. అందులో భాగంగా ఉత్తేజకరమైన ఆప్పటి చరిత్రను ఈ పుస్తకం మనముందుకు తెస్తున్నది.

**- హాజి ఫారూఖ్ షుబ్లి**



## మానని గాయం కవిత్వం


**ఆవుల వెంకటేసులు**

వెల : 120/- పేజీలు: 140

ప్రతులకు: 9553421435

మానవ ప్రేమ ఆయన అక్షరాల పరమార్థం. సహజ పరివర్తన ఆయన పదాల కాంక్ష. నాగరికత పేరుతో చెలరేగే విచ్చలవిడి తనం, బాధ్యతలేని రాజకీయ వ్యవస్థ, కాలం చెల్లిన సామాజిక అవశేషాల విజృంభణ, స్వార్థపూరిత మానవ ప్రవర్తన వంటివి ఆయనకు శత్రువులు. చెప్పదలచుకున్న విషయాన్ని విలువలతో కూడిన భాషలో అభివ్యక్తం చేయడానికి వెంకటేశులు ఈ కావ్యమంతా ప్రయత్నించాడు.

**- ఆచార్య రాచపాళెం చంద్రశేఖర రెడ్డి**



## చెరుకు గడల తూణీరాలు


**గడల శివప్రసాద్**

వెల :60/- పేజీలు:

ప్రతులకు: 9494229437

గడల తీసుకువస్తున్న మూడవ కవితా సంపుటి ఇది. 2014లో "చెరుకు గడల నానీలు" అనే పేరుతో తియ్యటి నానీలను తెలుగు పాఠకులకు అందించారు. 2016లో సమాజంలోని వివిధ అస్తవ్యస్త విధానాలపై "చెరుకుగడల కొరడాలు"ను ఝుళిపించారు. ఇక ఇప్పుడు ఆ తరువాత సంభవించిన అనేకానేక సామాజిక అనమానతలపైన, రాజకీయ విధానాలపైన, నిరంతరం వెంటాడే అనేక జ్ఞాపకాలపైన స్పందిస్తూ ఈ "చెరుకుగడల తూణీరాలు' సంధిస్తున్నారు.

**- జోశ్యుల కృష్ణబాబు**



## దుఃఖపు ఎరుక కవిత్వం

**అద్దేపల్లి ప్రభు**

వెల :100/- పేజీలు: 88

ప్రతులకు: 9848930203

ఒక తొలిపొద్దు మైదానంలో/ నలిగిన గడ్డిలో నీ పాదముద్రని చూశాను / గరిక్కొనన పొటమరించిన బిందువు మీద / నీ ఉనికి గంధాన్ని ఊహిస్తాను /నలిగిన గడ్డీ అణిగిన నేలా నీ /జంగమ రహస్యాన్ని లీనం చేసుకుంటాయి / నీ స్పర్శకి ఎరుపు దౌలు పద్ద పరిసరాలన్నీ / గరిక పచ్చ చాప కింద తడి ఊపిరి / దారి పోసుకుంటూ పాకుతుంటాయి / నాకే కోకిల జొన్న గింజ కన్నులోనైనా / నీ రాత్రులే కనిపిస్తాయి / అలసిన రాత్రి నొసటన నీవద్దిన పెదాల ఆనమాలై / తెల్లవారుతుంది.

**- అద్దేపల్లి ప్రభు**

## విజయవాడలో మార్చి 15న భారత కవనం

### లౌకిక రాజ్యాంగ పరిరక్షణ సమ్మేళనం

విజయవాడలోని ఎం.బి. విజ్ఞానకేంద్రంలో సాహితీస్రవంతి, ఎం.బి. విజ్ఞానకేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో మార్చి 15న మాకినేని బసవపున్నయ్య విజ్ఞానకేంద్రం ఆడిటోరియంలో 'భారత కవనం – లౌకిక రాజ్యాంగ పరిరక్షణ సమ్మేళనం' పేరిట సదస్సు జరుగుతుంది. ఈ కార్యక్రమంలో భారతీయ సమాజం, రాజ్యాంగం, రచయితలు వంటి అంశాలపై సదస్సులు జరుగుతాయి. ఈ సదస్సులలో ప్రముఖ రచయితలు, మేధావులు, విద్యావేత్తలు పాల్గొని ప్రసంగిస్తారు. ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకూ జరిగే సదస్సులో జనకవనం ఉంటుంది. ఈ జనకవనంలో ప్రముఖ కవులతో పాటు ఔత్సాహిక కవులూ పాల్గొని తమ స్వీయ కవితలు చదవడానికి అవకాశం ఉంటుంది. ఈ కార్యక్రమంలో కవులు, రచయితలు పెద్దయెత్తున పాల్గొనవలసిందిగా కోరుతున్నాం. జనకవనంలో పాల్గొనే కవులు తమ పేర్లను నమోదు చేసుకోవలసిందిగా కోరుతున్నాం. వివరాలకు వొరప్రసాద్ – 9490099059, సత్యరంజన్ – 8341951645, కె. లక్ష్మయ్య – 9490099057 సంప్రదించగలరు. ♦

## కవితా సంపుటాలకు ఆహ్వానం

కొత్తపల్లి సురేంద్రబాబు సాహిత్య పురస్కారం – 2020 కోసం కవితా సంపుటాలను ఆహ్వానిస్తున్నట్లు కవిసమ్మేళనం సాహిత్యవేదిక తరపున అక్షరమాలి సురేష్ ఒక ప్రకటనలో కోరారు. మార్చి 15 లోగా తమ కవితా సంపుటాలను అక్షరమాలి సురేష్, 6–2–982–3, రాంనగర్ ఎక్స్‌టెన్షన్, వెంకటేశ్వర టెంపుల్ దగ్గర, అనంతపురం – 515004 చిరునామాకు పంపించవలసిందిగా కోరారు. ఇతర వివరాలకు 9493832470 ద్వారా సంప్రదించవచ్చును. ♦

## పెన్నా సాహిత్య పురస్కారం - 2020

పెన్నా రచయితల సంఘం గత 10 సంవత్సరాల నుండి కవితా సంపుటాలకు, కథాసంపుటాలకు సాహితీ అవార్డును అందజేయడం జరుగుతుందని పెన్నా రచయితల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మోపూరు పెంచల నరసింహం, అవ్వారు శ్రీధర్ బాబు సంయుక్తంగా ఒక ప్రకటనలో తెలిపారు. 2020 పెరసం అవార్డు నిమిత్తం రెండు తెలుగు రాష్ట్రాల నుండి 2019 జనవరి నుండి 2019 డిసెంబర్ మధ్య ప్రచురితమైన కవితా సంపుటాలను ఆహ్వానిస్తున్నామన్నారు. ఎంపిక అయిన కవికి పెన్నా రచయితల సంఘం 11 వ వార్షికోత్సవంలో సత్కరించి, నగదు పురస్కారం అందజేయనున్నట్లు తెలిపారు. మార్చి 31 లోపు నాలుగు పుస్తకాలను ఈ క్రింది అడ్రస్ కు పంపించవలసినదిగా కోరారు. శ్రీధర్ బాబు, 23 – 1– 57, పెండెం వారి వీధీ, ఫత్తేఖాన్ పేట, నెల్లూరు – 524003. ఇతర వివరాలకు 8500130770, 9346393501 ద్వారా సంప్రదించవచ్చును. ♦



*సాహితిమిత్రులు ఆధ్వర్యంలో ఫిబ్రవరి 16న విజయవాడలో టాగూర్ గ్రంథాలయంలో జరిగిన అనిల్ డ్యాని కవితా సంపుటి 'స్పెల్లింగ్ మిస్టేక్' ఆవిష్కరణ సభ. చిత్రంలో పుప్పాల శ్రీరామ్, అనిల్ డ్యాని, జుజ్జూరి వేణుగోపాల్, వాసిరెడ్డి రమేష్, చల్లపల్లి స్వరూపరాణి, బండ్ల మాధవరావు.*



*సాహితిమిత్రులు ఆధ్వర్యంలో ఫిబ్రవరి 15న విజయవాడలో టాగూర్ గ్రంథాలయంలో జరిగిన అరుణ్‌సాగర్ సంస్మరణ సభ. చిత్రంలో ఖాదర్ మొహియుద్దీన్, ప్రసాదమూర్తి, దేవిప్రియ, గుంటూరు లక్ష్మీనరసయ్య, కూనపరాజు కుమార్, వడ్లమూడి పద్మ.*

## పి. సత్యవతికి కేంద్ర సాహిత్య అకాడమీ అనువాద పురస్కారం



ప్రముఖ రచయిత్రి పి. సత్యవతికి కేంద్ర సాహిత్య అకాడమీ 2019 అనువాద పురస్కారం లభించింది. జనవరి 1, 2013 నుంచి డిసెంబరు 2017 మధ్యకాలానికి చెందిన అనువాద పుస్తకాల్లో వివిధ భాషలకు చెందిన 23 మంది రచయితలను కేంద్ర సాహిత్య అకాడమీ 2019 అనువాద అవార్డుకు ఎంపిక చేసినట్లు అకాడమీ వెబ్‌సైట్‌లో ప్రకటించారు. తమిళనాడుకు చెందిన ఎ. రేవతి రచించిన 'ద ట్రూత్ ఎబౌట్ మి: ఏ హిజ్రా లైఫ్ స్టోరీ'ని సత్యవతి 'ఓ హిజ్రా ఆత్మకథ' గా తెలుగులోకి అనువదించారు. పి. సత్యవతి విజయవాడలోని ఎస్.ఎ.ఎస్. కళాశాలలో అధ్యాపకురాలిగా పనిచేసి రిటైరయ్యారు. పలు కథా సంపుటాలు వెలువరించారు. 'పి. సత్యవతి కథలు' పేరిట విశాలాంధ్ర ప్రచురణాలయం వీరి కథలు ప్రచురించింది. ఈ పురస్కారాన్ని ఎంపిక చేసిన న్యాయనిర్ణేతల బృందంలో శాంతాసుందరి, స్వాతిశ్రీపాద, డా॥ వెన్నా వల్లభరావు ఉన్నారు. ఈ పుస్తకాన్ని తెలుగు నుండి ఉత్తమ్ చంద్ర బ్రహ్మ ఇంగ్లీషులోకి అనువదించారు. ఢిల్లీలో జరిగే ఓ కార్యక్రమంలో సాహిత్య అకాడమీ అవార్డు – 2019 అందుకోనున్నారు. విజేతలకు రూ. 50 వేల నగదు, తామ్రపత్రం అందజేస్తారు. ♦

## సమన్విత, కోపూరి ఛారిటబుల్ ట్రస్టు కథల పోటీ ఫలితాలు

సమన్విత, కోపూరి ఛారిటబుల్ ట్రస్టు సంయుక్తంగా 2019 సంవత్సరంలో 'ట్రాన్స్‌జండర్' వ్యక్తుల జీవితాలలోని సమస్యలు, పరిష్కారాలు అంశంపై ఆహ్వానించిన కథల పోటీల ఫలితాలను డాక్టర్ డి. శమంతకమణి, కోపూరి పుష్పాదేవి ఒక ప్రకటనలో తెలియజేశారు. మొదటి బహుమతి పి.వి.ఆర్. శివకుమార్ రాసిన 'కసారా నుండి రైలు', రెండవ బహుమతి డా. రమణ యశస్వి రాసిన 'తోటమాలి చమత్కారం, మూడవ బహుమతి కోయిలాడ రామ్మోహనరావు రాసిన 'మానవత్వం' కథలకు లభించాయి. మరో 12 కథలకు కన్సోలేషన్ బహుమతి ప్రకటించారు. కన్సోలేషన్ బహుమతులు పొందినవారు: పన్నాల సాయిశ్రీ పద్మశ్రీ – 'రంగుటద్దం', ముసునూరు నారాయణ– 'ప్రేమ బృందావనం', అనుసూరి వెంకటేశ్వరరావు – 'మీతో మేము', ఆవుల వెంకటేశులు – 'చీకటి జాబిలి', దినవహి సత్యవతి – 'కొత్త చిగుర్లు', కె. తాయారమ్మ – ఏది పాపం... ఏది పుణ్యం', ఎ. సరళ – వైఖరిలో మార్పు రావాలి', వంజరి రోహిణి – 'విజేత', వురిమళ్ళ సునంద – 'మాకూ మనసుంది', తాటికోల పద్మావతి – 'కొత్తదారి', కుంచనపల్లి శ్రీలక్ష్మి – 'వికసిత కుసుమం', చొక్కర తాతారావు– 'పంజరం'. మార్చి 28వ తేదిన విజయవాడలోని ఎం.బి. విజ్ఞానకేంద్రంలో జరగబోయే సభలో 15 కథలతో పుస్తకావిష్కరణ జరగనుందని తెలిపారు. ♦


**FORM IV**

(Rule 8)

UNDER PRESS AND REGISTRATION OF BOOKS ACT, 1867
STATEMENT ABOUT OWNERSHIP AND OTHER PARTICULARS
ABOUT MONTHLY -SHAITYA PRASTHANAM

| | | |
|---|---|---|
| 1. Place of Publication | : | Vijayawada |
| 2. Periodicity of its Publication | : | Monthly |
| 3. Printer's Name | : | V. Krishnaiah |
| 1 (a) Whether a citizen of India | : | YES |
| (b) If a foreigner, the country of origin | : | - |
| Address | : | H.No. 27-30-4, MB Vignana kendram, Akulavari veedhi, Governorpet, Vijayawada - 520002 |
| 4. Publisher's Name | : | V. Krishnaiah |
| 1 (a) Whether a citizen of India | : | YES |
| (b) If a foreigner, the country of origin | : | - |
| Address | : | H.No. 27-30-4, MB Vignana kendram, Akulavari veedhi, Governorpet, Vijayawada - 520002 |
| 5. Editor's Name | : | T. RAVI |
| Nationality | : | INDIAN |
| 1(a) Whether a citizen of India | : | YES |
| (b) If a foreigner, the country of origin | : | - |
| Address | : | H.No. 27-30-4, MB Vignana kendram, Akulavari veedhi, Governorpet, Vijayawada - 520002 |
| 6. Name and addresses of owner | : | V. Krishnaiah |
| 1(a) Whether a citizen of India | : | YES |
| (b) If a foreigner, the country of origin | : | - |
| Address | : | H.No. 27-30-4, MB Vignana kendram, Akulavari veedhi, Governorpet, Vijayawada - 520002 |

**I, V. KRISHNAIAH, here by declare that the particulars given above are true to the best of my knowledge and belief.**

Sd/
V. KRISHNAIAH
Publisher

Date: 01.03.2020

# మాక్సిం గోర్కీ


(1868 - 1936)



ప్రముఖ రష్యన్ రచయిత, కథలు, నవలలు ఎన్నో రాశాడు. నిరుపేదగా, కూలీగా బతికాడు.
ఇతని రచనలు ముఖ్యంగా 'అమ్మ' విప్లవానికి ఎంతో తోడ్పడ్డాయి.
మార్చి 16 గోర్కీ వర్ధంతి


SAHITYA PRASTHANAM ▪ SAMPUTI - 1 ▪ SANCHIKA - 6 ▪ KRISHNA ▪ MARCH 2020
RNI N0.APTEL/ 2004/18396 ▪ Postal Regd. No.VJ/187/2020-22 PAGES: 68
Date of Posting : 1st & 2nd of Every Month ▪ Date of Publication: 28.02.2020


# ప్రజాశక్తి బుక్‌హౌస్ తాజా ప్రచురణలు




పండుగలు - ప్రజాదృక్పథం పేజీలు 48 రూ.40/-

మనం నిత్యం జరుపుకునే పండుగలు, ఉత్సవాలు, జాతరలు, కొలుపులు మొదలైనవన్నీ మన సంస్కృతిలో భాగం. ఇవన్నీ మతపరమైనవి కావు. కొన్ని పండుగలు పూర్తిగా మానవుని ఉత్పత్తికి సంబంధించి- అంటే వ్యవసాయం, పశుపోషణ వంటి వాటికి సంబంధించి ఉంటాయి. కొన్ని ప్రకృతిపై మానవుడు విజయం సాధించిన సందర్భాన్ని పురస్కరించుకుని జరుగుతుంటాయి. కొన్ని పండుగలు పూర్తిగా మతనమ్మకాలు, కథలపై ఆధారపడి ఉంటాయి. అయితే వీటన్నిటినీ ఇలా పూర్తిగా విడదీసి చూడ్డం కూడా కష్టం. వాటిని ఏవిధంగా చూడాలి అన్న ప్రశ్నకు సమాధానం ఈ చిన్న పుస్తకం.




## ప్రతిభామూర్తులు పసిడి పలుకులు

పేజీలు 80
రూ.65/-

వివిధ రంగాల్లో నిష్ణాతులైన కొందరి ప్రతిభా మూర్తుల ఇంటర్వ్యూల సమాహారం ఈ 'ప్రతిభా మూర్తులు - పసిడిపలుకులు' పుస్తకం.. నాట్యం, సినిమా, ఫొటోగ్రఫీ, శిల్పకళ, సాహిత్యం, మిమిక్రీ తదితర రంగాలలో వెలుగొందిన, వెలుగొందుతున్న వారి జీవిత అనుభవాల సారమంతా ఈ చిన్ని పుస్తకంలో లభ్యమవుతుంది.


## వేద సాహిత్యం
### ఒక చారిత్రక పరిశీలన




పేజీలు 32
రూ.25/-

15 వేల ఏళ్ల సుదీర్ఘ కాల వ్యవధిలో రూపొందిన వేద వాఙ్మయపు అభివృద్ధి గతిని గురించి తెలుసుకోవాలంటే ప్రాచీన భారతీయ చరిత్రలోని తొలి ఘట్టాల వరకు వెళ్ళాలి. వీటన్నింటికి సంబంధించిన సమగ్ర సమాచారం ఈ పుస్తకంలో లభిస్తుంది.

## గౌతమ బుద్ధుడు - బౌద్ధతత్వం



పేజీలు 32
రూ.25/-

బుద్ధుడి మూల బోధనలు, సిద్ధాంతాల నుంచి తరువాత కాలంలోని బౌద్ధధర్మం ఎంత దూరంగా మళ్ళిందో నిర్ధా రించడానికి ఈ పుస్తకంలో అనేక ఉదాహరణలు పేర్కొనబడ్డాయి.

బౌద్ధతత్వంలోని ప్రయోజనకరమైన అంశాలను అధ్యయనం చేయడం, అదేవిధంగా బౌద్ధధర్మం చరిత్రకు సంబంధించిన మరుగునపడ్డ అసలు వాస్తవాలను వెలికితీసి గౌతమ బుద్ధుని మూల సిద్ధాంతాల సారాంశం వివరించడమే ఈ పుస్తకం ఉద్దేశం.

## భారతీయ భౌతికవాదం
## లోకాయత




పేజీలు 32
రూ.25/-

భారతీయ భౌతికవాదం మొదటినుంచి ఆధునికయుగం వరకు ప్రపంచంలో అన్నిచోట్లలాగే భారతదేశంలోనూ భౌతికవాద భావస్రవంతి కొనసాగుతూనే వచ్చిందని బలమైన ఆధారాలతో ఋజువు అయ్యింది. అటువంటి భౌతికవాద భావస్రవంతిలో ఒకటైన లోకాయత గురించి వివరించేదే ఈ పుస్తకం.

## ప్రజాశక్తి బుక్‌హౌస్

27-1-54, కారల్‌మార్క్స్ రోడ్, గవర్నర్‌పేట, విజయవాడ - 2, ఫోన్ : 0866 - 2577533
**బ్రాంచీలు :** విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి, గుంటూరు, కాకినాడ,ఏలూరు, విజయనగరం, ఒంగోలు, నెల్లూరు, కర్నూలు, అనంతపురం


**If Un delivered please return to: Prasthanam, C/o M.B. Vignana kendram, 27-30-4, 3rd Floor Akulavari veedhi, Governorpet, Vijayawada - 520002. Ph: 0866-2577248, Cell: 9490099059**